ప్రజా కలం Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

# ప్రజా కలం

Published From Nizamabad

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

PRGI No.TELTEL/2010/33275

ప్రజా కలం PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

సోమవారం | 07-09- 2026 | సంపుటి: 17, సంచిక: 156, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆



ప్రగతి దిశగా ధర్మపురి "ఉగ్ర నరసింహస్వామి" ఆలయం

## ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్ల నిధులు మంజూరు

**-ఆనందం వ్యక్తం చేస్తున్న భక్తులు**

**-భూమి పూజకు హాజరుకానున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**



వెల్గటూర్, సెప్టెంబర్ 6, ప్రజాకలం, ప్రతినిధి : జగిత్యాల జిల్లా, ధర్మపురి పట్టణంలో గల ప్రముఖ పుణ్యక్షేత్రం " శ్రీ లక్ష్మీనరసింహస్వామి " ఆలయం ప్రగతి దిశగా ముందుకు సాగానుంది. ఆలయ పరిస్థితులు, భక్తుల అవసరాలను గుర్తించిన ప్రభుత్వం ఉగ్ర నరసింహ స్వామి ఆలయంలో అభివృద్ధి పనులు చేసేందుకోసం రూ. 10 కోట్ల నిధులను కేటాయించింది.

తరువాయి 2వ పేజీలో...

# ప్రాజెక్టుల్లో నీళ్లున్నా ఎందుకివ్వరు..?



**- లక్షలాది మందితో మరో జలయుద్ధం**
**- కాళేశ్వరంపై నిర్లక్ష్యాన్ని ఇక సహించం**
**- ఎన్డీఎస్ఏ రిపోర్టుతోనైనా కళ్లు తెరవాల్సిందే**
**- మౌనం వీడుదాం.. క్షేత్రంలోకి దిగుదాం**
**- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు**

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (ప్రజా కలం ప్రతినిధి) తెలంగాణ ఉద్యమం సాగింది, త్యాగాలు చేసి రాష్ట్రాన్ని తెచ్చుకున్నది సాగు, తాగు నీటి కోసమే.. తెలంగాణకు జీవధార కాళేశ్వరం ప్రాజెక్టుల పై కాంగ్రెస్ సర్కార్ చేసిందంతా దుష్ప్రచారమే.. కుట్ర పూరితంగానే నీటిని ఎత్తిపోయడం లేదనే వాస్తవం ఎన్డీఎస్ఏ ప్రకటనతో స్పష్టమైపోయింది. ఈ నేపథ్యంలోనైనా ప్రభుత్వం కళ్లు తెరిచి నీటిని ఎత్తిపోసేందుకు చర్యలు చేపట్టాలి' అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో 90 శాతం పూర్తయిన పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని ఎందుకు విని యోగంలోకి తేవడం లేదని ప్రశ్నించారు. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల్లో నీళ్లు ఉన్నా తెలంగాణలోని పంటలకు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. సాగు, తాగునీటి విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై కాంగ్రెస్ ప్రభుత్వం తో మరో జలయుద్ధానికి సిద్ధం కావాలని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించి పార్టీలోని ఇతర ముఖ్య నేతలతో కలిసి చర్చించి, త్వరలోనే ప్రత్యక్ష కార్యాచరణకు విధివిధానాలు ఖరారు చేస్తామన్నారు. సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో బీఆర్ఎస్ఎల్పీ సంయుక్త సమావేశాన్ని అధినేత కేసీఆర్.. ఆదివారం ఎర్రవల్లిలో నిర్వహించారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలపై చర్చించే వేదికగా కాకుండా బూతు కూతలకు వేదికగా మార్చడం పట్ల కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

నోటికి ఎంత వస్తే అంత మాట్లాడుతూ ప్రతిపక్ష సభ్యులను సభలో తులనాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను ఉభయ సభల్లో తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్ట్‌ల జలాలను తెలంగాణ రైతాంగానికి అందకుండా పక ?కరాష్ట్రం ఉపయోగించుకునేలా కాంగ్రెస్ ప్రభుత్వం సహకరిస్తున్నదని మండిపడ్డారు. కట్టిన ఇల్లు, పెట్టిన పొయ్యిలా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం 90 శాతం పూర్తయినా, కృష్ణా జాలాలను ఎత్తిపోసి ఉమ్మడి నల్లగొండ, పాలమూరు, రంగారెడ్డి జిల్లాల ప్రజలకు సాగు, తాగునీటిని ఎందుకు అందించలేక పోతున్నారని ప్రశ్నించారు. మేడిగడ్డ దగ్గర చిన్నపాటి మరమ్మతులు చేసి కాళేశ్వరం ప్రాజెక్టులను వినియోగంలోకి తెస్తే దాదాపు 13 జిల్లాల్లో రైతులు పంటలు పండించుకునే అవకాశం ఉంటుందని కేసీఆర్ వివరించారు. అయినా ఆ దిశగా ప్రభుత్వం ఎందుకు చర్యలు చేపట్టడం లేదో ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరంపై ఇకనైనా నిర్లక్ష్యం వీడకపోతే, తానే స్వయంగా లక్షలాది మందితో కార్యాచరణ ప్రకటిస్తానని కేసీఆర్ హెచ్చరించారు. సాగునీటి కోసం మరో యుద్ధానికి సిద్ధమవుదామని పిలుపునిచ్చారు. అదే విధంగా సోమవారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ఉభయ సభల్లో పార్టీ సభ్యులు అనుసరించాల్సిన వ్యూహంపై అధినేత కేసీఆర్ పలు సలహాలు, సూచనలు ఇస్తూ సుదీర్ఘ చర్చ జరిపారు.

# ప్రశ్నలకు జవాబు చెప్పలేక.. డైవర్షన్ పాలిటిక్స్!

**ప్రతిపక్ష గొంతు నొక్కితే ఊరుకోం.. హామీలు ఏమయ్యాయి రేవంత్ సర్కార్?**

**- ప్రజా సమస్యలపై చర్చకు రావాలి -ప్రజలను మభ్యపెట్టే రాజకీయాలు ఆపాలి**

**-ప్రతిపక్ష ఎమ్మెల్యేల గొంతు నొక్కితే తీవ్ర పరిణామాలు**

**-అవసరమైతే స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం: మాజీ మంత్రి హరీష్‌రావు**



గజ్వేల్ సెప్టెంబర్ 6 (ప్రజా కలం ప్రతినిధి) ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్‌రావు ఆరోపించారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఆదివారం బీఆర్ఎస్ఎల్పీ సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం హరీష్‌రావు మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బీఆర్ఎస్ లేవనెత్తుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ప్రభుత్వం పక్కదారి పట్టించే రాజకీయాలు చేస్తోందని ఆయన విమర్శించారు. డైవర్షన్ రాజకీయాలకు స్వస్తి పలికి, బీఆర్ఎస్ లేవనెత్తుతున్న ప్రజా సమస్యలపై ప్రభుత్వం చర్చకు రావాలని డిమాండ్ చేశారు.

**హామీలు ఏమయ్యాయి?**

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని కేసీఆర్ ఇంతకాలం వేచి చూశారని హరీష్‌రావు తెలిపారు. కేసీఆర్ ఎప్పుడూ ప్రజల సంక్షేమం, సమస్యల పరిష్కారం గురించే ఆలోచించే నాయకుడని, తామంతా ఆయన తయారు చేసిన సైనికులమని అన్నారు. దేవుళ్లపై ఒట్లు వేసి రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఆ హామీని విస్మరిస్తోందని ఆరోపించారు.

**పాలమూరు--రంగారెడ్డిపై కేసీఆర్ పోరుబాట**

పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టుపై కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగి పోరాటం చేయబోతున్నారని హరీష్‌రావు వెల్లడించారు. బీసీ, ఎస్సీ సబ్‌ప్లాన్ అమలు చేయకుండా, డిక్లరేషన్ ఇవ్వకుండా ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు.

**ప్రతిపక్ష గొంతు నొక్కితే.. అవిశ్వాసం**

అసెంబ్లీ స్పీకర్ న్యాయబద్ధంగా వ్యవహరించాలని, ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు సభలో మాట్లాడేందుకు తగిన సమయం కేటాయించాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు. ప్రతిపక్ష సభ్యులకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా వారి గొంతు నొక్కే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అవసరమైతే స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెడతామని స్పష్టం చేశారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడికి గౌరవం ఇవ్వకుండా సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో మాట్లాడుతున్న తీరును ఆయన తప్పుబట్టారు. సభలో గౌరవప్రదమైన భాషను ఉపయోగించాలని సూచించారు. ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలవాల్సిన అసెంబ్లీ ప్రస్తుత పరిణామాలతో గౌరవ సభ కాకుండా కౌరవ సభగా మారుతోందని హరీష్‌రావు వ్యాఖ్యానించారు. ప్రజలు ఏం కోరుకుంటున్నారో తెలుసుకుని వారి తరఫున ప్రశ్నించేందుకు బీఆర్ఎస్ సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.



## మంత్రి శ్రీధర్‌బాబుతో నీతి ఆయోగ్ సభ్యుడు డా. వీకే సారస్వత్ భేటీ

**'తెలంగాణ సిలికాన్ ఫోటోనిక్స్ మిషన్'కు వ్యూహాత్మక రోడ్‌మ్యాప్‌ను రూపొందించడంపై చర్చ**

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (ప్రజా కలం ప్రతినిధి) నీతి ఆయోగ్ సభ్యుడు డా. వీకే సారస్వత్ ఆదివారం డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సిలికాన్ ఫోటోనిక్స్ రంగంలో ఉన్న అవకాశాలను తెలంగాణ అందిపుచ్చుకునేలా 'తెలంగాణ సిలికాన్ ఫోటోనిక్స్ మిషన్'కు దశలవారీ వ్యూహాత్మక రోడ్‌మ్యాప్‌ను రూపొందించడంపై ప్రధానంగా చర్చించారు. ఫోటోనిక్స్ వ్యాలీ కార్పొరేషన్ భవిష్యత్ కార్యాచరణ, ఇండియా సెమీకండక్టర్ మిషన్--2.0తో 'తెలంగాణ సిలికాన్ ఫోటోనిక్స్ మిషన్'ను అనుసంధానించేందుకు గల అవకాశాలపై సమీక్షించారు. రాష్ట్రంలో పరిశోధన నుంచి వాణిజ్య స్థాయి తయారీ వరకు సమగ్ర సిలికాన్ ఫోటోనిక్స్ ఎకోసిస్టమ్ అభివృద్ధి చేయడం, డిజైన్, పరిశోధన, తయారీ, ప్యాకేజింగ్, టెస్టింగ్, సరఫరా వ్యవస్థలను అనుసంధానించడంపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. పరిశోధన ఫలితాలను వాణిజ్యపరమైన సాంకేతిక పరిష్కారాలు, ఉత్పత్తులుగా మలిచేలా పరిశ్రమలు, విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. రాబోయే రోజుల్లో అధునాతన ఫోటోనిక్ ప్యాకేజింగ్, కో-ప్యాకేజ్డ్ ఆప్టిక్స్ లాంటి తదుపరి తరం సాంకేతికతల్లో తెలంగాణను కీలక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. అందుకు అనుగుణంగా నిపుణులు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమలతో కలిసి సమగ్ర కార్యచరణ ప్రణాళికను రూపొందించడంపై ఇప్పటి నుంచే దృష్టి సారించామన్నారు. త్వరలో ఏర్పాటు చేయనున్న 'సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ క్వాంటం కంప్యూటింగ్'లో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని డా. వీకే సారస్వత్‌ను మంత్రి శ్రీధర్‌బాబు ఆహ్వానించారు. ఫోటోనిక్స్, క్వాంటం కంప్యూటింగ్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే అడ్వైజరీ కౌన్సిల్‌కు నేతృత్వం వహించాలని కూడా కోరారు. ఫోటోనిక్స్, క్వాంటం కంప్యూటింగ్ లాంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో తెలంగాణతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని డా.వీకే సారస్వత్ పేర్కొన్నారు. ఈ రంగాల్లో పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు తనవంతు సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తానన్నారు. సమావేశంలో ఐటీఈడీసీ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, ఫోటోనిక్స్ వ్యాలీ కార్పొరేషన్ సీఈవో ఏఎస్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (ప్రజా కలం ప్రతినిధి) తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 10 గంటలకు సభ సమావేశాలు ప్రారంభమవుతాయి. సభ ప్రారంభంలోనే ప్రశ్నోత్తరాల కార్యక్రమం కొనసాగనుంది. సభ ముందుకు మూడు కీలక నివేదికలు రానున్నాయి. TSS 2024-25 ఆడిట్ నివేదికను ముఖ్యమంత్రి ప్రవేశపెట్టనున్నారు. అలాగే PM SHRI 2024-25 ఆడిట్ నివేదిక కూడా సభ ముందుకు రానుంది. హైదరాబాద్ మెట్రోకు సంబంధించిన ఐదు వార్షిక నివేదికలను కూడా సభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ నివేదికలను ముఖ్యమంత్రి సభ ముందుకు తీసుకురానున్నారు. కంపెనీల చట్టంలోని సెక్షన్ 395 ప్రకారం ఈ నివేదికలను అసెంబ్లీలో సమర్పించనున్నారు.



ప్రజా కలం PRAJA KALAM Telugu Daily
ప్రకటనలకు ఆహ్వానం
క్లాసిఫైడ్స్
లీగల్ నోటీసులు
ప్రారంభోత్సవం
స్వదేశాగమనం
షష్టిపూర్తి మహోత్సవం
జన్మదిన శుభాకాంక్షలు
షష్టిపూర్తి మహోత్సవం
వివాహ మహోత్సవం
శ్రద్ధాంజలి
పదవీ విరమణ
అన్ని రకముల ప్రకటనలకు సంప్రదించండి
94403 52123, 9010972526
79939 41570, 80083 72900
95535 39999, 98490 07793

# ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్ల నిధులు మంజూరు



మొదటి పేజీ తరువాయి...

ఎన్నో ఏళ్ల నాటి చరిత్ర కలిగిన ధర్మపురి క్షేత్రంలోని ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించడంతో ధర్మపురి క్షేత్రంలోని ఉగ్ర నరసింహస్వామి ఆలయం రూపు రేఖలు పూర్తిగా మారనుండటంతో భక్తులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆలయ అభివృద్ధి పనులకు తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లు సోమవారం ధర్మపురిలో భూమి పూజ నిర్వహించి ఆలయ అభివృద్ధి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు.

**ధర్మపురి ఆలయ చరిత్ర:**

దక్షిణ కాశీగా పేరొందిన తెలంగాణలోని ప్రసిద్ధ నవనారసింహ క్షేత్రాలలో ఒకటైన ధర్మపురి శ్రీ యోగనంద లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం అత్యంత చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతకు నిలయంగా పేరు పొందింది.

పూర్వం 'ధర్మవర్మ' అనే మహారాజు ఈ ప్రాంతాన్ని పరిపాలించడం వలన దీనికి 'ధర్మపురి' అనే పేరు వచ్చిందని చరిత్రకారులు చెబుతున్నారు. క్రీ.శ. 850--928 కాలం నాటికంటే ముందుగా ఉన్నట్లుగా భావించే ఈ ఆలయం, 1422---1436 మధ్య బహుమనీ సుల్తానుల దండయాత్రలలో ధ్వంసమైనట్లు చరిత్ర కారులు చెబుతున్నారు. 17వ శతాబ్దంలో తిరిగి ఈ ఆలయం పునరుద్ధరించబడినట్లు ఇక్కడ లభించిన శాసననాల ద్వార తెలుస్తుంది. ప్రధాన దైవమైన శ్రీ యోగనంద లక్ష్మీనరసింహస్వామి వారు సాలగ్రామ శిలగా వెలసి ఉన్నారు.

**దక్షిణ కాశీగా మరియు త్రిమూర్తి క్షేత్రంగా ఖ్యాతి:**

గోదావరి నది ఈ క్షేత్రానికి ఆనుకుని దక్షిణ వాహినిగా ప్రవహిస్తుండటంతో ధర్మపురి 'దక్షిణకాశీ'గా, 'తీర్థరాజముగా' మరియు 'హరిహర క్షేత్రముగా' ప్రసిద్ధి చెందింది. ఈ ప్రాంగణంలో బ్రహ్మదేవుడు, విష్ణు స్వరూపుడైన నరసింహస్వామి, శ్రీ రామలింగేశ్వరస్వామి కొలువుదీరి ఉండటంతో ఇది 'త్రిమూర్తి క్షేత్రం'గా పిలువబడుతోంది. అంతేకాకుండా, భారతదేశంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ శ్రీ యమధర్మరాజు ఆలయం కూడా ఉండటం విశేషం. "ధర్మపురికి వచ్చిన వారికి యమపురి ఉండదు" అనే ప్రగాఢ నమ్మకం భక్తులలో ఉంది.

**ధర్మపురి ప్రత్యేకతలు మరియు విశ్వాసాలు:**

-వేదాలు, సంస్కృతి, సంగీతం, సాహిత్యం, కవిత్వానికి ధర్మపురి పుట్టినిల్లుగా విరాజిల్లుతోంది.

- ఇక్కడ గోదావరి నదిలో బ్రహ్మగుండం, సత్యవతి గుండం, యమగుండం, పాలగుండం, చక్రగుండం అనే పుణ్య గుండాలు ఉన్నాయి.
- దత్తాత్రేయ పురాణం ప్రకారం.. దక్షిణ వాహినిగా ప్రవహించే గోదావరిలో మూడు పర్యాయాలు స్నానమాచరించి స్వామివారిని దర్శిస్తే, మూడు జన్మల పాపాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం.
- పామునే పతిగా పొందిన సత్యవతీదేవి ఎన్నో క్షేత్రాలు తిరిగినప్పటికీ ఫలితం లేక, ధర్మపురిని సందర్శించి గోదావరిలో స్నానమాచరించగా సర్పరూపం తొలగి సుందర పురుష రూపం పొందినట్లు స్థల పురాణం చెబుతోంది.

**రూ.10 కోట్లతో ఆలయం లో చేసే అభివృద్ధి:**

ధర్మపురి లోని ఉగ్ర నరసింహ స్వామి ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ. 10 కోట్లు కేటాయించింది. ప్రస్తుతం ఉన్న ఉగ్ర నరసింహ ఆలయం 990 స్క్వేర్ ఫీట్ల వెడల్పులో ఉండడంతో రోజుకు పెరుగుతున్న భక్తుల సంఖ్యకు అనుగుణంగా ఆలయాన్ని విస్తరించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మరో వందేళ్ల వరకు వచ్చే భక్తుల సంఖ్యకు తగ్గట్టుగా ఆలయాన్ని తీర్చిదిద్దడానికి ప్రభుత్వం ప్రముఖ స్తపతుల ద్వారా ఆగమ శాస్త్ర ప్రకారం పునర్ నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఆలయ పునర్ నిర్మాణం కోరకు ఇప్పటికే ధర్మపురిలో వేద బ్రాహ్మణులు, అగ్రహారం పెద్దలతో పాటు ప్రజల అభిప్రాయాలు సేకరించారు. ఉగ్ర నరసింహస్వామి ఆలయంలో అభివృద్ధి పనులు పూర్తి అయితే ధర్మపురి క్షేత్రం మరింత శోభను సంతరించుకుంటుంది.

**నేడు భూమి పూజ:**

ధర్మపురిలోని ఉగ్ర నరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి పనులకు సంబందించిన భూమి పూజ కార్యక్రమం సోమవారం తెల్లవారు జామున 2గంటల 48 నిమిషాలకు నిర్వహించెందుకోసం వేద పండితులు ముహూర్తం ఖరారు చేశారు. భూమి పూజ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తదితరులు హాజరుకానున్నారు.



# స్థంభంపల్లిలో 'గమ్యం' హోటల్ ప్రారంభం..



వెల్గటూర్, సెప్టెంబర్ 6, ప్రజాకలం, ప్రతినిధి : వెల్గటూర్ మండలంలోని స్థంభంపల్లి గ్రామ శివారులో, రాష్ట్ర రహదారి పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన 'గమ్యం' హోటల్ ను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ధర్మపురి, కోటిలింగాల, గూడెం గుట్ట వంటి పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు వచ్చే భక్తులకు సౌకర్యంగా ఉండే విధంగా గమ్యం హోటల్ ఉందని అన్నారు. రాష్ట్ర రహదారి పక్కన ఉన్న ఈ హోటల్ యాత్రికులతో పాటు మంచిర్యాల, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, లక్షేట్ పేట నుండి కరీంనగర్, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు సైతం ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. భోజన ప్రియులకు రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు.

# ఆర్యవైశ్యులకు అండగా ప్రభుత్వం

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



వెల్గటూర్, సెప్టెంబర్ 6, ప్రజాకలం, ప్రతినిధి : తెలంగాణలోని ఆర్యవైశ్యులందరికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఆదివారం ధర్మపురిలో నిర్వహించిన మండలం మరియు పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ పదవీ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి మంత్రి లక్ష్మణ్ కుమార్ హాజరై మాట్లాడారు. ఆర్య వైశ్యులు ఉన్నచోట అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఆర్థిక శాఖ మంత్రిగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైశ్యుడైన రోశయ్యకు కాంగ్రెస్ పార్టీ అవకాశం కల్పించిందని గుర్తు చేశారు. ధర్మపురి ఎమ్మెల్యేగా గెలుపొందడం పూర్వ జన్మ లో చేసుకున్న పుణ్యమని, ఎమ్మెల్యేగా గెలిచిన నాటినుండి తనను ఎవ్వరు ఇబ్బంది పెట్టలేదని మంత్రి తెలిపారు. ఆర్యవైశ్యులు ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు.

నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి, ఆర్యవైశ్యులకు అన్ని విధాలుగా తాను అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సాయిని శ్రీనివాస్, ధర్మపురి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పి. శ్రీనివాస్, వివిధ గ్రామాలకు చెందిన ఆర్యవైశ్యులు, నాయకులు పాల్గొన్నారు.

# చిన్నతనంలోనే లక్ష్యాన్ని ఎంచుకోవాలి

- -పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్ రెడ్డి
- -తన బడి పిల్లల కోసం డీసీపీ విహారయాత్ర
- -పెద్దపల్లి జిల్లాలో గర్జనపల్లి విద్యార్థుల సందడి



పెద్దపల్లి,సెప్టెంబర్ 06:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) విద్యార్థులు చిన్నతనం నుంచే స్పష్టమైన లక్ష్యాన్ని ఎంచుకుని,దానిని చేరుకునేలా కష్టపడి చదవాలని పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్ రెడ్డి పిలుపునిచ్చారు.ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా గర్జనపల్లిలోని తాను చదువుకున్న ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థుల కోరిక మేరకు,వారి కోసం ప్రత్యేకంగా పెద్దపల్లి జిల్లా పరిధిలో విహారయాత్రను ఏర్పాటు చేశారు.

ఇందులో భాగంగా విద్యార్థులను సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లగా,అక్కడ సీఐ పొన్నమనేని రంజిత్ రావు,ఎస్సైలు చంద్రకుమార్,మల్లేష్,అశోక్ రెడ్డిలు విద్యార్థులకు ఓపెన్ హౌస్ నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్ కౌంటర్, ఫిర్యాదుల విభాగం ,రైటర్ రూమ్,అధికారుల ఛాంబర్లు, లాకప్ రూములను చూపిస్తూ పోలీస్ శాఖ విధివిధానాలపై విద్యార్థులకు క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. అనంతరం డీసీపీ రామ్ రెడ్డి విద్యార్థులు అడిగిన పలు సందేహాలకు సమాధానమిస్తూ, చట్టాలు-న్యాయాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు.భూమా నాయక్ భూక్య సామాజిక సేవా సంస్థ గర్జనపల్లి అధ్యక్షురాలు విజయ ఆధ్వర్యంలో విద్యార్థులకు సేవా కార్యక్రమాలు అందిస్తున్నామని,తమ సంస్థ ఎల్లప్పుడూ విద్యార్థులకు అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులు పెద్దపల్లి కలెక్టరేట్,డీసీపీ కార్యాలయం,ఎన్టీపీసీ ప్రాంతాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సుల్తానాబాద్ సర్కిల్ పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాలుష్యానికి చెక్.ప్రకృతి కోసం పరుగులు!

## పటాన్‌చెరులో ఘనంగా 3ఖ రన్ రన్ ఫర్ నేచర్ సీజన్-2



పటాన్‌చెరు సెప్టెంబర్ 6 (ప్రజా కలం) ప్రతినిధి

కాలుష్యరహిత పటాన్‌చెరు కోసం ప్రజల్లో పర్యావరణ స్ఫూర్తిని నింపుతూ ఎం డి ఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో 3ఖ రన్ రన్ ఫర్ నేచర్ సీజన్-2 ఘనంగా నిర్వహించారు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి,ఎమ్మెల్సీ అంజిరెడ్డి జెండా ఊపి 3ఖ రన్‌ను ప్రారంభించారు ప్రత్యేక ఆకర్షణగా భారీ ప్రజా భాగస్వామ్యం యువత, మహిళలు,విద్యార్థులు, చిన్నారులు, సీనియర్ సిటిజన్లు, పరిశ్రమల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని పొల్యూషన్ ఫ్రీ పటాన్‌చెరుకోసం తమ గొంతుకను వినిపించారు మాద్రి పృథ్వీరాజ్ మాట్లాడుతూ అభివృద్ధి ఎంత ముఖ్యమో.పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యం. కాలుష్యరహిత పటాన్‌చెరు ఒక్కరి బాధ్యత కాదు.. మనందరి సమిష్టి సంకల్పం అని అన్నారు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని,ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పిలుపునిచ్చారు రన్‌లో పాల్గొన్న వారికి ధ్రువపత్రాలు,మొక్కలు అందజేశారు. కార్యక్రమ విజయానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసు శాఖ, పరిశ్రమలు, వాలంటీర్లు, ప్రజలకు పృథ్వీరాజ్ కృతజ్ఞతలు తెలిపారు.



# కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ పోరుబాట

## పటాన్‌చెరులో ఆటో ర్యాలీ.. ఇస్నాపూర్‌లో భారీ నిరసన..



పటాన్‌చెరు, సెప్టెంబర్ 6 (ప్రజా కలం) ప్రతినిధి

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాటలో భాగంగా ఆదివారం బిహెచ్ఈఎల్ చౌరస్తా నుంచి ఇస్నాపూర్ వరకు భారీ ఆటో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహిళలతో కలిసి ఇస్నాపూర్ మున్సిపల్ కేంద్రంలో నిరసన చేపట్టారు.ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ,కేసీఆర్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందితే,కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం వెనక్కి వెళ్లిందని విమర్శించారు. రైతులు,మహిళలు,యువత, విద్యార్థులు,కార్మికులు,పేదలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నిలిపివేసిన సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే అన్ని సంక్షేమ పథకాలను తిరిగి అమలు చేస్తామని, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం కొనసాగిస్తామని మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆదర్శ్ రెడ్డి, గూడెం మధుసూదన్ రెడ్డి, సుమలత శ్రీకాంత్, సపానా దేవ్, మెట్టు కుమార్ యాదవ్, అంజయ్య, యాదగిరి యాదవ్, శ్రీశైలం యాదవ్, శ్రీకాంత్ గౌడ్, బాల్ రెడ్డి, విజయ్, గాయత్రి పాండు, ఉపేందర్, మేరాజ్ ఖాన్, పృథ్వీరాజ్, కౌన్సిలర్లు, నాయకులు, ఆటో కార్మికులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు..

# సుగుణమ్మ మృతికి వంటేరు ప్రతాప్‌రెడ్డి సంతాపం



గజ్వేల్:06 సెప్టెంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ ఆర్‌అండ్ఆర్ కాలనీ ఎర్రవల్లికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు,మాజీ సర్పంచ్ తౌడ నాగేష్ తల్లి తౌడ సుగుణమ్మ మృతి చెందారు.ఆమె మృతి విషయం తెలుసుకున్న గజ్వేల్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఎర్రవల్లిలోని నాగేష్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సుగుణమ్మ మృతికి వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ,కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వారి దుఃఖంలో తామూ భాగస్వాములమని తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బాబు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కళ్యాణ్‌కార్ నర్సింగరావు,లక్ష్మాపూర్ మాజీ సర్పంచ్ కొలిచెలిమి స్వామి, గంగిశెట్టి రవి,కొలిచెలిమి కరుణాకర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొని సుగుణమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# మాట తప్పిన కాంగ్రెస్..

## - ప్రజల ముందు బాకీల చిట్టా!
## - రైతులు, మహిళలు, యువతను మోసం చేశారు:
## - హామీలపై కాంగ్రెస్‌ను గడపగడపలో నిలదీస్తాం!

### - ఆరు గ్యారంటీలు.. 420 హామీల పేరుతో ప్రజలను మోసం చేశారు: మాదాసు శ్రీనివాస్



గజ్వేల్ నియోజకవర్గం:06 సెప్టెంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు గజ్వేల్ మండలం లోని అహ్మదీపూర్ గ్రామంలో 'గడపగ డపకు బాకీ కార్డు' కార్యక్రమాన్ని నిర్వహించారు.మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి బాకీ కార్డులను పంపిణీ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ హామీలను ప్రజలకు గుర్తుచేశారు.ఈ సందర్భంగా మాదాసు శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీల పేరుతో సుమారు 420 హామీలు ఇచ్చి ప్రజలను మభ్య పెట్టి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. అధికారం లోకి వచ్చి 33 నెలలు గడిచినా హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయ లేదని విమర్శించా రు.ఎన్నికల ముందు 100 రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు.. ఇప్పుడు 1000 రోజులు పూర్తయినా హామీలపై స్పష్టమైన సమాధానం చెప్పడం లేదన్నారు. రైతులకు ఇచ్చిన రుణమాఫీ, రైతుభరోసా, పంటలకు గిట్టుబాటు ధర, బోనస్ తదితర హామీల విషయంలో ప్రభుత్వం మాట తప్పిందని ఆరోపిం చారు. రైతు బంధు,రైతుబీమా వంటి పథకాలపైనా స్పష్టత లేకుండా రైతులను ఆందోళనకు గురిచేస్తున్నారని విమర్శించారు. మహిళలకు ఇచ్చిన హామీలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. మహా లక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయకపోవడంతో ఒక్కో మహిళకు రూ.82,500 బకాయి పడినట్లు పేర్కొన్నారు.కల్యాణలక్ష్మికి తులం బంగారం ఇస్తామని ఇచ్చిన హామీని కూడా ప్రభుత్వం నిలబెట్టుకో వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో రైతులు,మహిళలు, యువత, నిరు ద్యోగులు,ఉద్యోగులు, పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మాదాసు శ్రీనివాస్ ఆరో పించారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుం డా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభు త్వాన్ని ప్రతి గ్రామంలో,ప్రతి గడపలో ప్రజలు ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బ్యాగారి ప్రభాకర్,మాజీ సర్పం చులు చాడ శ్రీనివాస్ రెడ్డి,ఆగయ్య, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్,మాజీ కో-ఆప్షన్ సభ్యుడు అహ్మద్, గ్రామ పార్టీ అధ్యక్షుడు నిజామొద్దీన్,ఉ పసర్పంచ్ గోపాల్ రెడ్డి,సంపత్ రెడ్డి,రామగౌడ్, కుమార్ గౌడ్,మహిపాల్ రెడ్డి,సంజీవ రెడ్డి,సంపత్,ఎల్లం ,కరుణాకర్, స్వామి, సత్యం,సింహం తదితర బీఆర్ఎస్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# ఎరుపెక్కిన కరీంనగర్ - కదం తొక్కిన కార్మికులు

### - కార్మిక హక్కులను కాపాడుకుందాం నినాదాలతో ర్యాలీ
### - ఏఐటియుసి తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా కార్మికుల భారీ ప్రదర్శన ర్యాలీ
### - ఏఐటియుసి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.దత్తు నాయక్

మహేశ్వరం, సెప్టెంబర్ 06,(ప్రజా కలం)

నిరంతరం కార్మికుల పక్షాన పోరాడుతూ భారతదేశంలోనే అత్యంత బలమైన కార్మిక సంఘంగా ఆవిర్భవించిన ఏఐటీయూసీ నేడు రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయి కరీంనగర్ పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ గార్డెన్ నుండి వందలాదిమంది కార్మికులతో సర్కస్ గ్రౌండ్ వరకు భారీ ప్రదర్శన ర్యాలీ నిర్వహించడం జరిగింది

ఈ మహాసభలలో 700 మంది ప్రతినిధులు పాల్గొంటారని ఈ మహాసభలలో కార్మికులు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల మీద చర్చించి భవిష్యత్తు కార్మిక ఉద్యమానికి కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని వారు తెలిపారు ప్రతి కార్మికుడికి 26వేల వేతనం ఇవ్వాలని ఈఎస్ఐ పీఎఫ్ గ్రాటివిటీ ఉద్యోగ భద్రత కల్పించాలని అదేవిధంగా అసంఘటిత రంగ కార్మికులు లక్షలాదిమంది వలస కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల మీద రాబోయే కాలంలో రంగారెడ్డి జిల్లా ఏఐటియుసి ఆధ్వర్యంలో కార్మిక పోరాటాలు నిర్వహించడానికి నాయకులు సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కే రామస్వామి, జిల్లా అధ్యక్షులు వడ్ల సత్యనారాయణ ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు కొమ్ము గళ్ళ రాజు, చేవెళ్ల ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు బాబురావు, మధ్యాహ్న భోజనం కార్యదర్శి వడ్ల మంజుల, వైట్ క్లిప్ యూనియన్ జనరల్ సెక్రటరీ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# "హామీలకు బాకీ.. 1000 రోజుల్లో ఏం ఇచ్చారు?"

### -కాంగ్రెస్ బాకీ కార్డుతో అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ వినతిపత్రం
### -ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం: బీఆర్ఎస్ నేతలు

గజ్వేల్ నియోజకవర్గం:06 సెప్టెంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు వినూత్న నిరసన చేపట్టారు.సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం మర్కుక్ మండలం పాములపర్తిలో ఆదివారం "కాంగ్రెస్ బాకీ కార్డు" పేరుతో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ పాండు గౌడ్,సర్పంచ్ భవాని బాలకిషన్, బీఆర్ఎస్ మండల బీసీ సెల్ అధ్యక్షుడు మ్యాకల కనకయ్య ముదిరాజ్,ఉపసర్పంచ్ జట్టు సుధాకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపిస్తూ,ప్రభుత్వం ప్రజలకు ఎంత బాకీ పడిందో వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు.



ఆరు గ్యారెంటీలను అమలు చేసి ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మ్యాకాల శ్రీనివాస్,కొండనోళ్ల కరుణాకర్,నిరుడి రాజు,బీఆర్ఎస్ నాయకులు ఎడెల్లి మల్లేశం,సోమ వెంకటేశం,దుర్గా ప్రసాద్ గౌడ్,చెక్కల చంద్రం,పాములపర్తి కరుణాకర్,నాగశేఖర్,రాజు,దొండ మహేష్,కాళిదాస్,దుర్గేష్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో

# ఉపాధ్యాయుల పాత్ర కీలకం

### - విద్యార్థుల జీవితాలను మలిచేది గురువులే
### - కాలంతో పాటు బోధనా పద్ధతులు మార్చుకోవాలి
### - ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ యాదవ్‌రెడ్డి



గజ్వేల్:06 సెప్టెంబర్
( ప్రజా కలం ప్రతినిధి)

సమాజంలో మార్పు తీసుకురావడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ యాదవ్‌రెడ్డి అన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులతో గడిపే సమయం కంటే ఉపాధ్యాయులతో ఎక్కువ సమయం గడుపుతారని, అందువల్ల వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఆదివారం గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ ప్రైవేట్ గార్డెన్‌లో సిద్దిపేట జిల్లా ట్రస్మ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు ప్రదానోత్సవం, గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ట్రస్మ రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్, ట్రెజరర్ రాఘవేంద్రరెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి ఇన్నారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎంపీ రఘునందన్ రావు,ఎమ్మెల్సీ యాదవ్‌రెడ్డి,రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య,మున్సిపల్ ఛైర్పర్సన్ చందన రవి, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజర య్యారు.జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఇటీవల విద్యార్థుల చేతిలో మృతి చెందిన రూపారెడ్డికి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ప్రస్తుతం కత్తిమీద సాములా మారిందన్నారు.ఉపాధ్యాయులు ఎంతో శ్రమించి తమ సమయాన్ని విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు కేటాయిస్తున్నారని కొనియాడారు. త్రేతాయుగం, ద్వాపరయుగం నుంచి నేటి వరకు 'గురువు' అనే పదానికి ఉన్న ప్రత్యేకతను చాటుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు.గతంలో విద్యార్థులను క్రమశిక్షణలో పెట్టేందుకు దండించే పరిస్థితులు ఉండేవని,ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యాబోధన విధానాల్లోనూ మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు.ఉపాధ్యాయులు కాలానుగుణంగా తమ బోధనా పద్ధతులను మార్చుకుంటూ విద్యార్థులను సరైన మార్గంలో నడిపించాలని సూచించారు.ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు గతంలో మాదిరిగా ఇన్‌సర్వీస్ శిక్షణ అందించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ప్రైవేట్ పాఠశాలల సమస్యలు న్యాయమైనవైతే వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.విద్యార్థుల రక్షణ కోసం చట్టాలు ఉన్నట్లే ఉపాధ్యాయుల రక్షణ కోసం కూడా ప్రత్యేక చట్టం అవసరమని, ఇందుకోసం చట్ట రూపకల్పనకు కృషి చేస్తానని తెలిపారు.విద్యార్థుల ఎదుగుదలలో తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయుల పాత్ర కూడా సమానంగా ఉంటుందని అన్నారు.తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేసినప్పుడే మంచి సమాజ నిర్మాణానికి బాటలు పడతాయని పేర్కొన్నారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులకు మెమొంటోలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కోశాధికారి ఆంజనేయులు, గౌరవ అధ్యక్షుడు సోమేశ్వర్‌రెడ్డి,గజ్వేల్ ట్రస్మ అధ్యక్షుడు మనోజ్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి సంతోష్‌కుమార్, ట్రెజరర్ విశ్వనాథ్,అక్షర స్కూల్ కరెస్పాండెంట్ గుర్జకుంట రామస్వామి,గజ్వేల్ ఎంఈఓ కృష్ణతో పాటు ట్రస్మ నాయకులు,పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# ఆపన్న హస్తం.. ఆపదలో ఉన్న కుటుంబానికి అండ

### రాజేష్‌కుమార్ కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయం



గజ్వేల్:06 సెప్టెంబర్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తున్న ఆపన్న హస్తం మిత్ర బృందం మరోసారి తన మానవత్వాన్ని చాటుకుంది.గజ్వేల్ ఆపన్న హస్తం మిత్ర బృందం 130వ సహాయ కార్యక్రమాన్ని నిర్వహించి వడ్డేపల్లి గ్రామానికి చెందిన మునిగంజి రాజేష్‌కుమార్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసింది. రాజేష్‌కుమార్ మంచి కవిగా గుర్తింపు పొందారని, 2008లోనే ఆయన రచించిన రెండు పుస్తకాలను గజ్వేల్‌లో డాక్టర్ పెంటాచారి సమక్షంలో ఆవిష్కరించినట్లు బృందం సభ్యులు తెలిపారు.అనంతరం కుటుంబ పరిస్థితుల కారణంగా మరో ప్రాంతానికి వెళ్లి అక్కడే పని చేసుకుంటూ జీవనం సాగించేవారని పేర్కొన్నారు.ప్రస్తుతం అనారోగ్య సమస్యల కారణంగా పని చేసుకోలేని పరిస్థితిలో ఉండటంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోందని తెలిపారు.ఇద్దరు పిల్లలతో ఉన్న ఆ కుటుంబానికి తమ వంతు సహకారంగా రూ.20,000 నగదు,దూర ప్రాంతం నుంచి వచ్చి వెళ్లేందుకు అయ్యే ఖర్చుల నిమిత్తం మరో రూ.1,800 అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆపన్న హస్తం మిత్ర బృందం అధ్యక్షుడు పాషికంటి బాలచంద్రం,ప్రధాన కార్యదర్శి కటుకం శ్రీనివాస్,కోశాధికారి కొల్లూరి శ్యామ్‌ప్రసాద్,ఉపాధ్యక్షుడు కొలిచెలిమె స్వామి,సభ్యులు విజయ్‌కుమార్,రాణి, కనకరాజు,నర్సింలు,జనార్ధన్‌తో పాటు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.ఆపదలో ఉన్న కుటుంబాలకు తమవంతు సహాయం అందించేందుకు ఆపన్న హస్తం మిత్ర బృందం నిరంతరం కృషి చేస్తోందని నిర్వాహకులు తెలిపారు.

# ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

### మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి
### పోచమ్మ దేవాలయ ఉత్సవ కమిటీకి 54,116/- విరాళం అందజేత

రంగారెడ్డి, సెప్టెంబర్ 06,(ప్రజా కలం)

ఆధ్యాత్మిక చింతన అలవరుచుకోవడంతో ప్రతి ఒక్కరు మానసిక ప్రశాంతత పొందుతారని కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి అన్నారు. ఆదివారం రోజున గ్రామదేవత పోచమ్మ దేవాలయంలో,బోనాల ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించాలని కమిటీ సభ్యులను కోరారు. గ్రామంలో బోనాల ఉత్సవాల నిర్వహణకు పోచమ్మ దేవాలయం ఉత్సవ కమిటీ సభ్యులకు, 54,116/-రూపాయల విరాళాన్ని అందజేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరు దేవాలయాల అభివృద్ధి మరియు మౌలిక వసతుల ఏర్పాటులో భాగస్వాములు కావాలని కోరారు. గ్రామంలో నాలుగు రోజులపాటు జరిగే బోనాల ఉత్సవ కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ సత్యం యాదవ్, సింగల్ విండో



చైర్మన్ గంపా వెంకటేష్ గుప్తా, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కంబాల పరమేష్,వార్డు సభ్యులు మాధారం గణేష్ గౌడ్,కమిటీ సభ్యులు చేగూరి రాములు గౌడ్, గూడూరు శేఖర్ రెడ్డి,మాలె మల్లేష్ గౌడ్,వాంకుడావత్ రాంచందర్ నాయక్,గురిగళ్ల రామచంద్రయ్య, మూడ అశోక్,అమృతం పాండు,మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయులకు ఘన సన్మానం

జగిత్యాల ప్రతినిధి సెప్టెంబర్ 6 (ప్రజాకలం)

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల పట్టణంలోని సి.ఎస్.ఐ. వెస్లీ చర్చిలో ఆదివారం నిర్వహించిన ఆరాధనలో బాగంగా క్రైస్తవ ప్రభుత్వ, ప్రైవేట్, రిటైర్డ్ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా సి.ఎస్.ఐ. వెస్లీ పాస్టరేట్ చైర్మన్ జాకోబ్ లక్ష్మణ్, ఆయన సతీమణితో పాటు ఆలయ కమిటీ సభ్యులు ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి, వారి సేవలను కొనియాడారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, విద్యార్థులకు జ్ఞానాన్ని అందించడంతో పాటు మంచి విలువలను పెంపొందించడంలో వారు చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు.

## మెట్ పల్లి వైద్యుడికి బెస్ట్ డాక్టర్ అవార్డు..

### బిర్లా ప్లానెటోరియంలో ఘనంగా అవార్డు ప్రదానం

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి సెప్టెంబర్ 6 (ప్రజా కలం) వైద్య రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న మెట్ పల్లి ప్రాంతానికి చెందిన ప్రముఖ చిరోప్రాక్టర్




డాక్టర్ తిరుపతి బుసాకు 'బెస్ట్ డాక్టర్ అవార్డు' లభించింది. హైదరాబాద్‌లోని బిర్లా ప్లానెటోరియంలో సుమన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. కార్యక్రమానికి మాజీ స్పీకర్ మధుసూదన్ చారి, వేణుగోపాల చారి తదితర ప్రముఖులు హాజరయ్యారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ, ఆరోగ్య పరిరక్షణలో చేస్తున్న విశిష్ట కృషిని గుర్తించి డాక్టర్ తిరుపతి బుసాకు ఈ అవార్డును అందజేశారు. అవార్డు అందుకున్న డాక్టర్ తిరుపతి బుసా మాట్లాడుతూ, తన సేవలను గుర్తించి అవార్డుతో సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లోనూ ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొని డాక్టర్ తిరుపతి బుసాకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

## పాము కాటుతో చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

ధర్మారం, సెప్టెంబర్ 06 : ( ప్రజా కలం ప్రతినిధి ) మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన న్యాతరి మల్లవ్వ వయస్సు 63 సంవత్సరాలు అను ఆమె తేదీ 03.09.2026 రోజున తన ఇంటి ముందు ఉండగా ఒక నాగు పాము వచ్చి తన యొక్క ఎడమ కాలి పైన కాటు వేయగా, ఆమెని వెంటనే ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తేదీ 05.09.2026 శనివారం రోజున రాత్రి కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి లో మరణించింది అని ఆమె యొక్క భర్త అయినా లచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ధర్మారం ఎస్సై ఎంబడి శ్రీకాంత్ తెలిపారు.



## బెల్లంపల్లి తాపీ కార్మిక సంఘం నూతన అధ్యక్షుడిగా సంకరి కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా యేలగం శ్రీనివాస్ ఎన్నిక

బెల్లంపల్లి టౌన్, సెప్టెంబర్ 6, (ప్రజా కలం)ప్రతినిధి.

మంచిర్యాల జిల్లా , బెల్లంపల్లి తాపీ కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎన్నిక ఆదివారం రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల పర్యవేక్షణలో పోలీస్ బందోబస్తులో తాపీ సంఘం భవనంలో జరిగింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పోలింగ్ కొనసాగగా 89.5 శాతం పోలింగ్ నమోదు అయింది. ఓట్ల లెక్కింపు అనంతరం అధ్యక్ష పదవికి గాను సంకరి కృష్ణ,ప్రధాన కార్యదర్శిగా యేలగం శ్రీనివాస్ గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు వివరాలను వెల్లడించారు. అనంతరం గెలిచిన అభ్యర్థులను సంఘం సభ్యులు గజమాలలతో సత్కరించి బానసంచాలు పేల్చి బజార్ గుండా ర్యాలీ నిర్వహించి విజయోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం అధ్యక్షుడిగా గెలుపొందిన సంకరి కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా గెలుపొందిన యేలగం శ్రీనివాస్ మాట్లాడుతూ తమను ఎంతో నమ్మకంగా గెలిపించిన తాపీ కార్మిక సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. తాపీ కార్మిక సంఘం అభివృద్ధి సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తామని,కార్మికులకు ఎలాంటి సమస్యలు ఏర్పడిన తాము ముందుండి పరిష్కారం దిశగా ముందుకు వెళ్తామన్నారు. నూతనంగా ఎన్నికైన తాపీ కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గెల్లి రాజలింగు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇట్టి విషయాన్ని ఫోన్ ద్వారా ఎమ్మెల్యే గడ్డం వినోద్ తెలుపగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ నూతనంగా ఎన్నికైన కమిటీని అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తాపీ కార్మిక సభ్యులు తదితరులు పాల్గొన్నారు..



# మెట్‌పల్లిలో గిరిజనుడి ఇంటిపై మున్సిపల్ అధికారుల దౌర్జన్యం

### ఫోర్జరీ సంతకాలతో కూల్చివేతలు జరిగాయంటూ బాధితుడి ఆరోపణలు



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి సెప్టెంబర్ 6 (ప్రజాకలం) నిబంధనల ప్రకారం ఇల్లు నిర్మించుకుంటున్న నిరుపేద ఎస్టీ (లంబాడి) కుటుంబాన్ని మున్సిపల్ అధికారులు, కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా వేధిస్తున్నారని 9వ వార్డుకు చెందిన దేవి సింగ్ ఆరోపించారు. ఎలాంటి ముందస్తు సమాచారం, తుది నోటీసు ఇవ్వకుండానే తన ఇంటి స్లాబ్‌ను, విద్యుత్ మీటర్ బాక్స్‌ను ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మెట్‌పల్లి పట్టణంలోని 9వ వార్డు పరిధిలో నివాసం కోసం స్థలం కొనుగోలు చేసిన దేవి సింగ్ ఇంటి నిర్మాణం చేపట్టారు. ఈ నేపథ్యంలో నిర్మాణ సమయంలో మున్సిపాలిటీ నుంచి నోటీసు రావడంతో అందుకు లిఖితపూర్వకంగా వివరణ ఇచ్చినట్లు తెలిపారు. అయితే ఇంటి స్లాబ్ నిర్మాణం పూర్తయ్యే సమయంలో మున్సిపల్ సిబ్బంది అకస్మాత్తుగా వచ్చి స్లాబ్‌ను పగులగొట్టి, విద్యుత్ మీటర్ బాక్స్‌ను ధ్వంసం చేశారని ఆరోపించారు. తమకు నోటీసులు ఇచ్చినట్లు అధికారులు చూపిస్తున్న పత్రాల్లో ఉన్న సంతకం తనది కాదని దేవి సింగ్ తెలిపారు. తన సంతకాన్ని ఫోర్జరీ చేసి కూల్చివేతకు సంబంధించిన పత్రాలు సృష్టించారని ఆరోపిస్తూ, ఇందుకు సంబంధించిన ఆధారాలను మీడియా ముందు వెల్లడించారు. ఇంటి నిర్మాణం ప్రారంభమైనప్పటి నుంచి కొందరు వ్యక్తులు తనను, తన భార్యను బెదిరిస్తున్నారని దేవి సింగ్ పేర్కొన్నారు. స్లాబ్ వేసిన అనంతరం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి వద్దకు వచ్చి స్లాబ్ కింద ఏర్పాటు చేసిన సపోర్టు కర్రలను తొలగించారని, దీంతో ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఏర్పడిందని తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయని, ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ వ్యవహారంలో మున్సిపల్ అధికారుల పాత్ర ఏమైనా ఉందా? అనే అనుమానాలను ఆయన వ్యక్తం చేశారు. నోటీసులు, ఫోర్జరీ సంతకాల అంశంపై మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులను ప్రశ్నించేందుకు వచ్చిన తన బంధువులు, మిత్రులపై కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని దేవి సింగ్ ఆరోపించారు. పట్టణంలో అనేక నిర్మాణాలపై ఫిర్యాదులు ఉన్నప్పటికీ పట్టించుకోకుండా, తనలాంటి నిరుపేద గిరిజన కుటుంబాన్ని మాత్రమే లక్ష్యంగా చేసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కాగా తన ఇంటి కూల్చివేతకు సంబంధించి అధికారులు చూపిస్తున్న పత్రాల్లోని సంతకాలపై విచారణ జరిపించాలని దేవి సింగ్ కోరారు. ఫోర్జరీ సంతకాలు చేసినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి తనకు, తన కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

**నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం**
**– టౌన్ ప్లానింగ్ అధికారి భూపతి**

మెట్‌పల్లి నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టినందువల్లే సదరు నిర్మాణ పనులను నిలిపివేసినట్లు మెటపల్లి టౌన్ ప్లానింగ్ అధికారి భూపతి తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి చేపట్టే నిర్మాణాలపై చర్యలు తీసుకునే అధికారం టౌన్ ప్లానింగ్ విభాగానికి ఉందని ఆయన పేర్కొన్నారు. ఇంటి యజమాని సంతకం ఫోర్జరీ చేశారంటూ చేస్తున్న ఆరోపణలపై స్పందించిన టీపీఓ భూపతి.. సంతకం ఫోర్జరీ జరిగిందా లేదా అన్నది ఇంటి యజమానే తేల్చుకోవాలని, ఆ వ్యవహారంలో టౌన్ ప్లానింగ్ విభాగానికి ఎలాంటి ప్రమేయం లేదని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాల విషయంలో శాఖాపరంగా నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని టిపిఓ భూపతి తెలిపారు.



మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి టిపిఓ భూపతి

# రంగస్థల కళాకారులకు అండగా ప్రభుత్వం నిలవాలి



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 06 ( ప్రజా కలం ప్రతినిధి) : ప్రాచీన రంగస్థల కళలను పరిరక్షిస్తూ వస్తున్న కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం చేయూతనివ్వాలని తెలంగాణ కళాకారుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లపెల్లి సంపత్‌గౌడ్ కోరారు. కరీంనగర్ సప్తగిరి కాలనీలోని కోదండరామాలయంలో ఆదివారం ఆయన అధ్యక్షతన వేదిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో తెలంగాణ కళాకారుల వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన సావనపల్లి శ్రీనివాస్, నాయిని సత్యనారాయణరెడ్డి, వీర్నపల్లి కిషన్, పెద్దపల్లి జిల్లాకు చెందిన తాళ్లపల్లి రాజేశం గౌడ్, రావుల సదానందం, బొంగోని శంకర్‌గౌడ్, సిద్దిపేట జిల్లాకు చెందిన చల్లగొండ స్వామిరావు, గూళ్ల మొగిలి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో తంగళ్లపల్లి మండల అధ్యక్షుడిగా ఏరెడ్డి వెంకటరెడ్డి, కోనరావుపేట మండల అధ్యక్షుడిగా తక్కళ్ల బాపురెడ్డి, వేములవాడ మండల అధ్యక్షుడిగా గరిగంటి చంద్రయ్య,చందుర్తి మండల అధ్యక్షుడిగా సిరిసిల్ల శంకర్, ఇల్లంతకుంట మండల అధ్యక్షుడిగా సుధగోని రాజమల్లు గౌడ్, వీర్నపల్లి మండల అధ్యక్షుడిగా నేరెళ్ల ముత్యం గౌడ్, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడిగా జంగా రాంరెడ్డిని నియమించారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల అధ్యక్షుడిగా లేగల భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గోనెల నరసయ్యను ఎంపిక చేశారు,పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులుగా ఊటుకూరి శ్రీనివాస్‌గౌడ్,తాళ్లపల్లి రాములు, కొలిపాక సత్తిబాబు, కాల్వ శ్రీరాంపూర్ మండల కన్వీనర్‌గా అనుముల రాజిరెడ్డి, కో–కన్వీనర్లుగా గోనె సంజీవ్, పురుషోత్తం అనిల్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో వేదిక రాష్ట్ర సలహాదారు కూకట్ల తిరుపతి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు రాజేశం గౌడ్, కళాకారులు తిప్పారపు ముత్యం పోలేరు, పురుషోత్తం రామచంద్రం, కల్వల చంద్రారెడ్డి, మంథని సరిత, కన్నం భూమయ్య, గోనె శ్రీనివాస్‌రెడ్డి, తిప్పారపు శంకర్, తాళ్లపల్లి సదయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాయపోల్ ఉపాధ్యాయుడు నాగరాజుకు భారత్ గురు రత్న అవార్డు.

దుబ్బాక ప్రజాకలం సెప్టెంబర్ 06.

సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం కొత్తపల్లి ఎంపీయూపీఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు జి. నాగరాజుకు భారత్ గురు రత్న అవార్డు--2026 లభించింది. విద్యార్థుల వికాసమే లక్ష్యంగా కృత్యాధార, అనుభవపూర్వక బోధనా పద్ధతులతో విద్యార్థుల్లో అభ్యసన ఆసక్తిని పెంపొందిస్తున్న ఆయన సేవలను గుర్తించి ఈ అవార్డును అందజేశారు. సెప్టెంబర్ 6న హైదరాబాద్ రవీంద్రభారతిలోని పైడి జయరాజ్ హాల్‌లో శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి అవార్డు ప్రదానోత్సవంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పాలమూరు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొ. జి.ఎన్. శ్రీనివాస్, శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ డా. పట్నం కమల మనోహర్ చేతుల మీదుగా నాగరాజు అవార్డును అందుకున్నారు.



# మట్టిలో మాణిక్యం.. ఆయేషా

### -పల్లెటూరి నుంచి వికసించిన విద్యా కుసుమం
### -ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన రైతు బిడ్డ

ఎండపల్లి, సెప్టెంబర్ 06 : ( ప్రజా కలం ప్రతినిధి ) మండలంలోని కొండాపూర్



గ్రామానికి చెందిన మహమ్మద్ అంకుష్--అజీజ దంపతుల కుమార్తె మహమ్మద్ ఆయేషా జగిత్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. నిరుపేద కుటుంబానికి చెందిన ఆయేషా పట్టుదల తో చదివి నీట్ పరీక్షలో స్టేట్ ర్యాంక్ 1686 ఉత్తీర్ణత సాధించి ఎంబీబీఎస్‌లో సీటు సాధించడం అభి నందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ సంద ర్భంగా ఎండపల్లి మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు చెన్న కుమారస్వామి ఆయేషాను ఘనంగా శాలువాతో సన్మానించి అభినందించారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన విద్యార్థిని వైద్య విద్యలో సీటు సాధించడం ఎంతో హర్షణీయమని ఆయేషా పట్టుదల, కృషి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు స్ఫూర్తి దాయకమని అన్నారు. ఎండి ఆయేషా మరింత ఉన్నత స్థాయికి ఎదిగి భవిష్యత్తు లో ఎంతోమంది పేదలకు సేవలందించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యార్థులకు ఉచిత నేత్ర వైద్య శిబిరం

### -కొలుముల దామోదర్ యాదవ్ ఎన్నారై కెనడా ఫౌండేషన్ ఆధ్వర్యంలో

ధర్మారం, సెప్టెంబర్ 06 : ( ప్రజా కలం ప్రతినిధి ) సామాజిక సేవలో భాగంగా ఎన్నారై (కెనడా )కొలుమల దామోదర్ యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యం లో ధర్మారం మండలం లోని మల్లాపూర్ బాలికల గురుకుల పాఠ శాల లో ఆదివారం రోజున



ఉచిత నేత్ర వైద్య పరీక్షలను డాక్టర్ సతీష్ నిర్వహించారు. పేరెంట్స్ కమిటీ మాజీ చైర్మన్ సుంచు మల్లేశం 3 రోజుల క్రితం కొలుముల దామోదర్ యాదవ్ తో మాట్లాడుతూ మండలం లోని మల్లాపూర్ గురుకుల బాలికల పాఠశాల కళాశాల లో ఉచిత నేత్ర పరీక్షల తో పాటు ఉచిత అద్దాలు అందించాలని కోరగా స్పందించిన ఎన్ఆర్ఐ కెనడా కొలుముల దామోదర్ యాదవ్ కళ్ళ డాక్టర్ సతీష్ తో ఆదివారం మల్లాపూర్ గురుకులం లో విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేయించారు. అవసరమైన వారందరికీ మూడు రోజుల లో అద్దాలు పంపిణీ చేస్తామని వారు తెలిపారు. అనంతరం మా అభ్యర్థన మేరకు ఉచిత నేత్ర పరీక్షలు చేయించి కంటి అద్దాలు అందించేందుకు ముందుకు వచ్చిన కొలుముల దామోదర్ యాదవ్ కు సుంచు మల్లేశం తో పాటు మాజీ పేరెంట్స్ కమిటీ సభ్యులు వడుకాపురం రవి, కాంపల్లి తిరుపతి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపల్ అరుణ, ఉపాధ్యాయులు శ్వేత, రాణి, హెచ్ఎస్ సంతోషిని తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

వెల్గటూర్, సెప్టెంబర్6, ప్రజా కలం, ప్రతినిధి

వెల్గటూర్ గ్రామ శివారులో గల ఓ క్రషర్ లో విద్యుదాఘాతానికి గురై రాహుల్ బైగా (21) అనే కార్మికుడు మృతి చెందాడు. ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని సైడోర్ జిల్లా, గుర్తారా మండలం, పటేర్‌టోలా గ్రామానికి చెందిన రాహుల్ బైగా వెల్గటూర్ గ్రామ శివారులో గల శ్రీ ఆంజనేయ క్రషర్ లో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు శనివారం అతనికి విద్యుత్ షాక్ తగిలింది. దీనిని గమనించిన తోటి కార్మికులు అతనికి చికిత్స అందించేందుకు కోసం లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా అక్కడ అతన్ని పరీక్షించినా వైద్యులు అప్పటికే అతను మృతిచెందినట్లు తెలిపారు. మృతుని సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు.



# ఇచ్చిన హామీలు మరిచిన రేవంత్ సర్కార్

## - బాలాపూర్ లో బిఆర్ఎస్ నిరసన

## - బాలాపూర్ బిఆర్ ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రామిడి రామిరెడ్డి



మహేశ్వరం,సెప్టెంబర్ 06,(ప్రజా కలం)

ఇచ్చిన హామీలను రేవంత్ సర్కార్ మర్చిపోయిందని బాలాపూర్ బిఆర్ ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రామిడి రామిరెడ్డి అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాల మేరకు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో బాలాపూర్ 62వ డివిజన్ లో రేవంత్ సర్కార్ హామీలపై నిరసన కార్యక్రమం నిర్వహించారు.

**పోలీసులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?**

పోలీసు శాఖ సిబ్బందికి వారానికి ఒకరోజు సెలవు ఇస్తామన్న హామీ ఏమైందని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించారు. పోలీసు ఉద్యోగులు, వారి పిల్లలకు మెరుగైన విద్య కోసం రంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లో ఉన్నత విద్యా పాఠశాలలు ఏర్పాటు చేసి ఉచితంగా నాణ్యమైన విద్య అందిస్తామన్న మాట ఏమైందని నిలదీశారు.అలాగే పోలీసు సిబ్బందికి ఇస్తామన్న టీఏ, డీఏలు, ప్రమోషన్లు, ఉద్యోగ విరమణ అనంతరం రావాల్సిన బకాయిలపై ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

**ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12,000 హామీ ఏమైంది?**

ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12,000 ఆర్థిక సహాయం అందిస్తామన్న హామీని కూడా ప్రభుత్వం మరిచిపోయిందని విమర్శించారు. నెలకు రూ.1,000 చొప్పున ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఒక్క నెలైనా ఆటో డ్రైవర్ల కుటుంబాలకు ఆ మొత్తం అందించారా? అని ప్రశ్నించారు.ఆటో డ్రైవర్లకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా వెయ్యి రోజుల పాలన సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా, సిగ్గుచేటని మండిపడ్డారు. ముందుగా ఆటో డ్రైవర్ల కుటుంబాలకు ఇచ్చిన హామీని నెరవేర్చి ఆ తర్వాత సంబరాలు చేసుకోవాలని డిమాండ్ చేశారు.

**మున్సిపల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి**

మున్సిపల్ శాఖ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉద్యోగుల పిల్లలకు నాణ్యమైన విద్య, ఉద్యోగులకు రావాల్సిన టీఏ, డీఏలు, ప్రమోషన్లు, రిటైర్మెంట్ తర్వాత రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు.

**బాలాపూర్ బస్తీ దవాఖానలో వైద్య సేవలు మెరుగుపరచాలి**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బాలాపూర్ ను డయాగ్నస్టిక్ హబ్ గా అభివృద్ధి చేసి 134 రకాల పరీక్షలను ఉచితంగా అందించామని గుర్తుచేశారు. ప్రస్తుతం బస్తీ దవాఖానలో అవసరమైన మందులు, పరీక్షలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ముఖ్యంగా షుగర్ మందులు కూడా అందుబాటులో లేవని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.వెంటనే అన్ని రకాల మందులు, డయాగ్నస్టిక్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.హామీలు అమలు చేయకుండా సంబరాలు చేసుకోవడం సరికాదని, ప్రతి హామీ నెరవేరే వరకు ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

సమస్యలు పరిష్కరించకపోతే ప్రజలను కలుపుకుని పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బడంగ్ పేట్ సర్కిల్ పరిధిలోని బాలాపూర్, బడంగ్ పేట్, నాదర్ గుల్ డివిజన్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## పటాన్‌చెరులో ఆటో కార్మికుల గర్జన..

### రూ.12 వేల హామీ అమలు చేయాలంటూ ఆటో కార్మికులు -భారీ ర్యాలీ..

పటాన్‌చెరు, సెప్టెంబర్ 6 (ప్రజా కలం) ప్రతినిధి

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ పటాన్‌చెరు నియోజకవర్గ ఆటో కార్మికులు ఆదివారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఆటో కార్మికుడికి ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నాయకత్వంలో బిహెచ్ఈఎల్ చౌరస్తా నుంచి ప్రారంభమైన ర్యాలీ అశోక్‌నగర్, బీరంగూడ, రామచంద్రాపురం, పటాన్‌చెరు, ముత్తంగి మీదుగా ఇస్నాపూర్ వరకు సాగింది. వేలాది ఆటోలతో తరలివచ్చిన కార్మికులు నినాదాలతో హోరెత్తించారు. హామీ మేరకు రూ.12 వేల సాయం వెంటనే అందించాలని గూడెం మహిపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఆటో కార్మికుల హక్కుల కోసం మరిన్ని ఉద్యమాలు చేపడతామని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సమన్వయకర్త ఆదర్శ్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ఆటో సంఘాల ప్రతినిధులు, వేలాది మంది కార్మికులు పాల్గొన్నారు..



### జర్నలిస్టులు ఐక్యంగా ఉద్యమిస్తేనే

# సమస్యలకు పరిష్కారం !

- జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తాం.
- జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి.
- జర్నలిస్టులకు క్రమ-శిక్షణ చాలా అవసరం :రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏకే పైసల్
- నారాయణఖేడ్‌లో టీయూడబ్ల్యూజే--ఐజేయూ సర్వసభ్య సమావేశం.




సంగారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 06( ప్రజా కలం):

జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయి నుంచి గుర్తించి వాటి పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతామని, ఐక్యంగా ఉద్యమిస్తామని టీయూడబ్ల్యూజే--ఐజేయూ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి తెలిపారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఆదివారం నిర్వహించిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన సమస్యలు, సంఘం బలోపేతంపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ మారుతున్న పరిస్థితుల్లో జర్నలిస్టులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గ, మండల స్థాయిలో పనిచేసే జర్నలిస్టుల సమస్యలను ప్రత్యేకంగా నమోదు చేసి జిల్లా కమిటీ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ అందేలా చూడడంతో పాటు ఇంటి స్థలాలు, ఆరోగ్య భద్రత విషయంలో ప్రభుత్వం స్పష్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. చిన్న, మధ్య తరహా పత్రికల్లో పనిచేసే జర్నలిస్టులతో పాటు ఎలక్ట్రానిక్ మీడియా, ఫొటో జర్నలిస్టులకు సమాన ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సభ్యత్వ విస్తరణతో పాటు మండల స్థాయి కమిటీలను మరింత క్రియాశీలం చేయాలని సూచించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఏ.కే. పైసల్ మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల సాధనకు సంఘటిత శక్తే ప్రధాన బలమన్నారు. సమస్య ఏ ఒక్క జర్నలిస్టుదైనా యూనియన్ సమస్యగా భావించి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో అర్హులైన జర్నలిస్టులకు న్యాయం జరిగేలా యూనియన్ కృషి చేస్తుందని తెలిపారు.సమావేశంలో జిల్లా, నియోజకవర్గ నాయకులు, ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొని స్థానిక సమస్యలను వివరించారు. రాష్ట్ర ప్రతినిధి బాసిత్, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు సిద్ధన్న పాటిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి రు మాండ్ల అనిల్, ఉపాధ్యక్షులు శ్రీనాథ్ మతీన్,ఆర్ సత్యనారాయణ రెడ్డి, మల్లేశం, జాయింట్ సెక్రటరీలు ఉల్లిగడ్డల శివకుమార్ , శ్రీనివాసరెడ్డి ,,ఎంఏ రవూఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు విల్సన్ ,జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు ఆసిఫ్, ఉపాధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి బసవేశ్వర్, కోశాధికారి శ్రీధర్ జైన్, చిన్న , మధ్య తరహా పత్రికల సంఘం ప్రధాన కార్యదర్శి చవాన్ ఈశ్వర్, కోశాధికారిగా లక్ష్మణ్ , ఉపాధ్యక్షుడు నజీర్, సదాశివపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు హాజీ జహీరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మీనాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ అసమర్థత పాలనలో పెరిగిపోతున్న నిరుద్యోగం

- -జాబ్ క్యాలెండర్ అమలు చేయకుండా యువతను మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- -స్థానిక యువతకు స్థానిక పరిశ్రమాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలి.
- -ఆనగంటి వెంకటేష్ డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.



సంగారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 06 ( ప్రజా కలం):

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థత విధానాల వల్లన దేశంలో, రాష్ట్రంలో రోజు రోజుకు నిరుద్యోగం పెరిగిపోతుందని, తక్షణమే యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలపై నోటిఫికేషన్స్ వేయాలని ప్రభుత్వాలను డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ డిమాండ్ చేశారు. భారత ప్రజాతంత యువజన సమాఖ్య సంగారెడ్డి జిల్లా 4వ మహాసభలు కొండాపురం మండల కేంద్రంలో నిర్వహించడం జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిధిగా హాజరైన డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ మాట్లాడుతూ దేశ యువతకు ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించకుండా 12 సంవత్సరాలు గడుస్తున్నా కోట్లాది మంది నిరుద్యోగ యువతకు తీవ్ర నిరాశ,అన్యాయం మాత్రమే మిగిల్చిందని,ఒకవైపు ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తూ ఉద్యోగ అవకాశాలను తగ్గిస్తుండగా, మరోవైపు నీట్,రైల్వే, బ్యాంకింగ్ వంటి పోటీ పరీక్షల్లో వరుసగా ప్రశ్నపత్రాల లీకులు జరుగుతూ విద్యార్థి,యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని అన్నారు.కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖల్లోనే సుమారు పది లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో లక్షలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆ పోస్టులన్నింటిని భర్తీ చేయాలని,నిరుద్యోగ యువతకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేసారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు నిరుద్యోగులందరికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, మొదటి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని,జాబ్ క్యాలెండర్ ప్రకటించి నోటిఫికేషన్లు వేసి ఉద్యోగాలను భర్తీ చేస్తామని, ఎన్నికల మేనిఫెస్టోలో యూత్ డిక్లరేషన్ ని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచిపోయిన ఇప్పటివరకు జాబ్ క్యాలెండర్ తో పాటు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదు.సమగ్రమైన వివరాలతో జాబ్ క్యాలెండర్ను ప్రకటించి ఉద్యోగాల భర్తీకై నోటిఫికేషన్లను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం వేయాలన్నారు. అదేవిధంగా ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించే అంతవరకు నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి 4,000 రూపాయలు ఇవ్వాలని,స్వయం ఉపాధి రుణాలపై రాజీవ్ యువ వికాస్ పథకాన్ని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించి లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయడం లేదు.దరఖాస్తులకే పరిమితం కాకుండా అర్హులైన నిరుద్యోగ యువత అందరికి రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా స్వయం ఉపాధి రుణాలు అందించాలన్నారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలకై డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. డివైఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి జయరాజు, మాజీ నాయకులు అతిమేలా మాణిక్ లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కఠినమైన చర్యలు తీసుకోవాలని, నిరంతర నిఘా అక్రమ రవాణా కు అడ్డుకట్ట వేసి విద్యార్థి, యువత ప్రాణాలను రక్షించాలని అన్నారు. సంగారెడ్డి జిల్లాలో అనేక పరిశ్రమలు ఉన్న స్థానికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం లేదన్నారు. ఇక్కడి వనరులను అన్నిటిని ఉపయోగించుకొని పరిశ్రమలు స్థానికత పేరుతో ఉద్యోగాలు ఇవ్వకుండా స్థానిక యువతను మోసం చేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వమే స్థానిక పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మహాసభల సందర్భంగా కొండాపూర్ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం నుండి భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం డివైఎఫ్ఐ జెండాను జిల్లా కార్యదర్శి అనిల్ ఆవిష్కరించారు. ఈ మహాసభలో జిల్లా కార్యదర్శి అనిల్,నాయకులు ఎం.శ్రీకాంత్,ప్రశాంత్,జె.శ్రీకాంత్, బాబురావు,వాణి, రమేష్, సాయికుమార్, అర్జున్,ప్రజా సంఘాల నాయకులు రాజయ్య,నాగ భూషణం,రాజు, నాగరాజు లతో పాటు 100 మంది యువత పాల్గొన్నారు.

## 22ఏ భూములపై కేసీఆర్‌తో జీఎంఆర్ భేటీ..

### 50 వేల ఎకరాల భూములపై కేసీఆర్‌కు వినతి..

పటాన్‌చెరు,సెప్టెంబర్ 6 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్‌చెరు నియోజకవర్గంలో 22ఏ నిషేధిత భూముల సమస్యపై శాసనసభలో చర్చించి ప్రజలకు న్యాయం చేయాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి,తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరారు.



ఎర్రవల్లిలో కేసీఆర్ అధ్యక్షతన జరిగిన భారత రాష్ట్ర సమితి శాసనసభా పక్ష సమావేశానికి గూడెం మహిపాల్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం కేసీఆర్‌తో ప్రత్యేకంగా సమావేశమై పటాన్‌చెరు నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు, రాజకీయ పరిస్థితులను వివరించారు. భారత రాష్ట్ర సమితి ప్రభుత్వ హయాంలో పటాన్‌చెరు నియోజకవర్గాన్ని అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లుగా నిధులు కేటాయించకపోవడంతో అభివృద్ధి కుంటుపడిం దని వివరించారు. ఇటీవల తీసుకొచ్చిన 22ఏ నిషేధిత జాబితాలో పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన 50 వేల ఎకరాలకు పైగా భూములు చేరాయని కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. కేసీఆర్ నాయకత్వంలో భారత రాష్ట్ర సమితి తిరిగి రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమని గూడెం మహిపాల్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు..

# బ్యాడ్మింటన్‌లో చిన్నారుల హోరు..

## - చిన్నారులతో కలిసి ఆడిన మాజీ వైస్ చైర్మన్ నరసింహా గౌడ్..

పటాన్‌చెరు, సెప్టెంబర్ 6 (ప్రజా కలం) ప్రతినిధి

అమీన్‌పూర్ సర్కిల్ బీరంగూడ డివిజన్ జయలక్ష్మి నగర్‌లోని ఇన్ఫినిట్ బ్యాడ్మింటన్ అకాడమీ ఆధ్వర్యంలో చిన్నారుల బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఉత్సాహభరితంగా కొనసాగుతోంది.వివిధ విభాగాల్లో చిన్నారులు ఉత్కంఠభరితంగా పోటీపడుతున్నారు.పోటీలకు అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.అనంతరం చిన్నారులతో కలిసి బ్యాడ్మింటన్ ఆడి వారిలో ఉత్సాహం నింపారు.ఈ సందర్భంగా నిర్వాహకులు,అకాడమీ యాజమాన్యం ఆయనను శాలువాతో సత్కరించారు. నందారం నరసింహ గౌడ్ మాట్లాడుతూ,పిల్లలు సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా క్రీడలపై దృష్టి పెట్టాలని సూచించారు. బ్యాడ్మింటన్‌తో శారీరక దృఢత్వంతో పాటు ఏకాగ్రత, చురుకుదనం పెరుగుతాయని తెలిపారు. చిన్నతనం నుంచే తల్లిదండ్రులు పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించాలన్నారు. చిన్నారులను క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్న ఇన్ఫినిట్ బ్యాడ్మింటన్ అకాడమీ నిర్వాహకులను అభినందించారు.టోర్నమెంట్ నిర్వాహకులు మాట్లాడుతూ, చిన్నారుల్లోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకే పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు, అకాడమీ శిక్షకులు, నిర్వాహకులు, స్థానికులు, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు..





## తెలంగాణ విమోచన జైత్రయాత్రకు అడ్డుకోవడం దుర్మార్గం

### - ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు
### - రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ రెడ్డి
### - మీర్ పేట్ కార్పొరేషన్
### క్లస్టర్ అధ్యక్షులు పసునూరి బిక్షపతి చారి

మహేశ్వరం, సెప్టెంబర్ 06,(ప్రజా కలం)

తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా శాంతియుతంగా నిర్వహిస్తున్న తెలంగాణ విమోచన జైత్రయాత్రలో పాల్గొనకుండా అడ్డుకునేందుకు ఈరోజు ఉదయం శ్రీరాములు ఇంటి వద్దకు పోలీసులు వెళ్లి హౌస్ అరెస్ట్ చేయడం అక్రమంగా రహస్య ప్రాంతాలకు తరలించడం జరిగింది మరియు రంగారెడ్డి



జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ రెడ్డి గారిని మీర్ పేట్ కార్పొరేషన్ క్లస్టర్ 1 అధ్యక్షులు పసునూరి బిక్షపతి చారి, మాజీ ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్ రెడ్డి. మాజీ అధ్యక్షులు పెండ్యాల నరసింహ. జిల్లా కౌన్సిల్ సభ్యులు కోడూరు సోమేశ్వర్.జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి . బీజేవైఎం రాష్ట్ర నాయకులు రాఘవేందర్ ముదిరాజ్. మాజీ కార్పొరేటర్లు ఇంద్రసేన .ఏ బీమ్ రాజ్. కీసర కృష్ణారెడ్డి ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి. మాజీ ప్రజా ప్రతినిధులు రాష్ట్ర జిల్లా నాయకులనీ డివిజన్ నాయకులని మీర్ పేట్ పోలీసు స్టేషన్ కి తరలించారు.బిక్షపతి చారి మాట్లాడుతూలి అప్రజాస్వామ్యం, ఇది రాష్ట్ర ప్రభుత్వ దిక్కు మాలిన చర్య.ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొనే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కు. అలాంటి హక్కులను హరించే ప్రయత్నాలు ఎంత చేసినా, ఎన్ని అక్రమ అరెస్టులు చేసినా. ప్రజల గొంతును అణచలేరు, బీజేపీ కార్యకర్తల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరు.ఈ అప్రజాస్వామిక చర్యలు తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు. నిజామ్ నిరంకుశ పాలన నుండి విముక్తి కోసం పోరాడిన స్ఫూర్తినే నేడు మళ్లీ గుర్తు చేస్తున్నాయని అన్నారు.

## 15 ఏళ్ల బాలుడు అదృశ్యం



శంషాబాద్, సెప్టెంబర్ 06, (ప్రజా కలం)

పెద్దగోల్కొండకు చెందిన 15 ఏళ్ల బాలుడు యాపచెట్టు నవతేజ్ అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నవతేజ్ 10వ తరగతి చదువుతున్నాడు. సెప్టెంబర్ 6న ఉదయం 6:30 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిన బాలుడు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. అదృశ్యమైన సమయంలో నవతేజ్ లైట్ గ్రీన్ కలర్ టీషర్ట్, బ్లూ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాలుడి ఆచూకీ కోసం బంధువులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల్లో గాలిస్తున్నారు. బాలుడు ఎక్కడైనా కనిపించినా, అతని ఆచూకీ తెలిసినా వెంటనే 9573306032, 8187867439, 9603876990 నంబర్లకు సమాచారం అందించాలని కుటుంబ సభ్యులు కోరారు.

## వాజేడు టీచర్స్ క్రికెట్ ప్రీమియర్ లీగ్

### - పాల్గొన్న మండల ఉపాధ్యాయులు
### -బహుమతి అందజేసిన ఎంఈఓ వెంకటేశ్వర్లు

వాజేడు సెప్టెంబర్ 06( ప్రజా కలం) ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా వాజేడు మండల ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో టీచర్స్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ 1ను నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్లో పెద్ద గొల్లగూడెం కాంప్లెక్స్ వారియర్స్ టీం పై ట్రైబల్ వెల్ఫేర్ థండర్స్ టీం విజయం సాధించింది. విజయం సాధించిన జట్టుకు ఎంఈఓ వెంకటేశ్వర్లు అభినందనలు తెలుపుతూ ప్రథమ బహుమతిని అందజేశారు. క్రికెట్ టోర్నీకి సంబంధించి మొదటి ట్రోఫీ ఉపాధ్యాయులు కోకిల శ్రీరంగం,రెండవ ట్రోఫీని పి నాగేశ్వరావు,అందజేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇరు జట్ల కెప్టెన్ లు బద్రి, రాజేష్ ల తో పాటు టీం సభ్యులు నాగేంద్ర ప్రసాద్, జి అనిల్, ఈ అనిల్, పవన్, చంద్రకాంత్, నరసింహ, సాగర్, రాంబాబు, జయేం దర్, బాలాజీ, నర్సింగరావు మరియు జనార్దన్ లు పాల్గొన్నారు.



## మహేశ్వరం నియోజకవర్గంలో టి ఆర్ పి

# భారీ బహిరంగ సభ

### రంగారెడ్డి జిల్లా మైనార్టీ అధ్యక్షుడిగా షరపుద్దీన్ హమీద్



మహేశ్వరం,సెప్టెంబర్ 6:(ప్రజా కలం)

తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టి ఆర్ పి ) ఆధ్వర్యంలో మహేశ్వరం నియోజకవర్గంలో ఆదివారం భారీ రాజకీయ కార్యక్రమం ఘనంగా జరిగింది.జల్పల్లి కమాన్ వద్ద పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేతుల మీదుగా పార్టీ జెండా ఆవిష్కరణతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం షాహీన్ నగర్ లోని టి ఎన్ జి సెలబ్రేషన్స్ ఫంక్షన్ హాల్ లో భారీ బహిరంగ సభ నిర్వహించారు.ఈ సభకు జల్పల్లి, షాహీన్ నగర్, బాలాపూర్ ప్రాంతాల నుండి యువత భారీ సంఖ్యలో తరలివచ్చి తీన్మార్ మల్లన్న సమక్షంలో పార్టీలో చేరారు.

కీలక నియామకాలు:పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా తీన్మార్ మల్లన్న నియామక పత్రాలను అందజేశారు.

రంగారెడ్డి జిల్లా మైనార్టీ అధ్యక్షుడిగా నియామకం మహమ్మద్ మజహర్ అలీ

బాలాపూర్ మండల మైనార్టీ అధ్యక్షుడిగా నియామకం

అమ్జద్ ఉల్లా ఖాన్ ( ఎంబిటీ పార్టీ అధ్యక్షుడు), అబ్దుల్ మజీద్ షోయబ్ (ఎంజేపీ అధ్యక్షుడు), సీనియర్ నాయకులు మహమ్మద్ గౌస్, అబ్దుల్ రౌఫ్, వహీద్, ఫారూఖ్, నయీమ్, సలీమ్, అజీమ్ ఖాన్, ఫైసల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. స్థానిక యువత చూపిన ఉత్సాహం అభినందనీయమని, షరఫుద్దీన్ హమీద్ బృందం చేసిన క్షేత్రస్థాయి కృషిని కొనియాడారు. రాబోయే రోజుల్లో రంగారెడ్డి జిల్లాలో మైనార్టీల సమస్యలపై టి ఆర్ పి మరింత బలంగా పోరాడుతుందని స్పష్టం చేశారు.

## ప్రజాప్రతినిధులుగా పద్మశాలి యువత రాణించాలి

### -జిల్లా అధ్యక్షుడు మేర్గు యాదగిరి
### -పట్టణ పద్మశాలి నూతన యువజన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



పెద్దపల్లి,సెప్టెంబర్ 06 :(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

రాజకీయాలలో పద్మశాలి యువత క్రియాశీలక పాత్ర పోషిస్తూ ప్రజాప్రతినిధులుగా రాణించాలని పద్మశాలి యువజన సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మేర్గు యాదగిరి,ప్రధాన కార్యదర్శి బోట్ల సాగర్ పిలుపునిచ్చారు. ఆదివారం పెద్దపల్లి పట్టణ పద్మశాలి కమ్యూనిటీ స్థలంలో జిల్లా అధ్యక్షుడు వేముల రామ్మూర్తి ఆదేశాల మేరకు,జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సత్తయ్య,పట్టణ అధ్యక్షుడు పులి శ్రీనివాస్,మండల అధ్యక్షుడు చిప్ప భాస్కర్,స్వతంత్ర కుమార్,వడ్డేపల్లి నరేందర్ల సమక్షంలో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో పెద్దపల్లి పట్టణ నూతన యువజన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా పులి రాజు,ప్రధాన కార్యదర్శిగా మోర హరేందర్, ఉపాధ్యక్షులుగా ఆల్లె శివకుమార్,గుండేటి గణేష్,చిప్ప నరసయ్య,మెరుగు నరేష్,బంక రాజేష్, కోశాధికారిగా గుండేటి అరుణ్,కార్యదర్శిగా గాదాసు మధుకర్,ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా వేముల సందీప్,అడిచర్ల ఆంజనేయులు, మిట్టపల్లి అభిషేక్ ఎంపిక కాగా,ఎన్నికైన ప్రతినిధులను నాయకులు ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా మేర్గు యాదగిరి మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పద్మశాలి కమ్యూనిటీ సంక్షేమాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేశాయని, పెద్దపల్లి నియోజకవర్గంలో కమ్యూనిటీ భవనానికి స్థలాన్ని కేటాయించకుండా ఇచ్చిన హామీలను నీరుగార్చాయని మండిపడ్డారు.52 సంవత్సరాలు నిండిన ప్రతి పద్మశాలికి ఎలాంటి నిబంధనలు లేకుండా చేనేత పింఛన్ అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ,రాబోయే ఎన్నికల్లో పద్మశాలీల అభ్యున్నతికి కట్టుబడి ఉండే నాయకులకే తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

## అసెంబ్లీ ప్రాంగణంలో ప్రభుత్వ విప్ కార్యాలయం ప్రారంభం

### -విప్ విజయరమణ రావుకు పలువురి శుభాకాంక్షలు



పెద్దపల్లి,సెప్టెంబర్ 06:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

తెలంగాణ ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు నూతన అధికారిక కార్యాలయాన్ని తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ప్రాంగణంలో ఆదివారం ఘనంగా ప్రారంభించారు.

ప్రభుత్వ పరంగా కేటాయించిన ఈ కార్యాలయంలో వేద పండితుల మంత్రోచ్చారణలు,వైదిక క్రతువుల నడుమ పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆఫీసును అందుబాటులోకి తెచ్చారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి పలువురు కీలక ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్,రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి,రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్,మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ,ఎమ్మెల్సీ తానిపత్రి భానుప్రసాద్ రావు సహా పలువురు ప్రముఖులు ఈ వేడుకలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా విప్ విజయరమణ రావు కి మంత్రి,స్పీకర్లతో పాటు ప్రజాప్రతినిధులు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.నూతన కార్యాలయం వేదికగా ఆయన ప్రజలకు,ప్రభుత్వానికి మధ్య మరింత సమర్థవంతంగా సేవలు అందించాలని పలువురు ఆకాంక్షించారు.



## బాలాపూర్ మండలం లెనిన్ నగర్లో ఉచిత వైద్య శిబిరం విజయవంతం

### - చవాన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో సీపీఐ పార్టీ సహకారంతో ఉచిత మెడికల్ క్యాంపు
### - సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఆందోజు రవీంద్ర చారి
### - బాలాపూర్ మండల కార్యదర్శి ముకుందం గారి చంద్రశేఖర్ రెడ్డి

మహేశ్వరం,సెప్టెంబర్ 06,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం లెనిన్ నగర్ మెయిన్ ఆఫీసు నందు చవాన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో, సీపీఐ పార్టీ సహకారంతో ఉచిత మెడికల్ క్యాంపు ఘనంగా నిర్వహించారు. పేద, మధ్యతరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకుని చిన్నా, పెద్దా ఏ సమస్యకైనా తక్కువ ధరకే మెరుగైన వైద్యం అందించడం చవాన్ హాస్పిటల్ ప్రత్యేకత. పేదల పాలిట దేవుడిగా నిలుస్తూ వచ్చిన ప్రతి ఒక్కరికి తక్కువ ఖర్చుతో సరైన ట్రీట్మెంట్ అందిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు ఇచ్చిన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఆందోజు రవీంద్ర చారి గారికి చవాన్ హాస్పిటల్ యాజమాన్యం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది.ఈ మెడికల్ క్యాంపును విజయవంతం చేయడంలో సహకరించిన సహాయ కార్యదర్శి రెడ్డి నాయక్ దత్తు, ఏఐటీయూసీ బాలాపూర్ మండల ప్రెసిడెంట్ లక్ష్మారెడ్డి, శేఖర్ యాదవ్, నరసింహ, శాఖ కార్యదర్శి పిచ్చి రాజు మరియు మహిళా కార్యకర్తలందరికీ బాలాపూర్ మండల సమితి తరపున ధన్యవాదాలు తెలిపారు.ఈ శిబిరంలో పాల్గొని వైద్య సేవలు అందించిన ఏవి రావు, మార్కెట్ లీడర్, డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ సుజాత మేడం, దీప్తి మేడం, సలీం, సంపత్, శివ, సాయి తదితరులకు సీపీఐ పార్టీ తరపున లాల్ సలాం తెలిపారు.

## పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

మహబూబ్ నగర్ నగర్ ప్రజా కలం ప్రతినిధి సెప్టెంబర్ 06:

సెప్టెంబర్ 5, 6, 12, 13వ తేదీల్లో నిర్వహిస్తున్న ఎస్.ఐ.ఆర్ ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో భాగంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదివారం దేవరకద్ర నియోజకవర్గంలో అడ్డాకల్ మండలం శక్రాపూర్, మూసాపేట మండలం జనంపేట, భూత్పూర్ మండలం పోతుగుట్ట తండాలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి తనిఖీ చేశారు. అడ్డాకల్ మండలం శక్రాపూర్ గ్రామంలోని పోలింగ్ కేంద్రాలు 103, 104లను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్, అక్కడ చేపట్టిన ఏర్పాట్లతో పాటు కొనసాగుతున్న ఎన్నికల సంబంధిత కార్యక్రమాల



పురోగతిని సమీక్షించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిస్థాయిలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మూసాపేట మండలం జనంపేట గ్రామంలోని పోలింగ్ కేంద్రాలు 81, 82, 83, 84లను పరిశీలించారు. ఓటర్ల జాబితాకు సంబంధించిన పనులను నిబంధనల ప్రకారం సక్రమంగా నిర్వహించాలని, అర్హులైన ప్రతి ఓటరుకు అవసరమైన సేవలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. భూత్పూర్ మండలం పోతుగుట్ట తండాలోని పోలింగ్ కేంద్రం 24ను కూడా అదనపు కలెక్టర్ తనిఖీ చేసి, ఎన్నికల సంబంధిత పనుల పురోగతిని సమీక్షించారు. ఓటర్ల జాబితా పనుల్లో ఎలాంటి లోపాలకు తావులేకుండా నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ తనిఖీల్లో సంబంధిత మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు/ఏఈఆర్ఓలు, ఆర్ఐలు, బీఎల్ఓ సూపర్వైజర్లు, జీపీఓలు, పీఎస్లు, సర్పంచ్లు, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సమస్యలపై రాజీలేని పోరాటం

### -బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా కట్కూరి సత్యనారాయణరెడ్డి

పెద్దపల్లి:సెప్టెంబర్ 06:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా పెద్దపల్లి జిల్లా నూతన అధ్యక్షుడిగా కట్కూరి సత్యనారాయణరెడ్డి నియమితులయ్యారు.తనపై నమ్మకం ఉంచి ఈ కీలక బాధ్యతలను అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ తన నియామకానికి పూర్తి స్థాయిలో సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు,కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వాపురం లక్ష్మీనర్సయ్య,జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి,జిల్లా ఇన్చార్జ్ నాగపూరి రాజమౌళిగౌడ్,మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి,రాష్ట్ర నాయకుడు గొట్టిముక్కుల సురేష్రెడ్డి,రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్కుమార్ లతో పాటు సహకరించిన నాయకులు,కిసాన్ మోర్చా ప్రతినిధులు,కార్యకర్తలు, అభిమానులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.పార్టీ నాయకత్వం తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా కిసాన్ మోర్చాను మరింత బలోపేతం చేయడమే కాకుండా,రైతాంగం ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై క్షేత్రస్థాయిలో నిరంతరం పోరాడతానని సత్యనారాయణరెడ్డి స్పష్టం చేశారు.రైతుల సంక్షేమం కోసం పార్టీ రూపొందించిన పలు అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను గ్రామగ్రామానికి విస్తృతంగా తీసుకెళ్లేందుకు శ్రమిస్తానని ఆయన పేర్కొన్నారు.



# రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

**ముఖ్యఅతిథిగా ఆసిస్టెంట్ ఆఫ్ కమిషనర్ పోలీస్ , సైబర్ క్రైమ్ , ఖమ్మం శ్రీ సి.హెచ్.ఆర్.వి. ఫణీందర్ సార్.**

ఖమ్మం సెప్టెంబర్ 06(ప్రజా కలం న్యూస్ )

ఖమ్మం రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం 3150 , ఉపాధ్యాయ దినోత్సవ సందర్భముగా ఆదివారము నాడు రోటరీ కమ్యూనిటి సెంటర్ నందు ఖమ్మం రోటరీ క్లబ్ అధ్యక్షులు శ్రీ హరి శ్రీనివాస్ అధ్యక్షతన విద్యా రంగములో విశేష సేవలు అందించిన అధ్యాపకులను మరియు ఉపాధ్యాయులను సన్మానించుట జరిగినది . ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిధిగా ఆసిస్టెంట్ ఆఫ్ కమిషనర్ పోలీస్ , సైబర్ క్రైమ్ , ఖమ్మం శ్రీ సి.హెచ్.ఆర్.వి. ఫణీందర్ హాజరయ్యారు .




ఈ సందర్భంగా వారు అవార్డు పొందిన ఉపాధ్యాయులను , అధ్యాపకులను సన్మానించి అనంతరం సమాజంలో జరుగుతున్న అనేక రకములైన సైబర్ మోసముల వలన ప్రజలు ఏ విధంగా ఆర్థికంగా మరియు అనేక విధములుగా నష్టపోవుచున్నారో తమ ఉపన్యాసములో సోదాహరణముగా వివరిస్తూ , సైబర్ మోసముల నుండి ఎలా కాపాడుకోవాలో తెలిపారు . ఈనాటి ఈ సమావేశంలో రోటరీ క్లబ్ పి.డి. జి. మల్లాది వాసుదేవ్ , అసిస్టెంట్ గవర్నర్ కోటేరు వెంకటరెడ్డి , ప్రధాన కార్యదర్శి చీఎచీూచీ ప్రసాద్ , కోశాధికారి జఎ రామకృష్ణ , రోటరీ ట్రస్ట్ బాధ్యులు డి. సాంబశివరావు , పసుమర్తి రంగారావు , ఐ. రామకృష్ణ , నల్లమోతు రవీంద్రనాథ్ , రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం సభ్యులు , సన్మానం పొందిన ఉపాధ్యాయులు , అధ్యాపకులు వారి బంధు మిత్రులు మరియు శ్రేయోభిలాషులు పాల్గొనినారు . ఈ కార్యక్రమంలో ఎన్. సీతారామిరెడ్డి , బి. చంద్రిక , కె. శ్రీనివాసరావు , టి. రామనుజాచార్యులు , జి. శ్రీదేవి, జి. సుగుణ , కె. విజయలక్ష్మి , బి. రామారావు , డి. ప్రమీల మరియు వి. వెంకటేశ్వర్లును మున్నగు ఉపాధ్యాయులను సన్మానించుట జరిగినది మరియు రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం సర్వీస్ కో ఆర్డినేటర్ పసుమర్తి రంగారావు రోటరీ క్లబ్ ఎంతో సేవలు చేసినందుకుగాను వారి దంపతులను కూడా ఆసిస్టెంట్ ఆఫ్ కమిషనర్ పోలీస్ ఫణేందర్ సార్ చేతుల మీదుగా సన్మానించడం జరిగింది .

# పోగొట్టుకున్న సెల్ ఫోన్లు అందజేసిన కొయ్యూరు ఎస్ఐ మహేందర్ కుమార్

మల్హర్ సెప్టెంబర్ 06 ప్రజాకలం ప్రతినిధి..

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఐదుగురు వ్యక్తులు వివిధ కారణాల వలన వారి సెల్ ఫోను పోగొట్టుకున్న విషయంలో కొయ్యూరు పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా పోగొట్టుకున్న అట్టి సెల్ ఫోన్ లను CEIR




పోర్టల్ ద్వారా తిరిగి వాటిని సేకరించి బాధితులకు అట్టి సెల్ ఫోన్ లను ఈరోజు పోలీస్ స్టేషన్లో కొయ్యూరు ఎస్ఐ పి మహేందర్ కుమార్ అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎం.ఏ. లతీఫ్ ని భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించాలని డిమాండ్

నిర్మల్ సెప్టెంబర్ 06 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

భైంసా పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎం.ఏ. లతీఫ్ ని భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా భైంసా కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ అబ్దుల్ వాజిద్ బనారసీ ఆధ్వర్యంలో భైంసాకు చెందిన ఒక మైనారిటీ ప్రతినిధి బృందం తెలంగాణ ప్రభుత్వ మంత్రి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ని కలిసి వినతిపత్రం సమర్పించింది. ఎం.ఏ. లతీఫ్ ని భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి నియమించాలని మంత్రిని కోరారు. ఈ సందర్భంగా ప్రతినిధి బృందం మాట్లాడుతూ, ఎం.ఏ. లతీఫ్ సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీతో అనుబంధంగా ఉంటూ పార్టీ బలోపేతానికి, ప్రజా సేవకు చురుకుగా కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఆయన కాంగ్రెస్ పార్టీ మంచిర్యాల జిల్లా మైనారిటీ డిపార్ట్‌మెంట్ అబ్జర్వర్‌గా కూడా సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతినిధి బృందం విడుదల చేసిన వీడియో సందేశంలో, ఎం.ఏ. లతీఫ్ గారి పార్టీ పట్ల సుదీర్ఘ సేవలు, ప్రజలతో ఉన్న సత్సంబంధాలు, సంస్థాగత అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించడం సముచితమని పేర్కొన్నారు. కాగా, ముధోల్ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ నాయకుల నుంచి ఎం.ఏ. లతీఫ్ కి నామినేటెడ్ పదవి కల్పించాలని డిమాండ్ నిరంతరం బలపడుతోంది. ఈ సమావేశంలో జనాబ్ షేక్ ఫరూక్ తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, మైనారిటీ ప్రతినిధి బృందం సభ్యులు పాల్గొన్నారు






### దళిత విద్యార్థుల భవిష్యత్తుతో

# చెలగాటమాడొద్దు

**-బెస్ట్ అవైలబుల్ స్కూల్ ఫీజు బకాయిలు తక్షణమే చెల్లించాలి**

**-ఫీజులు చెల్లించకుంటే 'చలో కలెక్టరేట్, చలో ప్రజాభవన్'**

పెద్దపల్లి,సెప్టెంబర్ 06:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

రాష్ట్రంలో ఎస్సీ,ఎస్టీ విద్యార్థుల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్ ఫీజు బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించి,నిరుపేద దళిత విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య,జిల్లా ఉపాధ్యక్షులు,సుద్దల మాజీ ఎంపీటీసీ సంకనపల్లి లక్ష్మయ్య,ఆదిజంబవ అరుంధతీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోటగిరి పాపయ్య డిమాండ్ చేశారు. ఆదివారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో దివంగత మర్రి చెన్నారెడ్డి హయాంలో ప్రారంభమైన ఈ పథకం ద్వారా ఎంతోమంది దళిత విద్యార్థులు కార్పొరేట్ స్థాయి విద్యనభ్యసించి ఐఏఎస్,ఐపీఎస్, ఇంజనీర్లుగా ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని గుర్తుచేశారు.ఈ పథకం కింద డే స్కాలర్ విద్యార్థులకు ఏటా రూ,28 వేలు,5వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులకు విద్య,హాస్టల్ సదుపాయాలతో కలిపి రూ.48 వేల చొప్పున ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనూ సంవత్సరాలుగా ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు.ప్రభుత్వం నుండి బిల్లులు రాకపోవడంతో ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు దళిత పిల్లలకు పుస్తకాలు, డ్రెస్సులు,బోధనా మెటీరియల్ ఇవ్వడం లేదని,కొన్నిచోట్ల తరగతుల నుండి బయటకు పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.తీవ్ర మనస్తాపానికి గురైన ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు ఇకపై తమ వల్ల కాదంటూ విద్యార్థులను పంపవద్దని జిల్లా కలెక్టర్‌తో పాటు ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించే దుస్థితి దాపురించిందని ధ్వజమెత్తారు.బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించామని చెప్తున్న ప్రభుత్వం,ఎస్సీ సంక్షేమ శాఖకు చెందిన నిధుల నుండి బెస్ట్ అవైలబుల్ పథకానికి తక్షణమే బకాయిలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి అసెంబ్లీ వేదికగా లేదా ప్రత్యేక బడ్జెట్ ద్వారా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. రాబోయే 15 రోజుల్లోగా ఫీజు బకాయిలు చెల్లించకపోతే ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం,ఆదిజంబవ,అరుంధతీ సంఘాలు, దళిత ఐక్య వేదికల ఆధ్వర్యంలో దశలవారీగా పోరాటాలు చేపడతామని హెచ్చరించారు.మొదటి విడతగా చలో కలెక్టరేట్ ఆ తర్వాత చలో ధర్మపురి అనంతరం చలో ప్రజాభవన్ కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.

# తుక్కుగూడలో ఘనంగా 'పాజ్ ఆన్ ట్రైల్స్ 2026'

**- పెంపుడు జంతువుల సంరక్షణతో బలమైన సమాజ నిర్మాణానికి అడుగులు**

**- పెంపుడు జంతువుల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు**

**-నిర్వాహకులు యానామాండ్రా ఆదిత్య పల్లవి**



మహేశ్వరం సెప్టెంబర్ ప్రజా కలం

పెంపుడు జంతువుల ఆరోగ్యం, సంరక్షణ బాధ్యతాయుతమైన పెంపకంపై అవగాహన కల్పించే లక్ష్యంతో నిర్వహించిన 'పాజ్ ఆన్ ట్రైల్స్ 2026' కార్యక్రమం తుక్కుగూడలోని ఫ్యాబ్ సిటీ రోడ్డులో ఆదివారం ఘనంగా జరిగింది.పార్క్ యువర్ పాజ్ డాగీ బోర్డింగ్ అండ్ డే కేర్ సెంటర్ ఆధ్వర్యంలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని నిర్వాహకులు యానామాండ్రా ఆదిత్య పల్లవి తెలిపారు.ఈ కార్యక్రమానికి పెంపుడు జంతువుల యజమానులు, కుటుంబాలు, జంతు ప్రేమికులు, స్థానిక వ్యాపార సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేశారు. మనుషులు, పెంపుడు జంతువులు కలిసి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడంతో పాటు, స్థానిక సమాజంలో పరస్పర అనుబంధాలను పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

కార్యక్రమంలో ప్రత్యేకతలు కమ్యూనిటీ వాక్, స్పాన్సర్ స్టాల్స్, పెంపుడు జంతువుల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు దత్తతపై అవగాహన, ఫొటో బూత్, వివిధ ఆటలు సామాజిక పరస్పర కార్యక్రమాలు పెంపుడు జంతువుల పట్ల బాధ్యతాయుతమైన వైఖరితో పాటు వాటి ఆరోగ్యం, సంక్షేమంపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడింది. స్థానిక సమాజం, ప్రముఖ వ్యాపార సంస్థలు, జంతు ప్రేమికులు ఒకే వేదికపైకి రావడం విశేషంగా నిలిచింది. పెంపుడు జంతువులకు మరింత అనుకూలమైన వాతావరణాన్ని కల్పించేందుకు ఆసక్తి చూపుతున్న పలు స్థానిక సంస్థలను భాగస్వాములను చేయడంలో పార్క్ యువర్ పాజ్ నిర్వాహకులు కీలక పాత్ర పోషించారు.

పోలీసు శాఖకు ప్రత్యేక కృతజ్ఞతలు

ఈ కార్యక్రమాన్ని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా, సురక్షితంగా విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన శంషాబాద్ ట్రాఫిక్ పోలీస్ విభాగం పహాడీషరీఫ్ లా అండ్ ఆర్డర్ పోలీస్ విభాగానికి పార్క్ యువర్ పాజ్ యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

## ఉపాధ్యాయులకు గులాబీ పువ్వు ఇస్తూ శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ పాఠశాల సాధన కమిటీ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి కొల్లూర్ భీమేష్

మహేశ్వరం, సెప్టెంబర్ 06, (ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం, మీర్ పేట నిన్న ప్రభుత్వ పాఠశాల సాధన కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జడ్.పి.హెచ్.ఎస్ మీర్ పేట, పాఠశాలలో ఉపాధ్యాయులను గులాబీ పువ్వు ఇస్తూ విద్యార్థులతో శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రభుత్వ పాఠశాల సాధన కమిటీ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి కొల్లూర్ భీమేష్ మాట్లాడుతూ మన జీవితంలో తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువులదే. అక్షరాలతో పాటు క్రమశిక్షణను, జీవితాన్ని ఎదుర్కొనే జ్ఞానాన్ని అందించి మనల్ని ఉన్నతమైన పౌరులుగా తీర్చిదిద్దే ప్రతి ఉపాధ్యాయునికీ మనం ఎల్లప్పుడూ కృతజ్ఞులమై ఉండాలి. ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ



అలాగే పాఠశాలను సందర్శించి పాఠశాలలో ఉన్నటువంటి సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సాధన కమిటీ బాలాపూర్ మండల్ జాయింట్ సెక్రెటరీ కర్నె పద్మ శ్రీ, కే.నరేందర్, వెంకట్ స్వామి, కురుమూర్తి, ఇతర తదితరులు పాల్గొన్నారు.




# లగడపాటి మాధవికి శిక్షా రత్న అవార్డు .

**అకడమిక్ లీడర్‌షిప్‌లో విశిష్ట సేవలకు దక్కిన గౌరవం.**

**నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపిన మాధవి.**

తల్లాడ సెప్టెంబర్ 6 ప్రజా కలం న్యూస్

విద్యారంగంలో విశిష్ట సేవలు, అంకితభావం, విద్యార్థుల అభ్యున్నతికి చేస్తున్న కృషికి గుర్తింపుగా లగడపాటి మాధవికి ప్రతిష్ఠాత్మక శిక్షా రత్న అవార్డ్స్--2026 పురస్కారం లభించింది.ఎక్సలెన్స్ ఇన్ అకడమిక్ లీడర్‌షిప్ విభాగంలో ఈ అవార్డుకు ఆమె ఎంపికయ్యారు. సెప్టెంబర్ 6న హైదరాబాద్‌లోని కన్హా శాంతి వనం,హరి యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు సర్టిఫికెట్ ఆఫ్ హానర్ అందజేశారు. విద్యాభివృద్ధికి, విద్యార్థులను ప్రోత్సహించేందుకు చేస్తున్న సేవలకు ఈ పురస్కారం గుర్తింపుగా నిలిచిందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ అవార్డును ఆమె భర్త ప్రముఖ న్యాయవాది లగడపాటి నెహ్రూతో కలిసి హైదరాబాద్ కన్హ,శాంతి వనంలో అందుకున్నారు. అవార్డు అందుకున్న ఆమె మాట్లాడుతూ నాకు దక్కిన ఈ గౌరవం నాలో మరింత ఉత్సాహాన్ని పెంచిందని. ప్రతిష్టాత్మక శిక్షా రత్న అవార్డుకు ఎంపిక చేసిన నిర్వాహకులకు, అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

# శ్రీ దుర్గా కన్వెన్షన్‌లో ఘనంగా కృష్ణ ప్రసాద్ డా.ఆలేఖ్య'ల నిశ్చితార్థం.

**కార్యక్రమానికి హాజరైన మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు .**

తల్లాడ సెప్టెంబర్ 6, ప్రజా కలం న్యూస్ .

కొత్తగూడెంనగరంలోని సుజాతనగర్ వద్ద గల శ్రీ దుర్గా కన్వెన్షన్ వేదికగా ఆదివారం కృష్ణ ప్రసాద్ (కేపీ), మరియు డా. ఆలేఖ్యల నిశ్చితార్థ



మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.ఎలైట్ 32 ఫార్మా మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణ ప్రసాద్ (కేపీ),డా.ఆలేఖ్య ఎంబిబిఎస్,ఎమ్మెస్ ఆప్తాల్మాలజీ ల నిశ్చితార్థ వేడుక ఆదివారం ఉదయం 10:30 గంటలకు నిర్వహించారు.ఈ వేడుకకు తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు హాజరై నవ వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. అదేవిధంగా ఇరు కుటుంబాల బంధు మిత్రులు,పలువురు ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్య క్రమానంతరం విచ్చేసిన అతిథులకు విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, బాలపేట మాజీ సర్పంచ్ కోసూరి వెంకట నరసింహారావు, నాయకులు దొడ్డ చిన్న శ్రీనివాసరావు, గోవిందు శ్రీనివాసరావు(ట్రాక్టర్, వార్డు మెంబర్ గొడ్ల వెంకటేశ్వర్లు,బాలపేట బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గజ్జెల మోహన్ రావు,రేగళ్ళ లక్ష్మణరావు,కటికి కాంతారావు,నరేష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# లెక్కల మాస్టారి ఉత్తమ సేవలకు అరుదైన గౌరవం

**-కొడంగల్ సభలో హెచ్ఎం రామకిషన్ రావుపై ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రశంసలు**

పెద్దపల్లి,సెప్టెంబర్ 06 ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లి జిల్లా బేగంపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్క రామకిషన్ రావు విద్యార్థులకు అందిస్తున్న విశిష్ట సేవలకు రాష్ట్ర స్థాయిలో అరుదైన గుర్తింపు లభించింది.సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొన్న కొడంగల్ సభలో,విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ స్వయంగా రామకిషన్ రావు చేసిన సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు. రామకిషన్ రావు విద్యార్థులకు ఎంతో ప్రతిభావంతంగా గణితం బోధించడమే కాకుండా,వినూత్న కార్యక్రమాలతో వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతున్నారని,పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఆయన తన సొంత ఖర్చులతో మొదటిసారి విమాన ప్రయాణ అనుభవాన్ని కల్పించడంపై ప్రిన్సిపల్ సెక్రటరీ సభ ముఖంగా ప్రశంసలు కురిపించారు.రాష్ట్ర స్థాయి సభలో, ముఖ్యమంత్రి సమక్షంలో పెద్దపల్లి జిల్లా ఉపాధ్యాయుని సేవలను ప్రత్యేకంగా గుర్తుచేస్తూ అభినందించడం జిల్లాకే గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. రామకిషన్ రావు భవిష్యత్తులోనూ ఇటువంటి మరెన్నో ఉన్నత గౌరవాలు, పురస్కారాలు అందుకోవాలని పలువురు విద్యావేత్తలు,సహచర ఉపాధ్యాయులు, స్థానికులు ఆకాంక్షించారు.రామకిషన్ రావుకు శుభాకాంక్షలు తెలియజేశారు.



## వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయండి

### సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు

నాగర్‌కర్నూల్ సెప్టెంబర్ 06 (ప్రజా కలం )

వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వర్ధం పర్వతాలు అన్నారు. ఆదివారం నాడు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన పార్టీ రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడుతూ వీర



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రలోని వాస్తవాలను ప్రతి కార్యకర్త తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

వీర తెలంగాణ చరిత్రకు ఎర్రని రూపాన్ని అద్దిన రోజులు ఎర్రజెండాలు రెపరెపలాడిన రోజులే వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలమని పేర్కొన్నారు. సామాన్య ప్రజలు సమరయోధులుగా ఎదిగిన కాలం అదని తెలంగాణ గడ్డ తెగువను నలుదిక్కులా చాటిన మహోన్నత పోరాటమన్నారు ప్రపంచ చరిత్రలోనే వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఒక మహత్తర అధ్యాయంగా నిలిచిందన్నారు. 1946 నుంచి 1951 వరకు 5సంవత్సరాల పాటు సాగిన ఈ పోరాటం తొలుత భూస్వాములు, దొరలు, జాగీర్దారులు, నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రారంభమై, అనంతరం యూనియన్ సైన్యాలతో కూడా కొనసాగిందన్నారు. అప్పటి హైదరాబాద్ రాష్ట్రంలోని తెలంగాణ రైతాంగం తిరుగుబాటు చేసి, కుల, మత, ప్రాంత, భాషలకు అతీతంగా ఈ పోరాటంలో భాగస్వాములయ్యారని తెలిపారు.

ఐలమ్మ వర్ధంతి నుంచి సెప్టెంబర్ 17న హైదరాబాద్ రాష్ట్రం భారతదేశంలో విలీనమైన రోజు వరకు నిర్వహించే వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో ఎలాంటి సంబంధం లేని కొందరు నాయకులు, పార్టీలు, మతతత్వవాదులు ఈ పోరాటాన్ని హిందూ--ముస్లిం పోరాటంగా చిత్రీకరిస్తూ చరిత్రకు వక్రభాష్యం చెబుతున్నారని ఆయన విమర్శించారు. ఇది హిందూ--ముస్లింల మధ్య జరిగిన పోరాటం కాదని, కుల, మత, ప్రాంత భేదాలకు అతీతంగా ప్రజలందరి భాగస్వామ్యంతో సాగిన పోరాటం సాయుధ పోరాటమని పేర్కొన్నారు చరిత్రతో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం తో సంబంధం లేని వారు దీనిపై మాట్లాడడం విడ్డూరంగా ఉందని వీర తెలంగాణ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని ఆయన అన్నారు ఈనెల 12 నుంచి 17 వరకు నిర్వహించే వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దేశ నాయక్ జిల్లా కమిటీ సభ్యులు పొదిలి రామయ్య గుంపెల్లి అశోక్ తారా సింగ్ మండల కార్యదర్శి మధు శాఖ కార్యదర్శులు నాగరాజ్ గౌడ్ సురేష్ తిరుపతయ్య చంద్రశేఖర్ సత్యనారాయణ శివరాం బాలరాజు కురుమయ్య వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

## హామీలు అమలు చేయకపోతే కాంగ్రెస్‌ను నిలదీస్తాం !

**కమిషన్ల కాంగ్రెస్ ను నిలదీసేందుకు కదం తొక్కిన మహిళలు,రైతులు.**

**6 గ్యారెంటీలు,13 డిక్లరేషన్లు,420 హామీలు తక్షణమే నెరవేర్చాలి.**

**- సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య హెచ్చరిక .**

తల్లాడ సెప్టెంబర్ 6, ప్రజా కలం న్యూస్

అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు,13 డిక్లరేషన్లు,420 హామీలను తక్షణమే అమలు చేయాలని సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సండ్ర వెంకట వీరయ్య డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో నీలి నగరాలు చూపుతూ అబద్ధపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి, ఇప్పుడు ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా కాలయాపన చేయడం సరికాదని ఆయన మండిపడ్డారు. తల్లాడ మండలం అన్నారు గూడెం గ్రామంలో రైతులు మహిళలతో కలిసి ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ సాగునీరు అందక పంటలు ఎండిపోతుంటే, మూగజీవాలకు తాగడానికి నీళ్లు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కాలువల ద్వారా తక్షణమే నీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలకే పరిమితం కాకుండా, ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చే వరకు బిఆర్ఎస్ పార్టీ తరపున పోరాటాలు సాగిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రెడ్డెం వీర మోహన రెడ్డి,ఆ పార్టీ మండల కార్యదర్శి దుగ్గిదేవర వెంకట్ లాల్, అన్నారుగూడెం సర్పంచ్ గొడ్ల ప్రభాకర్,బాలపేట మాజీ సర్పంచ్ కోసూరి వెంకట నరసింహారావు, జోనల్ సభ్యులు, అంజనాపురం ఉప సర్పంచ్ కేతినేని చలపతిరావు, గోపాలపేట ఉప సర్పంచ్ శనక్కాయల సత్య నారాయణ, వెంగన్న పేట ఉప సర్పంచ్ బోడ శ్రీను,బిల్లుపాడు ఉప సర్పంచ్ తూము కృష్ణార్జున రావు, వార్డు మెంబర్లు, బిఆర్ఎస్ పార్టీ తల్లాడ టౌన్ అధ్యక్షులు జివిఆర్, మేడ శ్రీనివాసరావు, సొసైటీ డైరెక్టర్ దగ్గుల రాజశేఖర్ రెడ్డి, బిఆర్ఎస్ మండల నాయకులు దొడ్డ చిన్న శ్రీనివాసరావు, ఆ పార్టీ మండల యువజన నాయకులు వేమా శ్రీనివాసరావు, నాయకులు ఇస్నపల్లి శ్రీను, సత్యనారాయణ, సత్తెనపల్లి వేలాద్రి, ముచ్చుంతల నరసింహారావు, స్టాలిన్,నాగు,గొడ్ల సీతారాములు,గొడ్ల యేసురత్నం, ఇస్నపల్లి దిలీప్, సునీల్ కుమార్, మహిళలు,యువకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు లో విఫలం: మాజీ ఎంపీ నామ

**- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై గ్రామాల్లో చర్చ జరగాలి: మాజీ ఎంపీ నామ**

**- కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం: మాజీ ఎంపీ నామ**

**- కేసీఆర్ పదేళ్ల పాలనలోనే పల్లెలు, పట్టణాల అభివృద్ధి: మాజీ ఎంపీ నామ**

**- కాంగ్రెస్ మూడేళ్ల పాలనలో పల్లెల్లో,**

**పట్టణాల్లో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది: మాజీ ఎంపీ నామ.**



ఖమ్మం సెప్టెంబర్ 06 (ప్రజా కలం న్యూస్ )

వైరా అసెంబ్లీ నియోజక వర్గంలోని జూలూరుపాడు మండలం లో కాంగ్రెస్ వెయ్యి రోజుల విఫల పాలనలో పల్లెల విధ్వంసం, పడకేసిన పారిశుధ్యంపై నిరసన కార్యక్రమ ర్యాలీ లో బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ర్యాలీ అనంతరం బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆర్జెసి కృష్ణ, లకావత్ గిరిబాబు ఆధ్వర్యంలో ప్రైవేట్ ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేసిన కార్యక్రమం లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తో కలసి మాజీ ఎంపీ నామ పాల్గొన్నారు. ఈ సంధర్బంగా నామ మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ప్రజలకు లేనిపోని మాయమాటలు, మోసపూరిత హామీలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని నామ నాగేశ్వరరావు తీవ్రంగా విమర్శించారు. ?కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా ఎన్నికల ముందు మహిళలకు, యువతకు, విద్యార్థులకు, రైతులకు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ పూర్తిగా నెరవేర్చలేకపోయారని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో రైతు సంక్షేమం కోసం లక్ష కోట్లు ఖర్చు చేశారని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా, రైతు భీమా పథకాలను అమలు చేయడం లో విఫలమైందని విమర్శించారు కనీసం రైతులకు ఎరువులు కూడా ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఆరోపించారు. అన్ని రకాల పెన్షనులు పెంచి అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన వెయ్యి రోజులు గడుస్తున్నా ఆ హామీ నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేసీఆర్ పాలనలో ఆడబిడ్డలకు అండగా నిలిచిన కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని అన్నారు. పల్లెల్లో, పట్టణాల్లో పారిశుధ్యం కోసం నాడు కేసీఆర్ హయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని కానీ కాంగ్రెస్ మూడేళ్ల పాలనలో వల్లెల్లో పారిశుధ్యం అధ్వానంగా తయారైందని తెలియజేశారు.

కేసీఆర్, పాలన సువర్ణ యుగం

రాష్ట్ర ఏర్పాటుకు ముందు కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రాంతంలో తాగు, సాగునీటి కష్టాలు ఉండేవని వాటితో పాటుగా తీవ్ర విద్యుత్ సంక్షోభం ఉండేదని మాజీ ఎంపీ నామ గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తరువాత కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ పల్లెలు, పట్టణాలు ఎంతో అభివృద్ధి చెందాయని ప్రతి గ్రామంలో వైకుంఠ ధామాలు, 24 గంటలు విద్యుత్, సాగునీరు, తాగునీరు అందించారని అ ఘనత ఒక్క కేసీఆర్ కే దక్కుతుందని తెలిపారు.

ఖమ్మం జిల్లా అభివృద్ధి బిఆర్ఎస్ హయాంలోనే

మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఖమ్మం నగరం మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి చెందిందని మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. సైకిళ్లు, మోటార్ సైకిళ్లపై ప్రతి డివిజన్ ప్రతి వీధి తిరిగి ప్రజల సమస్యలు పరిష్కారం చేసిన నాయకుడు అజయ్ కుమార్ అన్నారు. జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ ఖమ్మం అభివృద్ధిని పూర్తిగా పక్కన పెట్టారని, ప్రజా సమస్యలను పట్టించుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై జరుగుతున్న దాడులను ఎదుర్కొంటామని, నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడతామని స్పష్టం చేశారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధి పై ముగ్గురు మంత్రులతో చర్చకు సిద్ధం అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చంద్రావతి,డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మనీషా లక్ష్మి మదన్ లాల్, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆటో కార్మికుల హామీలు వెంటనే అమలు చేయాలి

### ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ.




ఖమ్మం, సెప్టెంబర్ 06 (ప్రజా కలం న్యూస్)

ఖమ్మం నగరంలోని ఆదివారం ఆటో కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పిలుపుతో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఖమ్మం నియోజకవర్గంలో ఆదివారం ఆటో కార్మికులతో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు సత్తార్ మియా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు, ఖమ్మం నగర బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు పగడాల నాగరాజు, బీఆర్టీయూ జిల్లా నాయకుడు పాషా, మాజీ ఉప మేయర్ బత్తుల మురళీ ప్రసాద్, మాజీ కార్పొరేటర్ మక్బుల్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఆటో కార్మికులకు ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా మోసం చేసిందని ఆరోపించారు. ఇప్పటికే మూడు సంవత్సరాలు పూర్తవుతున్నందున ఒక్కో ఆటో కార్మికుడికి రూ.36 వేల చొప్పున బకాయి ఉందని, ఆ మొత్తాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉచిత బస్సు ప్రయాణం కారణంగా ఆటో కార్మికుల ఆదాయం గణనీయంగా తగ్గిపోయిందని, ఆటోలకు తీసుకున్న రుణాల వాయిదాలు చెల్లించలేక, పిల్లల విద్యా ఫీజులు కూడా భరించలేక అనేక కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఆర్థిక ఇబ్బందుల కారణంగా 215 మంది ఆటో కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని నాయకులు పేర్కొన్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవడంతో పాటు తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

ఆటో కార్మికులకు గతంలో అండగా పువ్వాడ అజయ్ కుమార్ కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పువ్వాడ అజయ్ కుమార్ రవాణా శాఖ మంత్రిగా ఆటో కార్మికుల సంక్షేమానికి పలు చర్యలు తీసుకున్నారని నాయకులు గుర్తు చేశారు. ముఖ్యంగా ఆటో కార్మికులపై ఉన్న రోడ్డు పన్నును రద్దు చేసిన ఘనత కేసీఆర్, పువ్వాడ అజయ్ కుమార్‌లదేనని అన్నారు.ప్రభుత్వాలు మారినప్పుడు గత ప్రభుత్వాల కంటే మెరుగైన సంక్షేమం, సౌకర్యాలు కల్పించాల్సి ఉండగా, ప్రస్తుత ప్రభుత్వం ఆటో కార్మికుల జీవనోపాధిని దెబ్బతీస్తూ రవాణా రంగాన్ని సంక్షోభంలోకి నెడుతోందని విమర్శించారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి ఆటో కార్మికులకు న్యాయం చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ వారి పక్షాన నిలబడి పోరాడుతుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో కార్మిక నాయకుడు మాటూరు లక్ష్మీనారాయణ, ఆటో యూనియన్ రఘునాథపాలెం మండల అధ్యక్షుడు మొహమ్మద్ ఠాగూర్, చాంబర్ ఆఫ్ కామర్స్ నాయకుడు మెంతుల శ్రీశైలం, మాజీ కార్పొరేటర్ పాలడుగు పాపారావు, బోజట్ల రామ్మోహన్, షకీనా, వాంకుడోత్ సురేష్, శ్రీను, ఉల్లోజు శ్రీనివాసు, షేక్ ఉస్మాన్, ఆరంపల వీరభద్రం, కందాల వీరేందర్, షేక్ సద్దాం, దండగల రాంబాబు, మాధవి, పాషా, నవీన్, సైదా, రాజా, కస్తాల ఉపేందర్, పోతనబోయిన నవీన్, వీరన్న, సురేష్, ఉపేందర్, ప్రసాద్, గుగులోత్ నవీన్, కోటి, రవి, జానీ, వెంకటి, రమేష్, వీరభద్రం, నాగరాజు, ప్రవీణ్, శివాయి గూడెం సైదా, రాజా తదితర ఆటో యూనియన్ నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో, పాల్గొన్నారు.

## నిశ్చితార్థ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ.

పాలేరు సెప్టెంబర్ 06 (ప్రజా కలం న్యూస్ )

నేలకొండపల్లి మండల కేంద్రంలోని ఆదివారం ముక్తవరపు రంగసూరి--రమాదేవి దంపతుల కుమార్తె చి.సౌ. గాయత్రి, చి. శివరామకృష్ణల నిశ్చితార్థ వేడుక ఘనంగా జరిగింది. ఈ వేడుకకు పాలేరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కందాళ ఉపేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాబోయే వధూవరులు శివరామకృష్ణ--గాయత్రిలను కందాళ ఉపేందర్ రెడ్డి ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య, నేలకొండపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్



శీలం వెంకటలక్ష్మి, కోనాయిగూడెం సర్పంచ్ కోటి సైదారెడ్డి, మరికంటి రేణుబాబు, దాసరి ఉదయ్, మాదాసు ఆదాం, లింగం ఎలమంద, పట్టణ నాయకులు గడ్డం లక్ష్మయ్య, మహ్మద్ వాజిద్, పగిడికత్తుల శ్రీకాంత్, కిషోర్‌తో పాటు మండల, గ్రామ, పట్టణ నాయకులు, కుటుంబ సభ్యులు, అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

### సెప్టెంబర్ 10న ఉద్యోగ ఉపాధ్యాయ హక్కుల సాధన కోసం భారీ సభకు తరలిరావాలని పిలుపు

నాగర్‌కర్నూల్ సెప్టెంబర్ 06 (ప్రజా కలం ):

ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం సెప్టెంబర్ 10న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో కార్యాలయంలో చలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. టీజీ జేఏసీ నాగర్‌కర్నూల్ జిల్లా



చైర్మన్ బావండ్ల వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశంలో వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఉద్యోగ, ఉపాధ్యాయ హక్కుల సాధన భారీ సభకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు తరలిరావాలని నాయకులు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ పీఆర్సీని వెంటనే అమలు చేయడంతో పాటు పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులందరికీ ఈహెచ్ఎస్ కార్డులను పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరారు. అదేవిధంగా ఓపీఎస్ సాధన కోసం ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. "పెన్షన్ ప్రతి ఉద్యోగి జన్మహక్కు" అనే నినాదంతో తమ హక్కుల సాధన కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఉద్యోగి, ఉపాధ్యాయుడు తమ వంతు బాధ్యతగా సెప్టెంబర్ 10న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొని, హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఉద్యోగ, ఉపాధ్యాయ హక్కుల సాధన సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ విజయవంతం చేస్తామని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు తీర్మానించారు ఈ కార్యక్రమంలో మాధవరెడ్డి మునగాల సతీష్ కుమార్ ఎండి సర్వుద్దీన్ సిహెచ్ వెంకట్ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు

## చిన్నారిని ఆశీర్వదించిన కాంగ్రెస్ నాయకులు

**- మాజీ సర్పంచ్ శీలం కోటారెడ్డి, అన్నెం కోటిరెడ్డి ..**

తల్లాడ సెప్టెంబర్ 6, ప్రజా కలం న్యూస్

తల్లాడ మండలం అంజనాపురం గ్రామం కాంగ్రెస్ పార్టీ నాయకులు కొమ్మినేని ప్రభాకర్ రావు మనవడు అన్న ప్రాసన వేడుక ఆదివారం అంజనాపురం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు రామనుజవరం మాజీ సర్పంచ్,కాంగ్రెస్ పార్టీ నాయ కులు శీలం కోటారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నెం కోటిరెడ్డి లు హాజరై చిన్నారిని అక్షింతలు వేసి



ఆశీర్వదించారు నిండు నూరెళ్లు ఆయురా రొగ్యాలతో జీవించాలని దీవించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు ముఖ్య నాయకులు,కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల నాయకులు,సర్పంచ్ లు, తల్లాడ సిపిఎం పార్టీ సీనియర్ రైతు సంఘ నాయకులు గుంటుపల్లి వెంకటయ్య, నరసింహారావు, నాగేశ్వరరావు, కార్యకర్తలు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నాదెండ్ల మనోహర్ పై అసహనం



గుంటూరు : జనసేన పార్టీలో కీలక నేత నాదెండ్ల మనోహర్ పై ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఆగ్రహంతో ఉన్నారు. నాదెండ్ల తమ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ కు రాజకీయంగా తప్పుదోవ పట్టిస్తున్నారన్న భావన క్యాడర్ లో నెలకొంది. అంతా తానే అయి.. అధినేతను ఎవరినీ కలవనివ్వకుండా, వాస్తవ విషయాలను చెప్పనివ్వకుండా దాచి ఉంచుతున్నారని సోషల్ మీడియా వేదికగా ఆరోపిస్తున్నారు. నాదెండ్ల మనోహర్ పై ఇటువంటి ఆరోపణలు కొత్తేమీ కాదు. జనసేన పార్టీ పెట్టిన నాటి నుంచి పవన్ కల్యాణ్ వెన్నంటే ఉన్న నాదెండ్లను పార్టీ నేతలు, కార్యకర్తలు వ్యతిరేకిస్తూనే వస్తున్నారు. తమ వ్యతిరేకతను సోషల్ మీడియాలో వ్యక్త పరుస్తున్నారు. అంతే తప్పించి సభల్లోనూ, సమావేశాల్లోనూ పవన్ కల్యాణ్ కు చెప్పేందుకు మాత్రం ప్రయత్నం చేయడం లేదు. అయితే నాదెండ్ల కేవలం పవన్ చేసిన సూచనల మేరకే అమలు చేస్తున్నారని, ఇందులో ఆయన తప్పేముందని కూడా కొందరు నాదెండ్ల మనోహర్ ను సమర్థిస్తున్నారు.ప్రపంచ పటాలు పరిశీలించండి.పార్టీలో కీలకంగా మారడంతో... ఇక ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పవన్ కల్యాణ్ అస్వస్థతకు గురి కావడం, చంద్రబాబుతో భేటీలోనూ, పార్టీ నేతల సమావేశంలోనూ నాదెండ్ల మనోహర్ కీలకం గా వ్యవహరిస్తున్నారు. పవన్ కల్యాణ్ ఆయనను నమ్మి కీలక పాత్రను అప్పగించారని చెబుతున్నారు. జనసేన పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ చైర్మన్, ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పై పార్టీ క్యాడర్ మరియు నేతల్లో కొంత అసంతృప్తి ఉందనే ప్రచారం సోషల్ మీడియా మరియు కొన్ని రాజకీయ వర్గాల్లో సాగుతుంది. .ప్రస్తుతం జనసేన పార్టీ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తమవుతున్న తరుణంలో, నాయకత్వం మరియు క్యాడర్ మధ్య సమన్వయం కోసం ఆయన విస్తృతంగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. గెలిచే స్థానాల్లోనే పోటీ చేయాలని, బలం లేని చోట పోటీకి దిగవద్దని నాదెండ్ల మనోహర్ మనోహర్ వ్యాఖ్యానించడం దిగువ శ్రేణి నేతల్లో ఆగ్రహానికి కారణమయింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో టిక్కెట్ల కేటాయింపు తో పాటు పొత్తుల విషయంలో నాదెండ్ల మనోహర్ పవన్ ను తప్పుదోవ పట్టించి తిరిగి తమకు అన్యాయం చేయడానికి సిద్ధమయ్యారని కొందరు నేరుగానే ఆరోపిస్తున్నారు. గత శాసనసభ ఎన్నికల్లో కూటమి పొత్తుల వల్ల కొందరు స్థానిక జనసేన నేతలకు పోటీ చేసే అవకాశం దక్కకపోవడంతో అంతర్గతంగా కొంత అసంతృప్తి వ్యక్తమైంది. కొన్ని నియోజకవర్గాల్లో స్థానిక నేతల మధ్య ఉన్న విభేదాలు, నాదెండ్ల మనోహర్ వైఖరిపై విమర్శలుగా మారాయి. కూటమి ప్రభుత్వం మరియు జనసేన పార్టీలో చీలికలు తేవడానికి వైసీపీ వంటి ప్రతిపక్షాలు సోషల్ మీడియా వేదికగా ఇటువంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని జనసేన వర్గాలు మండిపడుతున్నాయి.పార్టీలో ఎటువంటి అంతర్గత విభేదాలు లేవని, జనసేనలో కేవలం "పవన్ కళ్యాణ్ గ్రూప్" మాత్రమే ఉందని నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్క కార్యకర్తకు, వీరమహిళకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుర్తింపు, అవకాశాలు లభిస్తాయని హామీ ఇచ్చారు.తాను ఎక్కడికి వెళ్లినా జనసైనికులు ఆత్మీయంగా పలకరిస్తున్నారని, పార్టీ శ్రేణులు అంతా ఐక్యంగా ఉన్నారని నాదెండ్ల మనోహర్ ఇటీవలే పేర్కొన్నారు.

# ఫలితాలను ఇస్తున్న అక్షర ఆంధ్ర

విజయవాడ : దేశంలోనే అత్యంత తక్కువ అక్షరాస్యత కలిగిన రాష్ట్రాల్లో ఒకటిగా విమర్శలు ఎదుర్కొన్న ఆంధ్రప్రదేశ్, గత రెండేళ్లలో సాధించిన ప్రగతి విద్యా రంగంలో ఒక మైలురాయిగా నిలుస్తోంది. 2024 నాటికి కేవలం 72.6 శాతంగా ఉన్న అక్షరాస్యత, 2026 నాటికి ఏకంగా 82.1 శాతానికి చేరుకుంది. జాతీయ సగటు కంటే వెనుకబడిన స్థితి నుంచి కేవలం రెండేళ్ల వ్యవధిలోనే దాదాపు 10 శాతం మేర అక్షరాస్యత పెరగడం వెనుక విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ చేపట్టిన పక్కా ప్రణాళికలు, క్షేత్రస్థాయి పరిశీలన, రిజల్ట్-ఓరియంటెడ్ విధానాలే ప్రధాన కారణం.ఈ భారీ మార్పుకు అక్షర ఆంధ్ర కార్యక్రమం వెన్నెముకగా నిలిచింది. విద్యా శాఖను చేపట్టిన వెంటనే నారా లోకేష్, కేవలం పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతోనే సరిపెట్టకుండా ఫలితాలు ఆధారంగా పనిచేసే ప్రత్యేక కార్యాచరణను అమలు చేశారు. సుమారు 11 ప్రభుత్వ శాఖల భాగస్వామ్యంతో గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాలలో నిర్వహించిన అక్షరాస్యతా విభాగాలు, ఫీల్డ్ ప్రోగ్రామ్‌ల ద్వారా గత ఏడాది కాలంలోనే దాదాపు 25 లక్షల మందిని అక్షరాస్యులుగా మార్చడం లోకేష్ పరిపాలనా దక్షతకు అద్దం పడుతోంది.అంతేకాకుండా, పాఠశాల విద్యలో డ్రాపౌట్లను తగ్గించి హాజరు శాతాన్ని పెంచడంపై మంత్రి లోకేష్ ప్రత్యేక దృష్టి సారించారు. ఒఇంఖ యాప్ ద్వారా బడికి దూరమైన 1.64 లక్షలకు పైగా పిల్లల డేటాను సేకరించి, వారిలో సుమారు 33 వేల మందిని తిరిగి పాఠశాలల్లో చేర్పించడం, టీచర్ల హాజరును 98.97 శాతానికి తీసుకెళ్లడం విద్యావ్యవస్థలో వచ్చిన సమూల మార్పుకు ఉదాహరణ. ఉపాధ్యాయుల కొరత తీర్చే దిశగా నిర్ణయాలు తీసుకోవడమే కాకుండా, తల్లికి వందనం, సాంకేతికత ఆధారిత పర్యవేక్షణ ద్వారా విద్యార్థుల్లో జవాబుదారీతనాన్ని లోకేష్ పెంచగలిగారు.ఇప్పుడు ప్రభుత్వం విధించుకున్న ప్రతిష్టాత్మక లక్ష్యం సెప్టెంబర్ 2027 నాటికి 100% సంపూర్ణ అక్షరాస్యత సాధించడం. దీనికోసం 2027 మార్చి నాటికి మరో 25 లక్షల మందిని, సెప్టెంబర్ 2027 నాటికి మిగిలిన 27 లక్షల మందిని అక్షరాస్యులుగా మార్చడానికి ప్రజాప్రతినిధులను, స్థానిక సంస్థలను భాగస్వాములను చేస్తూ టైమ్-బౌండ్ టార్గెట్లను నిర్దేశించారు. ఇది కేవలం కాగితాలకే పరిమితం కాకుండా ప్రతీ నియోజకవర్గంలో కార్యాచరణ వేగవంతం అయ్యేలా ఐఏఎస్ అధికారులతో క్రమం తప్పకుండా చేస్తున్న సమీక్షలే ఈ వృద్ధికి బలం చేకూరుస్తున్నాయి.గడిచిన రెండేళ్లలో ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖలో నమోదైన ఈ గణనీయమైన మార్పు నారా లోకేష్ రాజకీయ, పరిపాలనా సామర్థ్యానికి ఒక బలమైన రుజువుగా నిలుస్తోంది. ఒకప్పుడు జాతీయ స్థాయిలో అక్షరాస్యతలో ఆఖరి వరుసల్లో నిలిచిన ఏపీని, 2027 నాటికి దేశంలోనే మొదటి సంపూర్ణ అక్షరాస్యత సాధించిన రాష్ట్రాలలో ఒకటిగా నిలిపేందుకు లోకేష్ వేస్తున్న అడుగులు ఆయన విజనరీ లీడర్‌షిప్‌ను స్పష్టం చేస్తున్నాయి.

# కూటమిలో మైక్రో మేనేజ్‌మెంట్

ఏలూరు : నరసాపురం నియోజకవర్గంలో నిర్వహించిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్థానిక జనసేన ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పనితీరుపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేయడం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీసింది. నియోజకవర్గానికి చెందిన 25 కేపీఐ సూచీల్లో 23 మైనస్ ఉన్నాయని సభాముఖంగా స్పష్టం చేస్తూ, నోడల్ అధికారిని మార్చాలని కలెక్టర్‌ను ఆదేశించడం, అధికారులకు గట్టిగా క్లాస్ తీసుకోవడం కలకలం రేపింది. పాలనా సంస్కరణలు, పనితీరు ఆధారిత నాయకత్వంపై చంద్రబాబుకు ఉన్న పట్టుకు ఇది నిదర్శనమే అయినా, మిత్రపక్ష ఎమ్మెల్యేను ప్రజల ముందే అలా నిలదీయడం కూటమి ధర్మానికి విఘాతం కలిగిస్తుందా అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.తెలుగుదేశం పార్టీ అధినేతగా సొంత పార్టీ ఎమ్మెల్యేలను, మంత్రులను చంద్రబాబు వేదికలపై లేదా సమీక్షా సమావేశాల్లో హెచ్చరించడం దశాబ్దాలుగా వస్తున్న శైలి. టీడీపీ ప్రజాప్రతినిధులు ఆ వ్యాఖ్యలను పార్టీ పెద్ద ఇచ్చే హెచ్చరికగా పరిగణిస్తారు. కానీ, కూటమి భాగస్వామి అయిన జనసేన పార్టీ ప్రజాప్రతినిధి విషయంలో అదే వ్యూహాన్ని వర్తింపజేయడం పొలిటికల్ ప్రోటోకాల్‌ను ఉల్లంఘించడమేనని భావిస్తున్నారు. జనసేన ఎమ్మెల్యేలు నేరుగా పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పనిచేస్తుండటంతో, వారి పనితీరుపై చర్యలు లేదా హెచ్చరికలు ఉంటే అంతర్గత సమన్వయ కమిటీల ద్వారా లేదా పవన్ కళ్యాణ్ ద్వారా ఇప్పించడమే సరైన పద్ధతిగా చెబుతున్నారు. ఈ బహిరంగ వ్యాఖ్యల పట్ల జనసేన కేడర్, జనసైనికులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. తమ ఎమ్మెల్యేకు పనితీరు సరిగా లేకపోతే సరిదిద్దే బాధ్యత తమ అధినేత పవన్ కళ్యాణ్‌ది అని, మైకుల ముందుకు వచ్చి ఒక నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఇమేజ్‌ను ప్రజల ముందు తగ్గించడం వల్ల రాబోయే రోజుల్లో గ్రౌండ్ లెవెల్‌లో కేడర్ మధ్య వైషమ్యాలు పెరుగుతాయని వారు ఆందోళన చెందుతున్నారు. మిత్రపక్ష నాయకుడి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా పబ్లిక్ వేదికలపై మాట్లాడటం వల్ల క్షేత్రస్థాయిలో టీడీపీ, జనసేన శ్రేణుల మధ్య ఉండాల్సిన ఐక్యత దెబ్బతినే ప్రమాదం ఉంది. ఇది రాబోయే రోజుల్లో మరింత పెద్ద రాజకీయ వివాదానికి ఆజ్యం పోసే అవకాశముంది. రేపు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఏదైనా ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు, పాలనాపరమైన లోపాలున్న ఏదేని టీడీపీ ఎమ్మెల్యేను లేదా టీడీపీ మంత్రుల నియోజకవర్గాలను ఉద్దేశించి ఇదే తరహాలో వ్యాఖ్యలు చేస్తే పరిణామాలు ఎలా ఉంటాయనే ప్రశ్న వస్తోంది.

పవన్ కళ్యాణ్ కూడా టీడీపీ ప్రజాప్రతినిధులపై బహిరంగంగా విమర్శలు గుప్పిస్తే, అది పొత్తు ధర్మానికి ముగింపు పలికి రెండు పార్టీల మధ్య పరస్పర దాడులకు దారితీస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డేటా-డ్రివెన్ గవర్నెన్స్‌కు, రిపోర్ట్ కార్డులకు అత్యంత ప్రాధాన్యమిస్తారు. పాలనలో సీనియారిటీ, పొత్తులు చూడకుండా పనితీరునే ప్రామాణికంగా తీసుకుంటారనే సందేశాన్ని ప్రజల్లోకి పంపాలనేది ఆయన ఆలోచన కావచ్చు. రాష్ట్రాభివృద్ధికి కూటమి స్థిరత్వం ఎంత ముఖ్యమో గ్రహించిన క్రమంలో, వ్యూహాత్మకంగా మైక్రో మేనేజ్‌మెంట్ వ్యాఖ్యలను అంతర్గత సమావేశాలకే పరిమితం చేయకపోవడం చంద్రబాబు చేసిన ఒక చిన్న రాజకీయ అంచనా పొరపాటేనని నిపుణులు భావిస్తున్నారు. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందించాలంటే రిపోర్ట్ కార్డులను అమలు చేయడం ఎంత ముఖ్యమో, మిత్రపక్షాల ఆత్మగౌరవాన్ని కాపాడటం కూడా అంతే ముఖ్యమన్న భావన వ్యక్తమవుతోంది.

# ఆరణికి రాజకీయ ఇబ్బందులు



తిరుపతి : కొందరు పార్టీలు మారి ఎమ్మెల్యేలు కావచ్చు. అంత మాత్రాన పట్టున్న నియోజకవర్గంలో కాలరెగరేస్తే రాజకీయ భవిష్యత్ ఇబ్బందుల్లో పడే అవకాశముంది. ప్రస్తుతం జనసేన తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పరిస్థితి కూడా అలాగే ఉంది. తిరుపతి నియోజకవర్గంలోని జనసేన నేతలు, కార్యకర్తల నుంచి ఆయన వ్యతిరేకత ఎదుర్కొంటున్నారు. ఇక కూటమిలోని మిత్ర పక్షాలు కూడా ఆయనకు మద్దతుగా నిలిచే అవకాశం కనిపించడం లేదు. ఆయన తిరుపతి ఎమ్మెల్యే అయిన తర్వాత నియోజకవర్గాన్ని పట్టించుకోకపోవడంతో పాటు, తమను కూడా దూరం పెట్టడంతో కూటమిలోని మిత్ర పక్షాల నుంచి ఆరణికి రాజకీయ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆయనపై ఉన్న అసంతృప్తి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలపై పడే అవకాశముందన్న ఆందోళన జనసేన నేతల్లో ఉంది. స్థానిక క్యాడర్ నుంచి... తిరుపతి జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుపై పార్టీ క్యాడర్, స్థానిక నాయకుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. జనసేన క్యాడర్‌ను పట్టించుకోకపోవడంతో పాటు అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ కార్యకర్తలను, సీనియర్లను ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.వైసీపీ నేతలతో సంబంధాలు కూడా ఆరణి శ్రీనివాసులుకు ఇబ్బందిగా మారాయంటున్నారు. కూటమి కార్యకర్తలను పక్కన పెట్టి, కొందరు వైసీపీ నేతలతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక మున్సిపల్ కార్పొరేషన్ వ్యవహారాలలో ఆరణి శ్రీనివాసులు ఎమ్మెల్యే బంధువులు, కుటుంబ సభ్యులు జోక్యం చేసుకోవడం వివాదాస్పదమైంది. ఇప్పటికే ఆరణి శ్రీనివాసులుపై సొంత పార్టీ నేతలే ఫిర్యాదు చేయడంతో సమన్వయంతో పనిచేయాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్వయంగా ఆయనకు సీరియస్ వార్నింగ్ ఇచ్చినట్లు సమాచారం. ఆరణి శ్రీనివాసులు వైసీపీ నుంచి జనసేనలోకి వచ్చారు. 2019 లో చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసీపీ తరుపున పోటీ చేసి విజయం సాధించారు. నాడు తిరుపతి ప్రాంతంలోని అనేక మంది వైసీపీ నేతలతో సంబంధాలున్నాయి. ప్రధానంగా భూమన కరుణాకర్ రెడ్డితో ఆయనకు సన్నిహిత్వం ఉందంటారు. అలాగే మరి కొందరు వైసీపీ నేతలను కూడా ఆయన దగ్గర తీస్తున్నారన్న ఆరోపణలున్నాయి. విపక్ష వైసీపీ చేసే విమర్శలకు కూడా ఆరణి శ్రీనివాసులు కౌంటర్ ఇవ్వకపోవడం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పై విమర్శలు చేసినా చూసీచూడనట్లు వ్యవహరించడంతో పార్టీ నాయకత్వం కూడా ఆయన వ్యవహార శైలి పట్ల ఆగ్రహంగా ఉందని తెలుస్తోంది. వివాదాలు లేకపోయినా.. అనేక ఆరోపణలు ఆరణి శ్రీనివాసులును చుట్టుముడుతుండటంతో ఆయన రాజకీయంగా ఇబ్బందులలో పడినట్లేనని సొంత పార్టీ నేతలే చెబుతుండటం విశేషం.

# స్టీల్ ప్లాంట్ ఆస్తులు వేలం

విశాఖపట్టణం : విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ మిగులు భూముల్ని మరోసారి వేలం నిర్వహించబోతున్నారు. విశాఖపట్నంలోని హెచ్‌బీ కాలనీ, గాజువాక ఆటోనగర్ ప్రాంతం ఉన్న 459 ప్లాట్ల విక్రయానికి ఎన్ఎల్ఎంసీ (నేషనల్ ల్యాండ్ మానిటైజేషన్ కార్పొరేషన్) రూ.858.68 కోట్ల రిజర్వ్ ధరతో ఈ?ఆక్షన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. నిధుల సమీకరణ, అసెట్ మానిటైజేషన్‌లో భాగంగా వేలంపాటకు సిద్ధమైనట్లు పేర్కొన్నారు. విశాఖపట్నంలోని సీతమ్మధార పరిధిలో ఉన్న హెచ్‌బీ కాలనీలో 456 ప్లాట్లు 87,949.77 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్నాయి.. వాటిని రూ.838.93 కోట్ల రిజర్వ్ ధరతో వేలానికి సిద్ధమయ్యారు. అలాగే గాజువాక ఆటోనగర్‌లోని బ్లాక్? 2లో 2,728 చదరపు గజాలలో, మూడు బ్లాక్-3లోని 2894.44 చదరపు గజాల్లో ఉన్న రూ.19.75 కోట్లు విలువైన ప్లాట్లను వేలం వేయనున్నారు.ఈ ఏడాది అక్టోబర్ 12వతేదీన ఉదయం 11 గంటల నుంచి 243 ప్లాట్లకు.. 16వతేదీన ఉదయం 11 గంటల నుంచి 216 ప్లాట్లకు వేలం నిర్వహించనున్నారు. అక్టోబర్ 12న 243 ప్లాట్లకు సంబంధించి వేలంలో పాల్గొనేవారు అక్టోబర్ 8 సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అధికారులు సూచించారు. అక్టోబర్ 16న 216 ప్లాట్లకు సంబంధించి వేలంలో పాల్గొనేవారు అక్టోబర్ 14 సాయంత్రం 5 గంటలలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఒకవేళ ఎవరైనా ఈ ప్లాట్లను చూడాలనుకుంటే కేవీ సుబ్బరాజు, 9849091798.. ఎం ఆంజనేయులు, 9989898999 నంబర్లలో సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు.35 ఏళ్ల క్రితం విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు ఉద్యోగుల కోసం సీతమ్మధార ప్రాంతంలోని హెచ్‌బీ కాలనీలో 22.19 ఎకరాల విస్తీర్ణంలో 830 క్వార్టర్లు నిర్మించారు. కానీ స్టీల్‌ప్లాంట్‌కు 15 కిలోమీటర్ల దూరంలో ఈ ప్లాట్లు ఉండటంతో ఉద్యోగులు అక్కడ ఉండటానికి ఆసక్తి చూపించలేదు. ఈ క్వార్టర్లకు సరైన నిర్వహణ లేకపోవడంతో శిథిలమైపోయాయి.

ప్రస్తుతం ఈ ప్లాట్లు ఉన్న ప్రాంతంలో భూముల ధరలు పెరిగాయి. అక్కడ గజం రూ.లక్షన్నర నుంచి రూ.2 లక్షలు పలుకుతోందని చెబుతున్నారు. గతంలో ఈ-వేలం ద్వారానే హెచ్‌బీ కాలనీలో కొన్ని ప్లాట్లు విక్రయించగా.. రూ.150 కోట్ల వరకు ఆదాయం వచ్చింది. ఇప్పుడు మరోసారి వేలానికి సిద్ధమవుతున్నారు. స్టీల్ ప్లాంట్ యాజమాన్యం విశాఖపట్నంలోని హెచ్‌బీ కాలనీ, ఆటోనగర్‌లో ఉన్న భూములు.. హైదరాబాద్, చెన్నై వంటి ప్రాంతాల్లో ఉన్న భూముల్ని విక్రయించేందుకు సిద్ధమైంది. కానీ ఈ భూముల విక్రయించొద్దంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ కోర్టులో పిల్ దాఖలు చేయడంతో స్టే విధించారు.. దీంతో కొన్నాళ్లు ఈ భూముల వేలం ప్రక్రియ ఆగిపోయింది.. మళ్లీ ఇప్పుడు మరోసారి భూముల వేలానికి సిద్ధమయ్యారు.

# లోకల్ బాడీ ఎన్నికలకు కసరత్తు షురూ

విజయవాడ : ఏపీలో కూటమి పార్టీలు స్థానిక ఎన్నికలు రెడీ అవుతున్నాయి. ఇప్పటికే జనసేన అధిష్ఠానం.. ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్యకర్తలతో వరుసగా భేటీ అవుతుంది. టీడీపీ కూడా ఎన్నికల కసరత్తును స్పీడప్ చేసింది. ఈ నెల 6, 7 తేదీల్లో టీడీపీ ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఏడు అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. టీడీపీ ఎమ్మెల్యేలు అందరూ శిక్షణ తరగతులకు హాజరు కావాలని టీడీపీ కేంద్ర కార్యాలయం ఆదేశించింది. ఎన్నికల నిర్వహణ కసరత్తులో భాగంగా ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఇవాళ సాయంత్రం మంత్రులు, కీలక నేతలతో సీఎం టింగ్ నిర్వహించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు, మున్సిపాలిటీల్లో జరుగుతున్న పనులు, కూటమి పార్టీల సమన్వయంపై చర్చించే అవకాశం ఉంది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు అనుకున్న సమయానికే జరుగుతాయని, వాయిదా వేసే ప్రసక్తే లేదని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. అమరావతిలో టీడీపీ మంత్రులతో ఆయన బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి లోకేష్ పార్టీ నాయకులకు, ఎమ్మెల్యేలకు ఎన్నికల గురించి దిశానిర్దేశం చేశారు. ఎన్నికల ప్రక్రియ అక్టోబర్ నాటికి పూర్తవుతుందన్నారు. ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేసి, అన్ని స్థానాల్లోనూ కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని మంత్రి లోకేష్ నేతలకు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలు దశలవారీగా జరుగుతాయని మంత్రి లోకేష్ తెలిపారు. మొదటిగా మున్సిపల్ ఎన్నికలు, ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఆపై పంచాయతీ ఎన్నికలు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. పెండింగ్ కేసులను పరిష్కరించుకుని, అన్ని స్థానాల్లోనూ ఎన్నికలు నిర్వహించేలా ప్రయత్నిస్తున్నామన్నారు. వైసీపీ హయాంలో నిలిచిపోయిన అర్హులందరికీ అక్టోబర్ నెల నుంచి దశలవారీగా కొత్త పింఛన్లను మంజూరు చేస్తామని చెప్పారు. ప్రతి దరఖాస్తును పరిశీలించి లబ్ధిదారులకు న్యాయం చేస్తామన్నారు. ఎస్ఐఆర్ ఓటర్ల జాబితానే స్థానిక సంస్థల ఎన్నికలకు తుది జాబితాగా తీసుకోవాలని వైసీపీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే సమయానికి ఫోర్సులో ఉన్న, చెల్లుబాటయ్యే ఓటర్ల జాబితానే ఎన్నికలకు ప్రాతిపదికగా తీసుకోవచ్చని ప్రభుత్వం చెబుతోంది. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయి తుది ఓటర్ల జాబితా వచ్చే వరకు ఎన్నికలను ఆపాల్సిన అవసరం లేదని ప్రభుత్వ వైఖరిగా ఉంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే నాటికి అమల్లో ఉన్న ఓటర్ల జాబితాతోనే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది.

### రుయా ఆసుపత్రిలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో

# పారామెడికల్ విద్యార్థుల భారీ ర్యాలీ

**విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు ఎస్ఎఫ్ఐ సంపూర్ణ మద్దతు**

**పారామెడికల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే విద్యార్థి ఉద్యమాల్ని ఉదృతం చేస్తాం**

తిరుపతి: పారామెడికల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రుయా ఆసుపత్రిలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది.ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా అధ్యక్షురాలు పి. పవిత్ర ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగేళ్లలో పూర్తికావాల్సిన పారామెడికల్ కోర్సు అకాడమిక్ ఇయర్ ఆలస్యం కారణంగా 2021లో చేరిన విద్యార్థులకు 2026 వచ్చినా పూర్తికాని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పుడు మరో సంవత్సరం ఇంటర్న్‌షిప్ చేయాలని యాజమాన్యం చెప్పడం విద్యార్థులపై అదనపు భారమని అన్నారు.ఇదే సమయంలో కాలేజీ యాజమాన్యం మరో సంవత్సరం పాటు ఇంటర్న్‌షిప్ చేయాలని విద్యార్థులను ఆదేశించడం సరికాదని, విద్యార్థులు ఒక సంవత్సరం ఇంటర్న్‌షిప్ చేయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, ఆ కాలంలో వారు అందించే సేవలకు తగిన వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.12 గంటలు సేవలు.. కనీసం రూ.15,000 స్టైఫండ్ ఎందుకు ఇవ్వరు అంటూ పారా మెడికల్ స్టూడెంట్స్ ప్రశ్నించారు.రాష్ట్రంలోని అనేక జిల్లాల నుంచి విద్యార్థులు వచ్చి ఎస్వీ మెడికల్ కాలేజీలో పారామెడికల్ విద్యను అభ్యసిస్తున్నారు. వీరిలో చాలామంది ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, విద్యార్థులకు కనీసం ప్రభుత్వ హాస్టల్ సౌకర్యం కూడా అందుబాటులో లేకపోవడం తీవ్ర ఆందోళన కలిగించే అంశమని తెలియజేశారు.ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు దాదాపు 12 గంటల పాటు విద్యార్థులు ఆసుపత్రిలోని ల్యాబ్స్, ఎమర్జెన్సీ వార్డులు, ఇతర విభాగాల్లో రోగులకు సేవలు అందిస్తున్నారు. వైద్య వ్యవస్థలో కీలకమైన సేవలు అందిస్తున్న ఈ విద్యార్థులను కేవలం శిక్షణార్థులుగా చూసి వారి శ్రమకు ఎటువంటి పారితోషికం ఇవ్వకపోవడం దోపిడీతో సమానమని ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా అధ్యక్షురాలు పి. పవిత్ర అన్నారు."విద్యార్థులు ఒక సంవత్సరం ఇంటర్న్‌షిప్ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. కానీ 12 గంటల పాటు ఆసుపత్రిలో సేవలు అందిస్తున్న విద్యార్థులకు కనీసం నెలకు రూ.15,000 స్టైఫండ్ ఇవ్వాలి. ప్రభుత్వ హాస్టల్ సౌకర్యం కల్పించాలి. అకాడమిక్ ఇయర్ ఆలస్యంతో ఇప్పటికే సంవత్సరాల సమయం కోల్పోయిన విద్యార్థులపై మరో సంవత్సరం భారాన్ని మోపకుండా ప్రభుత్వం తక్షణమే జోక్యం సమస్య పరిష్కరించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శి రవీంద్ర నగర కమిటీ సభ్యులు భాస్కర్ మారుతి తదితరులు పాల్గొన్నారు

# మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

వికారాబాద్ : పరిగి..కుల్కచర్ల మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ చెప్పినవన్నీ అబద్ధాలే 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, 1,000 రోజులు అవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ఆరోపించారు.

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కుల్కచర్ల మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు.

100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి.. 1,000 రోజులు అవుతున్నా ప్రజలను నట్టేట ముంచారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన 420 మోసాలపై బీఆర్ఎస్ సమరశంఖం పూరిస్తోందని తెలిపారు.అబద్ధాలు, వంచనలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజాక్షేత్రంలో నిలదీయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

## నేడు..భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి ప్రతిపాధించిన స్థలాల పరిశీలన

ఖమ్మం సెప్టెంబర్ 06(ప్రజా కలం న్యూస్ )



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలాలపై కసరత్తు మొదలైంది. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి సోమవారం ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) వివిధ విభాగాల ఉన్నతాధికారులతో కూడిన బృందంతో కలిసి ఆయా ప్రాంతాలను పరిశీలించనున్నారు. గతంలో విమానాశ్రయం కోసం ప్రతిపాదించిన స్థలాల అనుకూలతపై ఉదయం 10 గంటల నుంచి పరిశీలన ప్రారంభమవుతుంది. అనంతరం మధ్యాహ్నం 1:30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జిల్లాలో పలు ప్రైవేట్ కార్యక్రమాల్లో ఎంపీ పాల్గొంటారు. ఈ మేరకు ఎంపీ క్యాంప్ కార్యాలయం నుంచి ఆదివారం సాయంత్రం ఓ ప్రకటన వెలువడింది.

# గుంపులు గుంపులుగా వీధి కుక్కలు

### బయటకు రావాలంటేనే చిన్నారులు, వృద్ధుల వణుకు!

### వాహనదారుల వెనుక కుక్కల వేట.. కమ్మర్‌పల్లి మండల ప్రజల ఆవేదన!



నిజామాబాద్, (ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబర్ 06: నిజామాబాద్ జిల్లా కమ్మర్ పల్లి మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ప్రధాన వీధులు, కాలనీలు, పాఠశాలల పరిసరాలు, గ్రామ శివార్లలో కుక్కలు గుంపులుగా సంచరిస్తుండటంతో స్థానికులు బయటకు రావడానికే జంకుతున్నారు.

ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాలలకు వెళ్లే పిల్లలు, వృద్ధులు, మహిళలు రాకపోకలు సాగించేటప్పుడు ఈ వీధి కుక్కలు వారిపైకి వస్తూ వెంటపడుతున్నాయని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారిని సైతం కుక్కలు వెంబడిస్తుండటంతో, వాహనదారులు అదుపుతప్పి కిందపడి ప్రమాదాల బారిన పడుతున్నట్లు పేర్కొంటున్నారు. రాత్రి వేళల్లో గుంపులుగా సంచారం..రాత్రి సమయాల్లో ఈ కుక్కలు గుంపులుగా తిరుగుతూ, విపరీతమైన అరుపులతో ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. స్థానిక హోటళ్లు, చికెన్, మటన్ దుకాణాల నిర్వాహకులు మాంసం వ్యర్థాలు, ఆహార పదార్థాల అవశేషాలను రోడ్ల వెంట పడేయడం వల్లనే కుక్కల సంఖ్య మరింత పెరుగుతోందని నిపుణులు, గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. వీటికి తోడు గ్రామాల్లో చెత్తను సక్రమంగా తరలించకపోవడం కూడా ఈ సమస్య తీవ్రరూపం దాల్చడానికి కారణమవుతోందని అంటున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన కరవు..ఈ వీధి కుక్కల సమస్యపై పలుమార్లు సంబంధిత గ్రామ పంచాయతీ, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి శాశ్వత పరిష్కారం లభించడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధి కారులు, సంబంధిత గ్రామపంచాయతీ పాలకవర్గాలు స్పందించి, వీధి కుక్కల నియంత్రణకు (జనన నియంత్రణ శస్త్రచికిత్సలు, రేబిస్ నివారణ టీకాలు) తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. చిన్నారులు, వృద్ధులకు ఎలాంటి ప్రమాదం జరగకముందే అధికారులు ఈ సమస్యపై తక్షణమే స్పందించాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కాంగ్రెస్ పాలనలో సంక్షేమానికి పెద్దపీట

### ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం: మండల కాంగ్రెస్ అధ్యక్షులు వాసం శ్రీకాంత్

ఆళ్లపల్లి, సెప్టెంబర్ 6 (ప్రజాకలం)

ఆళ్లపల్లి మండలం మర్కోడు గ్రామపంచాయతీలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలనకు వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా ఆదివారం కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి, ప్రభుత్వానికి అనుకూలంగా నినాదాలు చేశారు. పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న ఆదేశాల మేరకు కార్యక్రమం చేపట్టారు. సర్పంచ్ సుతారి రమాదేవి, ఉపసర్పంచ్ వగలబోయిన సతీష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఇసుముల



ఇందుకుమార్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి సులకతాటి శ్రీను ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ అధ్యక్షులు వాసం శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వాసం శ్రీకాంత్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. మహిళలు, యువతులు, ట్రాన్స్‌జెండర్లకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు 43 లక్షల కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు నెలకు సుమారు రూ.3 వేల వరకు ఆదా అవుతోందన్నారు.

53 లక్షలకుపైగా కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై విద్యుత్ బిల్లుల భారం తగ్గిందన్నారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి ఊరట కల్పించామని చెప్పారు. వరికి రూ.500 బోనస్‌తో పాటు ఉచిత విద్యుత్, రైతు బీమా, పంట నష్టపరిహారం అందిస్తూ రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు.

పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు తొలి విడతలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టామని, అర్హులైన కుటుంబాలకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల వరకు ఆర్థిక సాయం అందిస్తున్నామని శ్రీకాంత్ తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని, కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయడంతో పాటు సన్నబియ్యం పంపిణీ చేపట్టామని వివరించారు.

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, స్కిల్ యూనివర్సిటీ వంటి కార్యక్రమాలతో యువతకు మెరుగైన విద్య, నైపుణ్య అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే వరకు కాంగ్రెస్ ప్రభుత్వం విశ్రమించదని శ్రీకాంత్ స్పష్టం చేశారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీకి రానున్న ఎన్నికల్లో ప్రజలు మరోసారి మద్దతు ఇవ్వడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుతారి కృష్ణ, తాటికొండ వెంకటాచారి, అశోక్, ముసలయ్య, నమ్మయ్య, మలిపెద్ది రాము, భరత్, బొమ్మెర కృష్ణ, మహిళా నాయకులు కెక్కర్ల సునీత, షేక్ పర్వీన్‌తో పాటు వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# తొలి ఏడాదిలోనే 70వేల ఉద్యోగాల భర్తీ..

### పదేళ్ల నిరుద్యోగానికి కాంగ్రెస్ చరమగీతం!

### వెయ్యి రోజుల ప్రజా పాలనలో సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం

### బాల్కొండ కాంగ్రెస్ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి వెల్లడి



నిజామాబాద్, సెప్టెంబర్ 06: (ప్రజా కలం ప్రతినిధి)

ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో యువత సంక్షేమం, ఉపాధి, నైపుణ్యాభివృద్ధికి అనేక చర్యలు చేపట్టిందని డీసీసీ అధ్యక్షుడు నగేష్‌రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ అన్నారు. పదేళ్ల నిరుద్యోగాన్ని తరిమికొడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే 70 వేలకుపైగా ఉద్యోగాలను భర్తీ చేసిందని తెలిపారు.

భీంగల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సహస్ర ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సభలో నాయకులు మాట్లాడారు. సంక్షేమం, అభివృద్ధి మంత్రంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. యువతకు ఉద్యోగాలు, స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, విద్య, క్రీడలు, పారిశ్రామిక అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టిందన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను యువతకు అందించి, చదువు--నైపుణ్యం--ఉద్యోగం దిశగా అవకాశాలు కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో భాగంగా 2024 డీఎస్సీ ద్వారా 11,062 ఉపాధ్యాయ పోస్టుల నియామక ప్రక్రియ చేపట్టిందని తెలిపారు. అలాగే టీజీపీఎస్సీ ప్రక్షాళన చేసి గ్రూప్--1, గ్రూప్--2, గ్రూప్--3 వంటి నియామక పరీక్షలను మరింత పారదర్శకంగా నిర్వహించే చర్యలు చేపట్టిందన్నారు. ఐటీ, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, పరిశ్రమలు వంటి అధిక డిమాండ్ ఉన్న రంగాల్లో నైపుణ్య శిక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేయడంతో యువతకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఉద్యోగ మేళాల ద్వారా యువతను ప్రైవేట్ కంపెనీలతో అనుసంధానం చేస్తున్నామని తెలిపారు.

క్రీడల్లో ప్రతిభ ఉన్న యువతకు శిక్షణ, విద్య, కెరీర్ అవకాశాలను మెరుగుపరిచేందుకు యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీతో పాటు క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. యూత్ లీడర్‌షిప్ సమ్మిట్, కెరీర్ అండ్ స్కిల్ డే, స్పోర్ట్స్ డే వంటి కార్యక్రమాలతో యువతలో నాయకత్వ లక్షణాలు, కెరీర్ అవగాహన పెంపొందిస్తున్నామని చెప్పారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగ యువతను ఉద్యోగార్థులుగా కాకుండా ఉద్యమకర్తలుగా, ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదిగేలా ప్రోత్సహిస్తున్నామని నాయకులు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల యువతకు స్వయం ఉపాధి కోసం ఆర్థిక సహాయం, సబ్సిడీతో రుణాలు అందించే విధానం అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

యువతే తెలంగాణ భవిష్యత్తు అని పేర్కొన్న నాయకులు.. విద్య, నైపుణ్యం, ఉద్యోగం, స్వయం ఉపాధి, క్రీడలు, నాయకత్వ అభివృద్ధి వంటి ప్రతి రంగంలో అవకాశాలు కల్పిస్తూ యువ తెలంగాణ నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. "యువతకు ఉద్యోగం మాత్రమే కాదు.. ఉద్యోగం ఇచ్చే స్థాయికి ఎదిగే అవకాశాలను కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం" అని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## సహజ రత్నాల ఆభరణాలకు సరికొత్త రూపాన్ని అందిస్తూ 'నైరా' కలెక్షన్ ను విడుదల చేసిన మలబార్ గోల్డ్ & డైమండ్స్.



ఖమ్మం సెప్టెంబర్ 06( ప్రజా కలం న్యూస్ )

ఖమ్మం నగరంలోని ఆదివారం మలబార్ గోల్డ్ & డైమండ్స్ షో రూమ్ నందు నైరా పేరిట తమ కొత్త సహజ రత్నాల ఆభరణాల కలెక్షన్ ను విడుదల చేసింది . దీనిలో భాగంగా వినియోగదారులు రత్నాలు, అన్ కట్ ఆభరణాల తరుగు ఛార్జీలపై 25% వరకు తగ్గింపును పొందవచ్చు . ఈ ఆఫర్ 14 సెప్టెంబర్ 2026 వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు . ప్రకృతి ప్రసాదించిన అరుదైన సంపదల శాశ్వత సౌందర్యం నుంచి స్ఫూర్తి పొందిన 'నైరా', సంప్రదాయ చిహ్నం, వచ్చి ఆభరణాల తయారీ కళలోని నైపుణ్యాన్ని ఆధునిక రూపంలో ఆవిష్కరించింది .

బంగారంతో రూపొందించి , విలువైన సహజ రత్నాలతో పొదిగిన ఈ కలెక్షన్ , శిల్ప రూపాలను, క్లిష్టమైన అంశాలను ఒకటిగా చేర్చి సాంప్రదాయ రత్నాల ఆభరణాలకు ఒక సరికొత్త రూపాన్ని అందిస్తుంది . కొత్త తరం వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా రూపుదిద్దుకున్న 'నైరా', సహజ రత్నాలతో రూపొందించిన ఆభరణాలను సరికొత్త డిజైన్ శైలిలో పరిచయం చేస్తోంది . ఈ కలెక్షన్‌లోని అద్భుతమైన పనితనం , రత్నాల ప్రత్యేకత , విలక్షణమైన సౌందర్యాన్ని ప్రధానంగా ఆవిష్కరించింది . సాంప్రదాయ ఆభరణాల తయారీ నైపు నైపుణ్యాన్ని, అభివృద్ధి చెందుతున్న డిజైన్ అభిరుచులను , వినియోగదారుల ప్రాధాన్యతలను మేళవించడంపై మలబార్ గోల్డ్ & డైమండ్స్ యొక్క దృష్టిని ఈ కలెక్షన్ ప్రతిబింబిస్తుందని అన్నారు . కొత్తగా విడుదల చేసిన నైరా కలెక్షన్‌తో పాటు , జెమ్ స్టోన్ జ్యువెలరీ ఫెస్టివల్ కోసం మలబార్ గోల్డ్ & డైమండ్స్ వారిచే ప్రత్యేకంగా ఎంపిక చేయబడిన రత్నాలు మరియు "అన్ కట్ ఆభరణాల శ్రేణి ద్వారా సహజ రత్నాలను ప్రదర్శిస్తుంది . దీనికి తోడు ఈ ఫెస్టివల్లో వినియోగదారులకు అనుకూలమైన కొనుగోలు అనుభవాలను కల్పిస్తూ సహజ రత్నాల ఆభరణాల ప్రపంచాన్ని మరింతగా తెలుసుకునే పరిశీలించే అవకాశాన్ని కల్పిస్తోంది కావున వినియోగదారులు కస్టమర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్టోర్ హెడ్ ఎం విష్ణు , స్టోర్ మేనేజర్ కిషన్ రావు , అసిస్టెంట్ సేల్స్ మేనేజర్ విష్ణు , విజయ్ , మార్కెటింగ్ ఇంచార్జ్ రుద్ర రామ కృష్ణ లు కోరారు . ఈ కార్యక్రమంలో సౌజన్య , ప్రసన్న తదితరులు పాల్గొన్నారు .

## పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి సెప్టెంబర్ 06:

సెప్టెంబర్ 5, 6, 12, 13వ తేదీల్లో నిర్వహిస్తున్న ఎస్.ఐ.ఆర్ ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో భాగంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదివారం దేవరకద్ర నియోజకవర్గంలో అడ్డాకల్ మండలం శాఖాపూర్, మూసాపేట మండలం జానంపేట, భూత్పూర్ మండలం పోతుగుట్ట తండాలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి తనిఖీ చేశారు. అడ్డాకల్ మండలం శాఖాపూర్ గ్రామంలోని పోలింగ్ కేంద్రాలు 103, 104లను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్, అక్కడ చేపట్టిన ఏర్పాట్లతో పాటు కొనసాగుతున్న ఎన్నికల సంబంధిత కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిస్థాయిలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మూసాపేట మండలం జానంపేట గ్రామంలోని పోలింగ్ కేంద్రాలు 81, 82, 83, 84లను పరిశీలించారు. ఓటర్ల జాబితాకు సంబంధించిన పనులను నిబంధనల ప్రకారం సక్రమంగా నిర్వహించాలని, అర్హులైన ప్రతి ఓటరుకు అవసరమైన సేవలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. భూత్పూర్ మండలం పోతుగుట్ట తండాలోని పోలింగ్ కేంద్రం 24ను కూడా అదనపు కలెక్టర్ తనిఖీ చేసి, ఎన్నికల సంబంధిత పనుల పురోగతిని సమీక్షించారు. ఓటర్ల జాబితా పనుల్లో ఎలాంటి లోపాలకు తావులేకుండా నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ తనిఖీల్లో సంబంధిత మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు/డిఈఆర్ఓలు, ఆర్ఐలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లు, జీపీఓలు, పీఎస్‌లు, సర్పంచ్‌లు, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.



## కుక్క కాటుకు రేబిస్ సోకి వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ సెప్టెంబర్ 06 ప్రజా కలం( ప్రతినిధి) : నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలంలోని వట్టిపల్లి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. కుక్క కాటుకు గురైన వ్యక్తి రేబిస్ సోకడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు.



వట్టిపల్లి గ్రామానికి చెందిన జలాల శ్రీనివాస్ యాదవ్ (40)ను గత నెలలో కుక్క కరవడంతో ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో రేబిస్ సోకినట్లు తెలిసి ఆ వ్యక్తిని హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

చికిత్స పొందుతున్నప్పటికీ ఆరోగ్య పరిస్థితి మరింత విషమించడంతో ఆదివారం తెల్లవారుజామున శ్రీనివాస్ మృతి చెందాడు.

మృతుడు శ్రీనివాస్‌కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారని కుటుంబ పెద్దను కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. శ్రీనివాస్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



# మనిషి సృష్టించిన నిశ్శబ్ద శత్రువు ప్లాస్టిక్

మనిషికి తన అవసరం ఉందని వచ్చి సొంత ఇంటి వాడిగా మారి సౌకర్యం పేరుతో ప్రతి ఇంటికి వచ్చి సొంతవాడిలా మారింది ప్లాస్టిక్. అవసరానికి ఉపయోగించుకొని (వాడి) విసిరేసిన తక్షణమే ధరణిపై పడగానే భూమికి ప్లాస్టిక్ భూతమై పట్టింది. మనిషి తన అవసరానికి ఒకసారి వాడి పాడేసిన ప్లాస్టిక్ ముక్కలై వందేళ్ళ కథగా మిగిలిపోయింది. ప్లాస్టిక్ తనకంటూ భూమి గుండెలపై ఒక చెరగని మచ్చలా నిలిచిపోయింది. తేలికైన పోత పోసిన పలుచని కాగిత మైన ప్లాస్టిక్ నదుల ప్రవాహం సైతం అపుతు. చెరువుల నీటిని కలుషితం చేస్తూ సముద్రపు ఒడిలో చేరి జల చర జీవుల ఊపి తీస్తున్నావు. ఆహారమని మూగ జీవులు ప్లాస్టిక్ ను మింగితే మూగ జీవుల నిస్సహాయ స్థితిలో మనిషి చేస్తున్న నిర్లక్ష్యం కన్నులకు కట్టినట్టుగా స్పష్టంగా కనిపిస్తుంది. పంట పోలాల ఒడిలో ఒక గుంపుగా పేరుకుని భూ మాతను బాధిస్తున్నావు. ఎన్ని సంవత్సరాలైనా నెలలో కలువవు, ఎన్నేళ్ల అయిన నీటిలో కరుగవు, తరతరాలకు నీ విషపు




గుర్తులు మిగులుస్తవు. నిన్ను కాల్చేతే గాలి ఏడుస్తుంది. నిన్ను భూమిలో పాతి పెట్టితే నెల విలవిలాడుతుంది. నిన్ను వదిలేస్తే నీరు విష మౌతుంది. నీవు ఎక్కడ ఉన్న ప్రకృతే మూల్యం చెల్లిస్తుంది.

ఒక్క సరి వాడే ప్లాస్టిక్ కు శాశ్వతంగా వీడుకోలు చెప్పుదాము.
మన చిన్న మార్పే ప్రకృతి కి పెద్ద ఊపిరి అవుతుంది.
రేపటి తరానికి ఆస్తులు, అంతస్తులు, ఖనిజ సంపద మాత్రమే కాదు.
స్వచమేన గాలిని
నిర్మలమైన నీటిని
పచ్చని ప్రకృతిని
వారసత్వంగా అందిదము.

మనుషులు ఏకమై ప్లాస్టిక్ పై యుద్ధం ప్రకటించి ప్రజా ఆరోగ్యానికి సిద్ధం కావాలి. ప్లాస్టిక్ వాడకాన్ని నివారించి పర్యావరణం పరిరక్షించడంలో ప్రతి ఒక్కరు తమ వంతు పాత్రను నిర్వహించినప్పుడు భావితరాలకు మంచి భవిష్యత్తు వాతావరణం అని అందించగలుగుతాం మెరుగుపరుద్దాం జీవన మార్గాన్ని.

ప్రతి ఇంటిలో ప్లాస్టిక్ మానేయాలని చైతన్యం వెలిగి, భూమి పై జీవిస్తున్న ప్రతి మనిషి మనసులో ప్రకృతి పై ప్రేమ అనురాగాలు మొలిపిస్తే ప్లాస్టిక్ భూతం పారిపోతుంది. అప్పుడు పచ్చని భూమి మళ్ళీ నవ్వుతుంది.

**తుమ్మల మహేష్ కుమార్ : జర్నలిస్ట్, శెట్ పల్లీ.**

# హుస్సేన్‌సాగర్ తీరంలో గంగ తెప్ప మహోత్సవం

## తొర్తి గంగపుత్రుల ప్రత్యేక పూజలు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి)సెప్టెంబర్ 06:

ట్యాంక్‌బండ్‌లోని హుస్సేన్‌సాగర్ తీరంలో గంగ తెప్ప మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఉత్సవంలో తొర్తి గంగపుత్ర సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని, గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు సంఘం అధ్యక్షుడు తొపారం రాజేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. గంగపుత్రుల సంప్రదాయాలు, సంస్కృతి, మరియు ఐక్యతను చాటేలా ఈ మహోత్సవాన్ని నిర్వహించామన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గంగపుత్ర సంఘాల సభ్యులతో హుస్సేన్‌సాగర్ తీరం ఆధ్యాత్మిక శోభతో విలసిల్లింది. ఈ సందర్భంగా ఉత్సవ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న తొర్తి గంగపుత్ర సంఘం సభ్యులను నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. గంగపుత్రుల పూర్వీకుల సంప్రదాయాలను కాపాడుతూ, భవిష్యత్ తరాలకు అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం ఎంతో అభినందనీయమని సంఘ సభ్యుడు తొపారం రాజేష్ పేర్కొన్నారు.



# మాతృభాషా సేవే శ్వాసగా.. రీసెర్చ్ స్కాలర్ భరద్వాజకు అపురూప సన్మానం



నిజామాబాద్, సెప్టెంబర్ 06 (ప్రజా కలం ప్రతినిధి) :

వేల్పూరు మండలంలోని కుకునూరు ఉన్నత పాఠశాల తెలుగు భాషోపాధ్యాయుడు డాక్టర్ పతాని గంగాధర్ ఆదివారం నిజామాబాద్ జిల్లాలో తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేస్తున్న ఎడపల్లి మండలం అంబం యుపిఎస్ లో తెలుగు భాషోపాధ్యా యుడిగా మరియు రీసెర్చ్ స్కాలర్ బొడ్డు భరద్వాజ గారిని కలసి, తెలుగు భాషలో వెనుకబడిన విద్యార్థులకు సులభంగా విద్యాబోధన చేయుట కొరకై వారు తయారు చేసిన టిఎల్ఎం ( టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ )ను పరిశీలించి, అభినందించి, వారిని ఘనంగా సత్కరించడం జరిగింది. వారు వర్ణమాల,గుణింతాలు, ఒత్తుల చార్టులు, ఫ్లాష్ కార్డులు, అక్షరాల గుర్తింపు కొరకై బొమ్మలతో కూడిన చార్టులు, ఉపాధ్యాయులు తరగతి గదిలో సులువుగా విద్యాశాఖ సూచనల మేరకు బోధన చేయుట కొరకై వార్షిక మరియు పీరియడ్ ప్లాన్లు అందంగా, ఆకర్షణీయమైన రంగులతో నాణ్యమైనవిగా, ఎక్కువ కాలం మన్నిక ఉండే విధంగా తయారు చేయడం జరిగింది. ఇవే కాకుండా తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తూ,ఎన్నో విశ్వవిద్యాలయాలలో, జాతీయ, అంతర్జాతీయ జర్నల్ లలో పరిశోధనా పత్రాలు సమర్పించి, వారి మన్ననలను పొంది, తెలుగు భాషాభివృద్ధికి పాటుపడడం జరుగుతున్నది. ఇప్పటివరకు 40 పరిశోధన పత్రాలు జాతీయ అంతర్జాతీయ సదస్సులలో సబ్మిట్ చేశారు. వీటిలో భావవీణ, మూసీ, సాహిత్య తరంగిణి, జిటిరో అనే పేరుగల రిఫర్డ్ జర్నల్ మరియు ఫ్రీ రివ్యూ జర్నల్ లో పబ్లిష్ అయినవి. ఇంకా కొన్ని పరిశోధన వ్యాసాలు పుస్తక రూపంలో వచ్చినవి. ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించిన జాతీయ సదస్సుకు పద సాహిత్యం నిజామాబాద్ జిల్లా తత్వ గీతాలు, మద్రాస్ విశ్వవిద్యాలయం నిర్వహించిన జాతీయ సదస్సుకు మాస్టర్ శార్వరి బహుముఖ ప్రజ్ఞ సాహిత్యం యోగ సాధన, ద్రావిడ విశ్వవిద్యాలయం నిర్వహించిన జాతీయ సదస్సుకు తెలంగాణ గ్రామదేవతల ఆరాధన గురించి పరిశోధన పత్రం సమర్పిం చారు. యోగాలో ఇప్పటి వరకు ఎవరు చెప్పని రహస్యాలతో "యోగ మౌనానంద శతకం" రాశారు. తమ పాఠశాలలోని విద్యార్థులచే అంబం అక్షరాలు అనే కథా పుస్తకాలను రాయించి ప్రచురింప చేయడం జరిగింది. పిల్లలు వ్రాసిన కథలు బాల చెలిమి, మొలక మ్యాగజైన్ లలో అచ్చుయినాయి. విద్యార్థులలో నిగూఢమైన కళలను వెలికితీయడానికి డ్రాయింగ్ లిప్పన్ ఆర్ట్ లో శిక్షణ చిత్రలేఖనంలో సైతం లిప్పన్ ఆర్ట్, రెసిన్ ఆర్ట్స్ లలో విద్యార్థులకు శిక్షణ ఇస్తూ తీర్చిదిద్దుతున్నారు. పరీక్ష పే చర్చ కార్యక్రమం లో 12 మంది అంబం పాఠశాల విద్యార్థులు, పాల్గొన్నందుకు ప్రశంసా పత్రం ప్రధాని నరేంద్ర మోడీ నుండి అందుకున్నారు. ఎందరెందరో భాషోపాధ్యాయులకు మార్గదర్శకుడుగా మన నిజామాబాద్ జిల్లాలో నిలవడం గర్వించదగిన విషయం.






# 24 గంటల్లోనే సుఖాంతం!

- సీసీ కెమెరాల నిఘాతో
- కిడ్నాపర్ల ఆటకట్టించిన పోలీసులు.. దౌల్తాబాద్‌లో బాలుడి రక్షణ.. ఇద్దరి అరెస్ట్
- కాపాడిన కెమెరా కన్ను.. గంటల్లోనే బాలుడు సేఫ్!
- రెప్పపాటులో కిడ్నాప్.. 24 గంటల్లోనే చెర విముక్తి!
- పోలీసుల 'సాంకేతిక' వ్యూహం.. కిడ్నాపర్ల గుట్టురట్టు!
- అమ్మానాన్నల చెంతకు 'కన్నప్రేమ'.. దౌల్తాబాద్‌లో బాలుడి ఆచూకీ




నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబర్ 06:

నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని మాతా శిశు సంరక్షణ కేంద్రం నుంచి అపహరణకు గురైన రెండున్నరేళ్ల బాలుడు వేదాంష్‌ను పోలీసులు కేవలం 24 గంటల్లోనే సురక్షితంగా రక్షించారు. బాలుడి అపహరణ కేసును ఛేదించి,ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. శనివారం ఉదయం సుమారు 10.30 గంటల సమయంలో ఆసుపత్రిలో ఉన్న రెండున్నరేళ్ల బాలుడు వేదాంష్‌ను ఇద్దరు వ్యక్తులు మాయమాటలు చెప్పి అపహరించినట్లు తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సీపీ పి.సాయి చైతన్య,ఐపీఎస్ ఆదేశాలు, పర్యవేక్షణలో బాలుడి ఆచూకీ కోసం ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. వన్‌టౌన్ పోలీసులు, సీసీఎస్ క్రైమ్, టెక్నాలజీ బృందాలు సమన్వయంతో గాలింపు చర్యలు చేపట్టాయి. పోలీసు బృందాలు వివిధ ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించడంతో పాటు సాంకేతిక ఆధారాలను విశ్లేషిస్తూ అనుమానితుల కదలికలను గుర్తించాయి. రాత్రింబవళ్లు నిరంతరంగా గాలింపు,దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో సంగారెడ్డి జిల్లా దౌల్తాబాద్ గ్రామంలో బాలుడు వేదాంష్ ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అక్కడికి చేరుకుని బాలుడిని సురక్షితంగా రక్షించారు.

**ఇద్దరు నిందితుల అరెస్ట్**

ఈ కేసులో నిందితులుగా గుర్తించిన ఏ1 కోతాడి సుజాత (30), మెదక్ జిల్లా నిజాంపేట్ గ్రామం, ప్రస్తుతం మేడ్చల్‌లో నివాసం, ఏ2 కోతాడి ఎల్లం (38), మెదక్ జిల్లా నిజాంపేట్ గ్రామం, ప్రస్తుతం మేడ్చల్‌లో నివాసం అనే ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రక్షించిన బాలుడు వేదాంష్‌కు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, చట్టపరమైన ప్రక్రియలు పూర్తిచేసిన అనంతరం ఆదివారం అతడిని తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించారు.

పోలీసులకు సీపీ అభినందనలు కేవలం 24 గంటల్లోనే కేసును ఛేదించి బాలుడిని సురక్షితంగా రక్షించడంలో వన్‌టౌన్,సీసీఎస్ క్రైమ్,సివిల్, టెక్నాలజీ బృందాలు సమన్వయంతో చేసిన కృషి,అలాగే సంగారెడ్డి జిల్లా పోలీసుల సహకారం కీలకంగా నిలిచిందని పోలీసులు తెలిపారు. బాలుడిని సురక్షితంగా రక్షించి తల్లిదండ్రులకు అప్పగించేందుకు కృషి చేసిన అధికారులు, పోలీసు సిబ్బందిని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సీపీ పి.సాయి చైతన్య,ఐపీఎస్ అభినందించారు.



# మేడిపల్లి మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటి ఎన్నిక

## ముఖ్య అథితిగా హాజరైన జిల్లా మాజీ అధ్యక్షులు పంగ ప్రణయ్ మాదిగ

మేడ్చల్/మేడిపల్లి సెప్టెంబర్ 6(ప్రజాకలం న్యూస్)

పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జరుగుతున్న సంస్థాగత నిర్మాణాల్లో భాగంగా మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా మేడిపల్లి మండలం ఎమ్మార్పీస్ నూతన మండల కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి మండల మాజీ అధ్యక్షుడు బండారి సాయి మాదిగ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా జిల్లా మాజీ అధ్యక్షులు పంగ ప్రణయ్ కుమార్ మాదిగ,జిల్లా కో ఇంచార్జ్ యాదగిరి మాదిగ జిల్లా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని బలోపేతం చేసి రానున్న రోజుల్లో ప్రజా సమస్యలమీద సాంఘిక,ఆర్థిక, సామాజిక అసమానతలు లేకుండా పూలే,అంబేద్కర్, జగ్జీవన్ రాం, కాన్షిరాంల ఆశయాల సాధనకై సమసమాజ స్థాపనకై నూతన నాయకులుగా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మేడిపల్లి మండల కేంద్రంగా పని చెయ్యాలని సమిష్టిగా ప్రతిఒక్కరు కృషిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నూతన మండల అధ్యక్షుడిగా కాటపాక అభిషేక్ మాదిగ,అధికార ప్రతినిధిగా ప్రేమ్ మాదిగ,ప్రధాన కార్యదర్శిగా శివ, శ్రీకాంత్ సిహెచ్, ఉపాధ్యక్షులుగా ఉపేందర్, రాహుల్,విక్రమ్ కార్యదర్శులుగా విజయ్,రేవంత్ సలహాదారులుగా వెంకటేష్ యాసారం కార్యవర్గ సభ్యులని ఎన్నుకున్నారు.



# బీజేపీ జాతీయ నాయకులను కలిసిన డా. కడవెండి వేణుగోపాల్.

ఖమ్మం సెప్టెంబర్ 06(ప్రజా కలం న్యూస్ )

ఖమ్మం ఎకో – క్లబ్ ఎన్విరాన్‌మెంటల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు డా. కడవెండి వేణుగోపాల్ నేడు న్యూఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో పలువురు బీజేపీ జాతీయ , రాష్ట్ర స్థాయి నాయకులను వ్యక్తిగతంగా కలిసి పర్యావరణ పరిరక్షణ , ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణపై చర్చించారు . ఈ సందర్భంగా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీ బి.ఎల్. సంతోష్ , బీజేపీ కేంద్ర కార్యాలయ కార్యదర్శి శ్రీ మహేంద్ర కుమార్ పాండే , ఢిల్లీ బీజేపీ అధ్యక్షులు శ్రీ హర్ష్ మల్హోత్రాలను డా. కడవెండి వేణుగోపాల్ కలిసి తన "ప్లాస్టిక్ ఫ్రీ భారత్'' ప్రచార కార్యక్రమానికి సంబంధించిన ప్రాతినిధ్య పత్రాన్ని అందజేశారు . భారతదేశంలో పెరుగుతున్న ప్లాస్టిక్ కాలుష్యం పర్యావరణంతో పాటు ప్రజారోగ్యం , జల వనరులు , మట్టి నాణ్యత , జీవవైవిధ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని డా. వేణుగోపాల్ ఈ సందర్భంగా వివరించారు . ముఖ్యంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నియంత్రించి , కఠినంగా నిషేధించాల్సిన అవసరం ఉందని ఆయన నాయకుల దృష్టికి తీసుకువచ్చారు . ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పర్యావరణహిత పదార్థాల వినియోగాన్ని ప్రోత్సహించడం , ప్రజల్లో అవగాహన పెంచడం , విద్యార్థులు--యువతను పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం , స్థానిక సంస్థల ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణను మరింత బలోపేతం చేయడం వంటి చర్యలను దేశవ్యాప్తంగా విస్తృతంగా చేపట్టాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు . "ప్లాస్టిక్ రహిత భారత్ కేవలం ప్రభుత్వ చర్యలతో సాధ్యం కాదు. ప్రజల భాగస్వామ్యం , యువత చైతన్యం , రాజకీయ నాయకత్వం మరియు స్వచ్ఛంద సంస్థల సమన్వయంతోనే ఈ లక్ష్యాన్ని సాధించగలం" అని డా. కడవెండి వేణుగోపాల్ అన్నారు . పర్యావరణ పరిరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చేందుకు తన సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలకు మరింత విస్తృత మద్దతు లభించాలని ఆయన ఆకాంక్షించారు .




# పాలేరు ప్రాంత చెరువులు నింపాలి

## రైతుల పట్ల వివక్ష తగదు
## బీజేపీ జిల్లా నాయకుడు గుండా ఉపేందర్ రెడ్డి.

పాలేరు సెప్టెంబర్ 06(ప్రజా కలం న్యూస్ )

పాలేరు రిజర్వాయర్ తలాపున ఉన్న కూసుమంచి, తిరుమలయపాలెం మండలాల రైతులకు సాగు, తాగునీటి ఇబ్బందులు లేకుండా అన్ని చెరువులను భక్త రామదాసు ఎత్తిపోతల పథకం ద్వారా వెంటనే నింపాలని బీజేపీ జిల్లా నాయకుడు గుండా ఉపేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. భక్త రామదాసు ఎత్తిపోతల ఆయకట్టు పరిధిలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొన్నప్పటికీ ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. చెరువులు, బావుల్లో నీరు లేక రైతులు, పశువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్థానిక మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తక్షణమే స్పందించి కూసుమంచి, తిరుమలయపాలెం మండలాల పరిధిలోని అన్ని చెరువులను నింపాలని కోరారు. రైతుల సమస్యను పరిష్కరించకపోతే వారి తరఫున ఉద్యమం చేపడతామని గుండా ఉపేందర్ రెడ్డి హెచ్చరించారు.





## ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవంలో మైనంపల్లి హనుమంతరావు

మల్కాజిగిరి సెప్టెంబర్ 06(ప్రజా కలం ప్రతినిధి)

మల్కాజిగిరి శ్రీ ఆత్మలింగ మహాగణపతి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితుడిగా మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ అభివృద్ధి,భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దేశం యాదగిరి గౌడ్, గుజ్జుక వెంకటేష్,బోడికే మనోహర్,ఎస్ వి కృష్ణారెడ్డి,గోపాల్, శ్రీనివాస్,ఎన్ వి రమణ, స్థానిక నాయకులు వెంకటేష్ గౌడ్,బి కే శ్రీనివాస్,జీడి సంపత్ గౌడ్,గుండా నిరంజన్,జి ఎన్ వి సతీష్ కుమార్, కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి, వినోద్ యాదవ్,సంతోష్ రామ్ దాస్, పార్థసారధి,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎలాంటి సమస్యలు ఉన్న పరిష్కారానికి ముందుంటా

### - మైనంపల్లి హనుమంతరావు

మల్కాజిగిరి సెప్టెంబర్ 06(ప్రజా కలం ప్రతినిధి)

ఎలాంటి సమస్యలు ఉన్న పరిష్కారానికి ముందుంటా, నా ఎన్నికల కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తను కాపాడుకుంటానని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తెలిపారు. మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు జిడి సంపత్ గౌడ్ అధ్యక్షతన జరిగిన



ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలోకి పలువురు నాయకులు చేరారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మైనంపల్లి పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ కండువాలను కప్పి పార్టీలకు ఆహ్వానించారు అనంతరం వారు మాట్లాడుతూ మల్కాజిగిరి ప్రాంతంలో ప్రజలకు నాయకులకు ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించేందుకు ముందు ఉంటానని గతంలో నేను ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు 5 సంవత్సరాలలో 2 సంవత్సరాలు కరోనాతో వెళ్లిపోయిందని మూడు సంవత్సరాలలో నియోజకవర్గంలో ఏ సమస్య ఉన్న ముందుండి పరిష్కరించానని, ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న ఆర్ యు బి ,మౌలాలి కమాన్ సమస్యలకు పరిష్కారం చూపామని అప్పుడు కష్టపడ్డ కార్యకర్తను ఇప్పుడు ఎన్నికలలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తను కాపాడుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కే రాములు,ఎన్ లక్ష్మరాజు, పి గంగారం,పి మలకయ్య,వి శ్రీనివాస్,కె వెంకటేష్,టీ శంకర్,కె శ్రీనివాస్,బి యాదగిరి, మహంకాళి,బి సాయికుమార్,పి రాజేష్, పి సాయి,కే వేణు తో పాటు ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్,బి బ్లాక్ అద్యక్షుడు వెంకటేష్ యాదవ్,బీకే శ్రీనివాస్, ఏ కె మురుగేష్,గుండా నిరంజన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జీడి చరణ్జిత్ గౌడ్,సత్యమూర్తి,బాబు సత్యనారాయణ,వినోద్ యాదవ్,రాందాస్ సంతోష్ ముదిరాజ్,ఆశా, రామక్రిష్ణ రాము, తదితరులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ 1000 రోజుల పాలనకు నిరసనగా ఆటోల ర్యాలీ

మల్కాజిగిరి,సెప్టెంబర్ 6(ప్రజా కలం ప్రతినిధి)

కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల ప్రజా వ్యతిరేక పాలనకు నిరసనగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మల్కాజిగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం భారీ ఆటోల ర్యాలీ నిర్వహించారు. వాజ్‌పేయి నగర్ రైల్వే గేట్ నుంచి ఓల్డ్ నేరేడ్‌మెట్, వినాయక్‌నగర్, సఫీల్‌గూడ,ఈస్ట్ ఆనంద్‌బాగ్ మీదుగా మల్కాజ్‌గిరి చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మల్కాజ్‌గిరి ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీరు,వీధి దీపాలు, శాంతిభద్రతలు,ట్రాఫిక్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు బస్తీ దవాఖానలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు,మాజీ కార్పొరేటర్లు, కార్యకర్తలు,మహిళలు, యువకులు,ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.




# బాసరలో రూ.354 కోట్లతో శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయ సమగ్ర అభివృద్ధికి శ్రీకారం

### - రూ.20 కోట్లతో పుష్కర ఘాట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### - గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తాం: మంత్రి జూపల్లి కృష్ణారావు

నిర్మల్ ,
సెప్టెంబర్ 06(ప్రజా కలం జిల్లా ప్రతినిధి):

తెలంగాణ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా వచ్చే ఏడాది జూన్ 27 నుంచి నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో విస్తృత ఏర్పాట్లు చేపడుతోందని రాష్ట్ర మద్యం, ఆబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. పుష్కరాలకు ఏడాది ముందుగానే మౌలిక వసతులు, పుష్కర ఘాట్లు, ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఆదివారం బాసరలో పర్యటించిన మంత్రి జూపల్లి కృష్ణారావు రూ. 20 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పుష్కర ఘాట్ల నిర్మాణం, విస్తరణ, మరమ్మతులు, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గోదావరి నదీమాతకు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రూ. 354 కోట్లతో చేపట్టనున్న ఆలయ సమగ్ర అభివృద్ధి, నూతన నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణాన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయడంతో పాటు భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. భవిష్యత్‌లో పెరగనున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన మౌలిక వసతులను ముందుగానే ఏర్పాటు చేయాలని సూచించారు. గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. భారీ సంఖ్యలో



భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున భక్తుల సౌకర్యం, భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పుష్కర ఘాట్లను అవసరమైన మేరకు విస్తరించడంతో పాటు, కొత్త ఘాట్ల నిర్మాణం, మరమ్మతులు చేపట్టాలని అన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అదనపు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మహిళల కోసం ప్రత్యేక డ్రెస్సింగ్ రూములు, మరుగుదొడ్లు, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రధాన పుష్కర ప్రాంతాల్లో 24 గంటల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, అవసరమైన వైద్యులు, అత్యవసర మందులు, అంబులెన్స్‌లను ముందుగానే సిద్ధంగా ఉంచాలని మంత్రి సూచించారు.

భక్తుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీసు, రెవెన్యూ, దేవాదాయ, వైద్య, మున్సిపల్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అన్నారు. పుష్కర ప్రాంతాల్లో నిరంతర పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలని, భక్తులకు నిరంతరం స్వచ్ఛమైన తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

ఆలయ ఈవో కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గోదావరి పుష్కరాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏడాది ముందుగానే పనులు ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పుష్కరాల కోసం దాదాపు రూ. 1,000 కోట్లతో వివిధ అభివృద్ధి, మౌలిక వసతుల పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. పుష్కరాల ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రజాభవన్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తామని చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి జాప్యం లేకుండా పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. బాసరతో పాటు గోదావరి నదీ తీర జిల్లాల్లోని మొత్తం 12 ప్రాంతాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. పుణ్యస్నానాల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఘాట్ల అభివృద్ధితో పాటు భద్రతా చర్యలను పటిష్ఠం చేయనున్నట్లు చెప్పారు. పుష్కరాల కోసం చేపడుతున్న అన్ని అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. పనుల నాణ్యత, పురోగతిని నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక ఐఏఎస్ అధికారిని నియమించినట్లు వెల్లడించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. పుష్కరాల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా బాసర గోదావరి పుష్కరాల ఏర్పాట్లు, పుష్కర ఘాట్ల అభివృద్ధి, శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ సమగ్ర అభివృద్ధికి సంబంధించిన మ్యాపులు, ప్రతిపాదనలు, పనుల పురోగతిని మంత్రి జూపల్లి కృష్ణారావుకు వివరించారు. నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేసి, పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఏఎస్పీ సాయి కిరణ్, ఆలయ ఈవో అంజనా దేవి, తహసీల్దార్ పవన్ చంద్ర, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## మన్నెకుల సంఘం సమావేశం

### ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపు

మల్కాజిగిరి, సెప్టెంబర్ 06(ప్రజా కలం ప్రతినిధి): మేడ్చల్-- మల్కాజిగిరి జిల్లా నేరేడ్‌మెట్‌లోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం మన్నెకుల సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అభివృద్ధి, సభ్యుల ఐక్యత, సామాజిక




సమస్యలు,భవిష్యత్ కార్యాచరణపై నాయకులు, సభ్యులు విస్తృతంగా చర్చించారు. సంఘ సభ్యులంతా ఐక్యంగా ఉంటూ పరస్పరం సహకరించుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని కోరారు. సంఘ సభ్యుల సంక్షేమం, సామాజిక అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. కార్యక్రమంలో మన్నెకుల సంఘం నాయకులు, ప్రతినిధులు,సభ్యులు తదితరులు పాల్గొన్నారు.






## హామీలు అమలు చేయకపోతే కాంగ్రెస్‌ను నిలదీస్తాం !

తల్లాడ సెప్టెంబర్ 6, ప్రజా కలం న్యూస్

అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు,13 డిక్లరేషన్లు,420 హామీలను తక్షణమే అమలు చేయాలని సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సండ్ర వెంకట వీరయ్య డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో నీలి నగరాలు చూపుతూ అబద్ధపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి, ఇప్పుడు ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా కాలయాపన చేయడం సరికాదని ఆయన మండిపడ్డారు. తల్లాడ మండలం అన్నారు గూడెం గ్రామంలో రైతులు మహిళలతో కలిసి ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ సాగునీరు అందక పంటలు ఎండిపోతుంటే, మూగజీవాలకు తాగడానికి నీళు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కాలువల ద్వారా తక్షణమే నీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలకే పరిమితం కాకుండా, ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చే వరకు బిఆర్ఎస్ పార్టీ తరఫున పోరాటాలు సాగిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రెడ్డెం వీర మోహన రెడ్డి,ఆ పార్టీ మండల కార్యదర్శి దుగ్గిదేవర వెంకట్ లాల్, అన్నారుగూడెం సర్పంచ్ గొడ్ల ప్రభాకర్,బాలపేట మాజీ సర్పంచ్ కోసూరి వెంకట నరసింహారావు, జోనల్ సభ్యులు, అంజనాపురం ఉప సర్పంచ్ కేతినేని చలపతిరావు, గోపాలపేట ఉప సర్పంచ్ శనక్కాయల సత్య నారాయణ, వెంగన్న పేట ఉప సర్పంచ్ బోడ శ్రీను,బిల్లుపాడు ఉప సర్పంచ్ తూము కృష్ణార్జున రావు, వార్డు మెంబర్లు, బిఆర్ఎస్ పార్టీ తల్లాడ టౌన్ అధ్యక్షులు జివిఆర్, మేడ శ్రీనివాసరావు, సొసైటీ డైరెక్టర్ దగ్గుల రాజశేఖర్ రెడ్డి, బిఆర్ఎస్ మండల నాయకులు దొడ్డ చిన్న శ్రీనివాసరావు, ఆ పార్టీ మండల యువజన నాయకులు వేమా శ్రీనివాసరావు, నాయకులు ఇస్నపల్లి శ్రీను, సత్యనారాయణ, సత్తెనపల్లి వేలాద్రి, ముచ్చుంతల నరసింహారావు, స్టాలిన్,నాగు,గొడ్ల సీతారాములు,గొడ్ల యేసురత్నం, ఇస్నపల్లి దిలీప్, సునీల్ కుమార్, మహిళలు,యువకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA, PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com